ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శుక్రవారం 30 అక్టోబర్ 2026 | Friday 30 octobar 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 191 | Vol.No 28 Issue No .191 | www.visionandhra.in

తెలంగాణలో పెట్టుబడులకు
నేనే సంరక్షకుడిని!

- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ..
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం
- పెట్టుబడిదారులకు సీఎం రేవంత్ రెడ్డి భరోసా..
- హైదరాబాద్‌ను ప్రపంచ నగరాలతో పోటీపడేలా తీర్చిదిద్దుతాం

హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భద్రత కల్పించడంతో పాటు, అవి అభివృద్ధి చెందేలా చూడటం తన వ్యక్తిగత బాధ్యత అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పెట్టుబడిదారులకు తాను సంరక్షకుడిగా ఉంటానని భరోసా ఇచ్చారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో పాటు రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకాటి శ్రీహరి, మహ్మద్ అజారుద్దీన్, పారిశ్రామికవేత్తలు, విధాన రూపకర్తలు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిగతా2లో..

వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు సమష్టి కృషి అవసరం

- తెలంగాణ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామి..
- పెట్టుబడులు, ఉద్యోగాలతో రాష్ట్ర ప్రగతికి బాటలు
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

హైదరాబాద్: వికసిత్ భారత్2047 లక్ష్యాన్ని సాధించేందుకు దేశంలోని ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో అన్ని రాష్ట్రాలు, అన్ని రంగాలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మిగతా2లో..



దీపావళి కానుక పేరుతో సైబర్ నేరగాళ్ల కొత్తరకం మోసం..!
జాగ్రత్తగా ఉండండి

- ప్రధాని మోదీ పేరుతో వాట్సాప్ లో నకిలీ సందేశాలు ప్రచారం
- రూ.8 వేలు కానుక అంటూ ప్రజలను బురిడీ కొట్టించే యత్నం

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 29: దీపావళి పండుగ సందర్భంగా సైబర్ నేరగాళ్లు కొత్తరకం మోసానికి తెరలేపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వం పేరుతో వాట్సాప్ లో నకిలీ సందేశాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీపావళి కానుకగా ప్రధాని మోదీ ప్రతి ఒక్కరికీ రూ.8 వేలు ఇస్తున్నారంటూ ఆశ చూపిస్తున్నారు. పండుగ సమయంలో డబ్బు వస్తుందనే ఆశతో చాలామంది ఈ సందేశాలను నమ్మి మోసపోతున్నారు. సైబర్ నేరగాళ్లు పంపుతున్న ఈ నకిలీ సందేశాలు మిగతా2లో..

కేటీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పిన మాజీ మంత్రి కొండా సురేఖ!

- కేటీఆర్ పై గతంలో చేసిన వ్యక్తిగత దూషణలపై విచారం..
- నిరాధార వ్యాఖ్యలు చేయకుండా ఉండవలసిందని సంచలన ఒప్పుకోలు!
- తెలంగాణలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయా?
- కాంగ్రెస్ వీడి బిఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందా?
- మంత్రి పదవి పోవడం, పరువు నష్టం దావా భయం
- రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా చర్చ!

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 29: తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం రేపే పరిణామం చోటుచేసుకుంది. గత కొంతకాలంగా తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారిన మాజీ మంత్రి కొండా సురేఖ వ్యవహారం మరో మలుపు తిరిగింది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై గతంలో తాను మాట్లాడిన మాటలపై ఆమె బహిరంగంగా క్షమాపణ చెప్పారు. కేటీఆర్ పై గతంలో చేసిన వ్యక్తిగత దూషణల పట్ల విచారం వ్యక్తం చేస్తూ ఆమె వివరణ ఇచ్చారు. ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో ఆ విధంగా మాట్లాడానే తప్ప, ఉద్దేశపూర్వకంగా మాట్లాడలేదని మిగతా3లో..

రాహుల్ గాంధీ ప్రధాని కావడం తథ్యం
ఎమ్మెల్సీ ఫలితాలు ఇచ్చిన క్లియర్ సంకేతం

- వారణాసి నుంచి నాగ్‌పూర్ వరకు, పాట్నా నుంచి పూణే వరకు బీజేపీకి చరిత్రలో నిలిచిపోయే చావుదెబ్బ
- మోడీ, అమిత్ షా, యోగి, ఫడ్నవీస్, రాజ్‌నాథ్ కంచుకోటల్లోనే కాంగ్రెస్ జెండా ఎగిరింది
- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ప్రెస్ మీట్
- గాంధీ భవన్‌లో దేశ రాజకీయాలపై సుదీర్ఘ విశ్లేషణ

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 29: దేశ వ్యాప్తంగా జరిగిన గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి ఘోరమైన, చారిత్రాత్మకమైన పరాజయం ఎదురైందని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సొంత కంచుకోటల్లోనే ప్రజలు బీజేపీని తిరస్కరించారని, ఇది మోడీ పాలనపై దేశ ప్రజల్లో ఉన్న తీవ్రమైన వ్యతిరేకతకు నిదర్శనమని స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఎన్నికల ఫలితాలు కేవలం ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కాదని, దేశంలో రాబోయే రాజకీయ మార్పుకు నాంది అని అన్నారు.

మోడీకి మీడియా ఫోబియా - ప్రెస్ మీట్ పెట్టే దమ్ము, ధైర్యం లేదు

ప్రధాన మంత్రి అయి 12 సంవత్సరాలు దాటినా ఒక్కసారి కూడా స్వతంత్రంగా ప్రెస్ మీట్ పెట్టే దమ్ము లేని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అని మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. జర్నలిస్టులను ఫేస్ చేసే ధైర్యం మోడీకి లేదని, అందుకే దేశ వ్యాప్తంగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలపై మోడీ ట్విట్టర్‌లో వెకిలిగా ట్వీట్ వేసి ప్రధాన మంత్రి స్థాయిని మిగతా3లో..

రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగమా..
అనుముల రాజ్యాంగమా?

- రేవంత్ రెడ్డి పాలనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- మూసీ ప్రాజెక్టు పేరుతో రూ.1.5 లక్షల కోట్ల దోపిడీకి కుట్ర..
- 9 జిల్లాల్లో కరువు, రైతులకు ట్యాంకర్లే దిక్కు

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 29: తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డిని అభినవ నిరో చక్రవర్తి, అభినవ నిర్లక్ష్య చక్రవర్తిగా అభివర్ణిస్తూ.. రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం అమలవుతోందా? లేక అనుముల రాజ్యాంగం నడుస్తోందా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖననం చేసి, ఇందిరమ్మ ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. బుధవారం బీఆర్ఎస్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మూసీ ప్రాజెక్టు పేరుతో భారీ దోపిడీకి కుట్ర

రాష్ట్రం కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో, మూసీ సుందరీకరణ పేరుతో రూ.1.5 లక్షల కోట్ల భారీ ప్రాజెక్టుకు తెరలేపడం ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజల సొమ్మును, పేదల పన్నుల ఆదాయాన్ని ఒకే ప్రాజెక్టు పేరుతో దోచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. మూసీ భూసేకరణకు సంబంధించి నిర్వహిస్తున్నట్లు చెబుతున్న ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలకు అవకాశం కల్పించడం లేదని ఆరోపించారు. అధికారులు తమకు తామే విచారణ నిర్వహించుకుని, తమకు తామే ధ్రువీకరణలు ఇచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రజాప్రతినిధులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యమా? అని నిలదీశారు. మాట్లాడే హక్కు, ప్రశ్నించే హక్కులను అణచివేస్తున్నారని ఆరోపించారు.

తొమ్మిది జిల్లాల్లో కరువుకు ప్రభుత్వమే కారణం

ఆంధ్రప్రదేశ్‌లో లేని కరువు తెలంగాణలో ఎందుకు వచ్చిందని మిగతా2లో..

నీటి వృథాపై నిఘా..
PAANI యాప్‌తో జరిమానాలు!

- నీటి దుర్వినియోగాన్ని ఫొటో తీసి ఫిర్యాదు చేయండి..
- చర్యలు తీసుకుంటాం: మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రతి కుటుంబం నీటి వినియోగాన్ని 20 శాతం తగ్గించాలి..
- నవంబర్ 1 నుంచి నిర్మాణాలకు ఎస్టీపీ నీరు తప్పనిసరి

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 29: హైదరాబాద్ నగరంలో తాగునీటి వృథాను అరికట్టి, నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చే లక్ష్యంతో జలమండలి రూపొందించిన PAANI (వాటర్ వారియర్స్) మొబైల్ యాప్‌నులిలి హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. నీటి దుర్వినియోగాన్ని ప్రజలు ఫొటోలతో సహా యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం నోటీసులు, జరిమానాలు విధిస్తారని తెలిపారు. జలమండలి ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎండీ అశోక్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు మిగతా2లో..

జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్. కృష్ణయ్య విజ్ఞప్తి

సచివాలయంలో భేటీ - కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఓబీసీ కుల గణన చేయించాలని కోరిక

తెలంగాణ స్టేట్ బ్యూరో విజన్ ఆంధ్ర అక్టోబర్ 29,సెక్రటేరియట్: దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో కుల గణనతో పాటు తప్పనిసరిగా 'ఓబీసీ' కాలమ్ చేర్చాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య మిగతా2లో..

అర్నబ్ తుపాను అనంతర చర్యలు..
రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్!

- అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల వేగవంతం
- అంటువ్యాధుల నివారణకు పవన్ కల్యాణ్ ఆదేశాలు
- 9 జిల్లాల నుంచి 475 మంది సిబ్బందితో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు

అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తక్షణ మిగతా2లో..

కొందరు తుపాను హెచ్చరికలను ఎగతాళి చేశారు..
తర్వాత వాస్తవం తెలుసుకున్నారు

- అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే
- బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా
- రెండు రోజుల్లో 100% విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యమని ప్రకటన
- రూ.4600 కోట్ల ప్రాథమిక నష్టం జరిగిందని కేంద్రానికి నివేదిక
- నష్టపోయిన రైతులకు పరిహారం, పునరావాస శిబిరాల నుంచి వెళ్లేవారికి ప్రత్యేక ప్యాకేజీ

మిగతా2లో..

పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు..

- నేర నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి: జిల్లా ఎస్పీ డి.జానకి
- జడ్చర్ల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీ చేసిన ఎస్పీ
- రికార్డుల నిర్వహణ నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వరకు సమగ్ర సమీక్ష
- దర్యాప్తు నాణ్యత పెంచాలని, నేరస్థులకు శిక్షలు పడేలా చూడాలని ఆదేశం

మిగతా2లో..

అర్నబ్ తుపాను అనంతర చర్యలు..

చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని, ప్రజారోగ్యం విషయంలో ఎలాంటి ఆపద తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు త్వరగా నెలకొనేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలను వేగంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 9 జిల్లాల నుంచి మొత్తం 475 మంది సిబ్బందితో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, పర్యావరణ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటాయి. అదేవిధంగా, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక వాటర్ టెస్టింగ్ బృందాలను కూడా రంగంలోకి దించారు. నీటి ద్వారా వ్యాధులు ప్రబలకుండా నివారించడం, పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచడంపై ఈ బృందాలు దృష్టి సారిస్తాయి.

జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్. కృష్ణయ్య విజ్ఞప్తి

గారు డిమాండ్ చేశారు. సచివాలయంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జనగణనలో ఓబీసీలకు అన్యాయం జరుగుతోందని, దీనిపై కేంద్రం మీద ఒత్తిడి తీసుకురావాలని మంత్రిని కోరారు. గతంలో జనగణనలో కుల గణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ ఆగస్టు 14న విడుదల చేసిన 40 ప్రశ్నల్లో ఎస్సీ, ఎస్టీ, అదర్స్ అని మాత్రమే ఉందని, ఓబీసీ కాలమ్ లేకపోవడం తీవ్ర అభ్యంతరకరమని ఆయన అన్నారు. కులాల వారీగా లెక్కలు అడగకుండా ఓబీసీల లెక్కలు ఎలా తెలుస్తాయని ఆయన ప్రశ్నించారు. కులాల వారీగా లెక్కలు ఉంటేనే ఓబీసీల నిజమైన జనాభా తెలుస్తుందని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల విషయంలో ఇది కీలకమని ఆయన వివరించారు. కోర్టుల్లో రిజర్వేషన్లు 50 శాతం మించి అడుగుతున్నప్పుడల్లా, ఖచ్చితమైన కులాల వారీగా జనాభా లెక్కలు అంటే ఎంపైరికల్ డేటా అడుగుతున్నారని, ఓబీసీ కాలమ్ ఉంటేనే ఈ లెక్కలు స్పష్టంగా వస్తాయని తెలిపారు. 2011 తర్వాత ఇప్పుడు జనాభా లెక్కలు జరుగుతున్న నేపథ్యంలో, కేంద్రం జనగణనలో కుల గణన చేర్చాలని ఇప్పటికే తెలంగాణ శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ తీర్మానాన్ని ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణకు వస్తున్న సందర్భంగా, అన్ని రాజకీయ పార్టీల బీసీ శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు మరియు బీసీ సంఘాల ప్రతినిధులను కలుపుకొని వెళ్లి "ఓబీసీ కాలమ్ పెట్టాలని" ఒక్కటే డిమాండ్‌తో అమిత్ షా ను కలవాలని ఆర్. కృష్ణయ్య గారిని మంత్రి పొన్నం ప్రభాకర్ గారు కోరారు. ఓబీసీ కాలమ్ పెట్టడం వల్ల జనాభా లెక్కలు ఖచ్చితంగా తెలుస్తాయని, దాని ఆధారంగా చట్టసభల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు పెంచడానికి, బడ్జెట్ కేటాయింపులు చేయడానికి మరియు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ప్రక్రియ సులభమవుతుందని ఇరువురు అభిప్రాయపడ్డారు.

దీపావళి కానుక పేరుతో సైబర్ నేరగాళ్ల కొత్తరకం మోసం..!

చాలా నమ్మదగినట్లుగా రూపొందించబడు తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో, కేంద్ర ప్రభుత్వ లోగో, అధికారిక ప్రకటన మాదిరిగా ఉండేలా డిజైన్ చేసి, దీపావళి శుభాకాంక్షలు చెబుతూ, కానుక మొత్తాన్ని పొందడానికి కింద ఇచ్చిన లింక్ పై క్లిక్ చేయాలని కోరుతున్నారు. ఈ సందేశాలు కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ఫార్వర్డ్ చేయాలని, అప్పుడే కానుక డబ్బు ఖాతాలో జమ అవుతుందని కూడా రాస్తున్నారు. దీంతో ఒకరి నుంచి మరొకరికి ఈ నకిలీ సందేశం వేగంగా వ్యాపిస్తోంది. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం దీపావళి కానుక పేరుతో రూ. 8 వేలు ఇస్తున్నట్లు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ప్రధాని కార్యాలయం, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, పీఎంఓ అధికారిక వెబ్సైట్ లలో ఇలాంటి పథకం గురించి ఎటువంటి సమాచారం లేదు. అయినప్పటికీ సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ పేరును దుర్వినియోగం చేసి ప్రజలను మోసం చేస్తున్నారు. పండుగ సీజన్ లో ప్రజలు ఆనందంలో ఉంటారు, డబ్బు అవసరం ఎక్కువగా ఉంటుంది, అందుకే ఈ సమయాన్ని ఆసరాగా చేసుకుని మోసగాళ్లు ఈ కొత్త ఎత్తుగడకు పాల్పడుతున్నారు. ఈ నకిలీ సందేశంలో ఉన్న అనుమానాస్పద వెబ్సైట్ లింక్ పై క్లిక్ చేయడం చాలా ప్రమాదకరం. ఆ లింక్ తెరిచిన వెంటనే అది నకిలీ వెబ్సైట్ కు తీసుకెళ్తుంది. అక్కడ పేరు, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ వంటి సున్నితమైన సమాచారం అడుగుతారు. కొన్ని సందర్భాల్లో ఆ లింక్ పై క్లిక్ చేస్తేనే ఫోన్ లో వైరస్ చేరుతుంది. ఆ వైరస్ ద్వారా ఫోన్ లోని బ్యాంకింగ్ యాప్ లు, పాస్ వర్డ్ లు, కాంటాక్ట్ లు మొత్తం నేరగాళ్ల చేతికి వెళ్లిపోతాయి. తర్వాత వారి బ్యాంక్ ఖాతాలోని డబ్బును కొల్లగొడతారు, లేదా వారి పేరుతో ఇతరులకు మోసపూరిత కాల్స్ చేస్తారు. ఈ మోసంపై పోలీసు శాఖ ప్రజలను అప్రమత్తం చేస్తోంది. అనుమానాస్పద, నకిలీ వెబ్సైట్ లింకులపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయొద్దని పోలీసులు సూచిస్తున్నారు. వాట్సాప్ లో వచ్చే ఇలాంటి నకిలీ సందేశాలను నమ్మవద్దని, వెంటనే డిలీట్ చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఏ పథకం అయినా అధికారిక వెబ్సైట్, అధికారిక పత్రికా ప్రకటన ద్వారానే ప్రకటిస్తుందని, వాట్సాప్ ఫార్వర్డ్ మెసేజ్ ద్వారా ఎప్పుడూ డబ్బు ఇవ్వదని గుర్తు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చాలా ముఖ్యం. ముందుగా తెలియని నంబర్ నుంచి వచ్చే లింక్ లను తెరవకూడదు. ప్రధాని పేరుతో వచ్చినా, ప్రభుత్వ పేరుతో వచ్చినా, వెంటనే నమ్మకూడదు. లింక్ లో ఉన్న వెబ్సైట్ చిరునామాను జాగ్రత్తగా చూడాలి. అధికారిక ష్ట్రజూ://స్త్రశీజ.అఅ తో ముగిసే వెబ్సైట్ లే కాకుండా, చిన్న అక్షర తేడాలతో ఉండే నకిలీ సైట్లు ఎక్కువగా ఉంటాయి. ఎవరికీ ఓటీపీ, సీవీవీ నంబర్, బ్యాంక్ పిన్ చెప్పకూడదు. డబ్బు పొందడానికి ముందుగా రుసుము కట్టాలని అడిగితే అది 100 శాతం మోసమే. ఒకవేళ ఎవరైనా ఈ నకిలీ లింక్ పై క్లిక్ చేసి తమ వివరాలు పంచుకున్నట్లయితే, వెంటనే తమ బ్యాంక్ కు ఫోన్ చేసి అకౌంట్ ను బ్లాక్ చేయించాలి. 1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేయాలి. నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఆన్లైన్ లో ఫిర్యాదు నమోదు చేయాలి. సమీప పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు ఇవ్వాలి. మోసం జరిగిన సమయంలో స్క్రీన్ షాట్ లు, మెసేజ్ లు భద్రపరచడం చాలా ఉపయోగపడుతుంది. పండుగ అంటే ఆనందం, పంచుకోవడం, కానీ అదే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ఒక చిన్న క్లిక్ వల్ల కష్టపడి సంపాదించిన మొత్తం పోవచ్చు. కాబట్టి దీపావళి కానుక పేరుతో వచ్చే ఏ వాట్సాప్ సందేశాన్ని కూడా నమ్మవద్దు, ఎవరికీ ఫార్వర్డ్ చేయవద్దు. పోలీసుల సూచనలను పాటించి, సురక్షితంగా పండుగ జరుపుకోండి.

వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు సమష్టి కృషి అవసరం

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం దసరా, కర్వా చౌత్, దీపావళి పండుగల సమయం కాగా, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ మరో పండుగలా నిలుస్తుందని పీయూష్ గోయల్ అభివర్ణించారు. పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పనకు ఈ సదస్సు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

700 ఏళ్ల క్రితమే వాణిజ్యానికి ప్రాధాన్యం

సుమారు 700 ఏళ్ల క్రితమే కాకతీయ చక్రవర్తి గణపతిదేవుడు నౌకా వాణిజ్యానికి సంబంధించి మోటుపల్లి శాసనం ద్వారా కీలక సందేశాన్ని ఇచ్చారని మంత్రి గుర్తుచేశారు. అప్పట్లోనే వ్యాపారులు తమ పెట్టుబడులకు భద్రత, విధాన నిర్ణయాల్లో స్థిరత్వాన్ని కోరుకున్నారని తెలిపారు. నేటి పారిశ్రామికవేత్తలు కూడా ఇదే విధమైన భరోసాను ఆశిస్తున్నారని పేర్కొన్నారు. భారత్ ప్రపంచంలోని అగ్ర ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచిందని, అంచనాలకు మించిన వేగంతో దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోందని అన్నారు. మధ్య ఆసియా సంక్షోభం సహా అంతర్జాతీయంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, సంప్రదాయ అంచనాలను అధిగమించి ఎగుమతుల వృద్ధిని సాధించామని తెలిపారు.

తెలంగాణ లక్ష్యానికి కేంద్రం సహకారం

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యాన్ని పీయూష్ గోయల్ స్వాగతించారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడుల పెంపు, పరిశ్రమల విస్తరణ, ఉద్యోగాల కల్పనకు అవసరమైన అవకాశాలను మరింత మెరుగుపర్చాలని సూచించారు. హైదరాబాద్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు (జీసీసీ), కృత్రిమ మేధ (ఏఐ), లైఫ్ సైన్సెస్ రంగాల్లో ముందంజలో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే బలంగా ఉన్న ఫార్మా, బయోటెక్నాలజీ రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ రంగం, క్వాంటం కంప్యూటింగ్ వంటి అధునాతన సాంకేతిక రంగాలపై మరింత దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణలోని తాండూరు కందులు, నిజామాబాద్ పసుపు వంటి ప్రత్యేక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మంచి అవకాశాలున్నాయని తెలిపారు. భౌగోళిక గుర్తింపు (జీఐ) ట్యాగ్ పొందిన తాండూరు కందులను ఆస్ట్రేలియాకు ఎగుమతి చేసిన విషయాన్ని ప్రస్తావించారు. స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడం ద్వారా రైతులకు, వ్యాపారులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. సులభతర వాణిజ్య విధానాలను మరింత మెరుగుపరిచి, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని మంత్రి సూచించారు. తెలంగాణలో పెట్టే ప్రతి పెట్టుబడి, కల్పించే ప్రతి ఉద్యోగం రాష్ట్ర అభివృద్ధితో పాటు వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దోహదపడుతుందని పీయూష్ గోయల్ స్పష్టం చేశారు.

పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు..

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర,అక్టోబర్ 29: జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ మరింత పటిష్టం చేసేందుకు జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ ప్రత్యేక దృష్టి సారించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి జడ్చర్ల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ పోలీసు రికార్డులు, గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల సంఖ్య, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను ఎస్పీ సమగ్రంగా పరిశీలించారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితిపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. తనిఖీలో భాగంగా ముఖ్యమైన రికార్డులు, రిజిస్టర్లు, కేసు డైరీలు, క్రైమ్ రికార్డులు, కోర్టు కేసులు, వారెంట్లు, సీసీటీఎన్ఎస్ (జజుచీూ) ఆన్‌లైన్ రికార్డుల నిర్వహణను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, ఏ రికార్డులోనూ పెండింగ్ ఉండకూడదని అధికారులకు సూచించారు. ఆన్‌లైన్ రికార్డులు మరియు భౌతిక రికార్డుల మధ్య సమన్వయం ఉండాలని, తద్వారా కేసుల పురోగతి ఎప్పటికప్పుడు స్పష్టంగా తెలుస్తుందని ఆదేశించారు. సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరుపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారం, దర్యాప్తు నాణ్యత, నేరస్థులపై నిఘా, రౌడీషీటర్ల పర్యవేక్షణ, వారెంట్ల అమలు, బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీ, మహిళలు మరియు బాలల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై ఒక్కొక్కటిగా అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి అంశంలోనూ ప్రస్తుత పరిస్థితిని అంచనా వేసి, మెరుగుదలకు అవసరమైన సూచనలు చేశారు. కేసుల దర్యాప్తు విషయంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ స్పష్టం చేశారు. శాస్త్రీయ ఆధారాలు మరియు సాక్ష్యాలను సమర్థవంతంగా సేకరించాలని, సాక్షుల వాంగ్మూలాలను బలోపేతం చేయాలని సూచించారు. దర్యాప్తును నిర్దేశిత సమయంలో పూర్తి చేసి, నేరస్తులకు శిక్షలు పడేలా కోర్టు కేసుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, కేసుల పరిష్కారంలో వేగం పెంచాలని, పెండింగ్ కేసుల పరిష్కారంలో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం ఉండకూడదని హెచ్చరించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తన పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, సిబ్బందికి తగిన మార్గనిర్దేశం చేయాలని ఎస్పీ సూచించారు. నేరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, నేరాలు జరిగిన తర్వాత కాకుండా జరగకుండా ఉండేందుకు నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. ప్రజలతో సమన్వయంతో పనిచేస్తూ పోలీసులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించేలా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు. ఫిర్యాదుదారులను నిర్లక్ష్యం చేసే ధోరణి ఉండకూడదని, ప్రతి ఫిర్యాదును సున్నితంగా పరిగణించాలని సూచించారు. పోలీస్ సేవల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలను దర్యాప్తులో వినియోగించాలని చెప్పారు. సిబ్బంది క్రమశిక్షణ, విధి నిర్వహణ మరియు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ముందుండాలని సూచించారు. ఈ వార్షిక తనిఖీ ద్వారా సర్కిల్ పరిధిలో పోలీసు వ్యవస్థ పనితీరును సమగ్రంగా సమీక్షించిన ఎస్పీ, ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసు సేవలు అందించేందుకు అవసరమైన దిశానిర్దేశం చేశారు. నేర నియంత్రణే ప్రధాన లక్ష్యంగా ప్రతి అధికారి, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో DCRB DSP రమణా రెడ్డి, జడ్చర్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేష్, SP CC రామ్ రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణలో పెట్టుబడులకు నేనే సంరక్షకుడిని!

ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ కీలక కేంద్రం

సుమారు 400 ఏళ్ల క్రితమే హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా గుర్తింపు పొందిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. చార్మినార్ పరిసర ప్రాంతాలకు వివిధ దేశాల నుంచి వ్యాపారులు వచ్చి ముత్యాలు, సుగంధ ద్రవ్యాలు, వెండి కళాకృతుల వ్యాపారం చేసేవారని గుర్తుచేశారు. చారిత్రక కట్టడాలు, మ్యూజియంలు, విమానాశ్రయం, రైల్వేలు, విద్యాసంస్థలతో హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్న మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా, అడోబ్ సీఈవో శంతను నారాయణ్ వంటి ప్రముఖులు ప్రపంచస్థాయిలో రాణిస్తున్నారని చెప్పారు. అంతర్జాతీయ ప్రతిభను తీర్చిదిద్దడంలో, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. మాజీ ప్రధానమంత్రులు రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు దేశ అభివృద్ధికి చేసిన కృషిని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల్లో రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన మార్పులు దేశ సాంకేతిక ప్రగతికి పునాది వేశాయని పేర్కొన్నారు. 1991లో ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించేందుకు పీవీ నరసింహారావు ప్రభుత్వం సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పీజీ) సంస్కరణలను అమలు చేసిందని గుర్తుచేశారు. హైదరాబాద్ అభివృద్ధికి వివిధ రాజకీయ పార్టీల ప్రభుత్వాలు తమ వంతు కృషి చేశాయని, పెట్టుబడుల ప్రోత్సాహంలో అందరి సహకారం ఉందని తెలిపారు.

పెట్టుబడులు రెట్టింపు చేయండి

తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు ముందుగా నిర్ణయించుకున్న పెట్టుబడి మొత్తాన్ని రెట్టింపు చేయాలని సీఎం పిలుపునిచ్చారు. తమ వృద్ధి అంచనాలను, లాభాల లక్ష్యాలను కూడా పెంచుకోవాలని సూచించారు. పెట్టుబడిదారులకు అవసరమైన విధానపరమైన నిర్ణయాలు, ప్రభుత్వ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. వ్యాపార రంగంపై పారిశ్రామికవేత్తలకే ఎక్కువ అవగాహన ఉందని, వారి అభిప్రాయాలను స్వీకరించి ఆచరణలో పెడతామని వెల్లడించారు. పెట్టుబడుల మార్గంలో ఉన్న అడ్డంకులను తొలగించడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు. అవసరమైన చోట ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి, వ్యాపార అవకాశాలను విస్తరించాలన్నారు. హైదరాబాద్ ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు నగరాలతో మాత్రమే కాకుండా న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యం

'తెలంగాణ రైజింగ్ 2047' రాష్ట్ర భవిష్యత్ ప్రణాళిక అని సీఎం వివరించారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తన సంకల్పమని ప్రకటించారు. 2047 నాటికి భారతదేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగితే, అందులో తెలంగాణ వాటా 10 శాతానికి చేరాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా సుమారు ఐదు శాతంగా ఉందని పేర్కొన్నారు.

కేంద్ర సహకారంతో మౌలిక సదుపాయాల అభివృద్ధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలపై పెట్టుబడిదారులకు ఎలాంటి సందేహాలు అవసరం లేదని సీఎం అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరిస్తోందని తెలిపారు. దేశంలో ప్రతిపాదించిన ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లలో హైదరాబాద్‌చెన్నై, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌పుణె మార్గాలు ఉండటం రాష్ట్రానికి ప్రయోజనకరమన్నారు. వరంగల్, ఆదిలాబాద్‌లలో విమానాశ్రయాల ఏర్పాటు, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ, నేవీ రాడార్ కేంద్రం వంటి ప్రాజెక్టుల ద్వారా మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు తమ ఉత్తమ ఆలోచనలు, విధానపరమైన సూచనలు అందించాలని సీఎం కోరారు. వాటిని పరిశీలించి, సాధ్యమైన సూచనలను ప్రభుత్వ విధానాల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని, అందరం కలిసి ఎదుగుతూ చరిత్ర సృష్టిద్దామని పిలుపునిచ్చారు. జై హింద్, జై తెలంగాణ అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

నీటి వృథాపై నిఘా..

PAANI యాప్‌తో జరిమానాలు!

పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నీరు ప్రతి ఒక్కరికీ అవసరమైన ఉమ్మడి సంపద అని, భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నందున తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని చెప్పారు. ప్రతి కుటుంబం నీటి వినియోగాన్ని కనీసం 20 శాతం తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు.

ఫొటోతో ఫిర్యాదు.. అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

పరిసరాల్లో ఎక్కడైనా తాగునీరు వృథా అవుతున్నా, దుర్వినియోగం జరుగుతున్నా ప్రజలు ూూూచీ× యాప్ ద్వారా ఫొటో తీసి ఫిర్యాదు చేయవచ్చని మంత్రి తెలిపారు. ప్రతి ఫిర్యాదుకు ఎస్ఎంఎస్ ఆధారిత ధ్రువీకరణ ఉంటుందని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటారని వివరించారు. నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలనుకునే పౌరులు జలమండలి వెబ్‌సైట్‌లో 'సేవ్ వాటర్ వాలంటీర్'గా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఇందుకు ప్రభుత్వ గుర్తింపు పత్రం తప్పనిసరని, వాలంటీర్ల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఉత్తమ సేవలందించిన వాటర్ వారియర్స్‌తో ముఖ్యమంత్రి స్వయంగా సమావేశమై అభినందిస్తారని తెలిపారు.

నిర్మాణాలకు ఎస్టీపీ నీరు తప్పనిసరి

నవంబర్ 1 నుంచి భవన నిర్మాణాలు, గ్రీన్ వాటర్ ట్యాంకులకు ఎస్టీపీ (మురుగునీటి శుద్ధి కేంద్రం)లో శుద్ధి చేసిన నీటిని వినియోగించడం తప్పనిసరి అని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణాలు, పరిశ్రమలు, పార్కులు, గార్డెనింగ్ వంటి అవసరాలకు తాగునీటికి బదులుగా శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సూచించారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. గేటెడ్ కమ్యూనిటీల్లోనూ వాటర్ హార్వెస్టింగ్‌కు ప్రాధాన్యమివ్వాలని కోరారు. తాగునీటిని వాహనాలు కడగడానికి, ఫ్లోరింగ్ శుభ్రం చేయడానికి ఉపయోగించరాదని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు పొంగిపొర్లకుండా చూసుకోవడంతో పాటు పైపుల లీకేజీలను వెంటనే అరికట్టాలని సూచించారు. ప్రతి వ్యక్తికి రోజుకు 120 లీటర్ల నీటిని అందిస్తున్నామని, నగరంలో రోజుకు 15 వేల ట్యాంకర్లకు డిమాండ్ వస్తోందని తెలిపారు. గ్రామాల్లో ఇంటింటికీ ఇంకుడు గుంతలు, పొలాలకు ఫామ్ పాండ్లు, గ్రామాలకు ఊరుకుంటల ఏర్పాటు ద్వారా భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. నీటి కొరతను నివారించాలంటే ప్రభుత్వ చర్యలకు ప్రజల సహకారం అవసరమని, ప్రతి పౌరుడు వాటర్ వారియర్‌గా మారి నీటిని పొదుపుగా వినియోగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగమా.. అనుముల రాజ్యాంగమా?

కేటీఆర్ ప్రశ్నించారు. నీటిని నిల్వ చేసుకోవాలని, వృథాగా దిగువకు వదలవద్దని గతంలో ఎన్నిసార్లు సూచించినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రతిపక్షం చెప్పిన సూచనలను పరిగణనలోకి తీసుకోకపోవడంతో తొమ్మిది జిల్లాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను వినియోగించుకుంటూ నీటి సమస్యను ఎదుర్కొనే ప్రయత్నాలు చేశారని, కుప్పం ప్రాంతానికి కూడా నీటిని తరలించే చర్యలు చేపట్టారని కేటీఆర్ పేర్కొన్నారు. నీటి నిర్వహణలో రెండు రాష్ట్రాల మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. తెలంగాణలో నెలకొన్న పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు.

రైతులకు అండగా ఉండాల్సింది పోయి.. ట్యాంకర్లతో నీళ్లు

ఎన్నికల సమయంలో రైతు డిక్లరేషన్ పేరుతో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు రైతుల నుంచే సెల్ఫ్ డిక్లరేషన్లు తీసుకుంటోందని కేటీఆర్ విమర్శించారు. పంటలను కాపాడుకోవడానికి రైతులే ట్యాంకర్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పొలానికి నీరు అందక ట్యాంకర్‌తో నీటిని తీసుకెళ్లిన ఓ రైతుపై చర్యలు తీసుకున్నారని ఆరోపించారు. రైతు తన పంటను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తే అతనిపైనే కేసులు పెట్టడం దారుణమని అన్నారు. రైతు సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. వ్యవసాయానికి అవసరమైన నీటిని అందించడంలో విఫలమైందని ఆరోపించారు.

క్రాప్ హాలిడే.. పవర్ హాలిడే.. హామీలకూ హాలిడే

రాష్ట్రంలో క్రాప్ హాలిడే, పవర్ హాలిడే, కన్‌స్ట్రక్షన్ హాలిడే పరిస్థితులు నెలకొన్నాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకూ ప్రభుత్వం విరామం ప్రకటించిందని విమర్శించారు. సింగరేణిలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాల కారణంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై ప్రభావం పడుతోందని ఆరోపించారు. పరిశ్రమలు, వ్యవసాయం, గృహాలకు విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని రంగాలకు హాలిడే ప్రకటించినట్లుగా పాలన సాగుతోందని, చివరకు ప్రభుత్వానికే హాలిడే ఇస్తే ప్రజలకు ఉపశమనం లభిస్తుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

క్షమాపణలతో నిజం మారదు

కొండా సురేఖ క్షమాపణల అంశంపై స్పందించిన కేటీఆర్.. నిజం నిలకడ మీద తేలుతుందని అన్నారు. గతంలో ఓ వార్తాపత్రిక క్షమాపణ చెప్పిందని, ఇప్పుడు కొండా సురేఖ క్షమాపణలు చెప్పారని పేర్కొన్నారు. తమపై తప్పుడు ఆరోపణలు చేసినవారు, వ్యక్తిగత కక్షతో అబద్ధాలు ప్రచారం చేసినవారు భవిష్యత్తులో మరిన్ని క్షమాపణలు చెప్పాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. చివరికి చరిత్ర ఎవరి పక్షాన ఉందో తేలుతుందని కేటీఆర్ అన్నారు.

కొందరు తుపాను హెచ్చరికలను ఎగతాళి చేశారు..

"తుపానును మనం పూర్తిగా నివారించలేం. కానీ, మనకు ఉండే ప్రత్యేక పరిస్థితుల్లో దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించాలి. అర్నబ్ తుపానును సమర్థవంతంగా ఎదుర్కొని ఎవరికీ ఇబ్బంది లేకుండా చేసే బాధ్యత తీసుకుంటాను" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'అర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సం నేపథ్యంలో గురువారం ఆయన కృష్ణా, పశ్చిమ గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ చర్యలను, భవిష్యత్ ప్రణాళికలను సుదీర్ఘంగా వివరించారు.

ముందస్తు చర్యలతో ప్రాణనష్టం తగ్గించాం

గతంలో 1977 దివిసీమ తుపాను, 1996 కోనసీమ తుపాను సృష్టించిన విధ్వంసాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, ఆ అనుభవాలతో ఈసారి పటిష్టమైన ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. "ఈసారి ఒకే ఒక్క టార్గెట్ పెట్టుకున్నాను, ప్రాణనష్టం సున్నాగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నా. దురదృష్టవశాత్తు ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. టెక్నాలజీని ఉపయోగించి తుఫాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేశాం. రాత్రంతా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ విభాగాలను మోహరించాం. ఏ ప్రాంతంలో ఎంత తీవ్రత ఉంటుందో నిమిష నిమిషానికి సమాచారం అందించాం. దీనివల్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం" అని ఆయన వివరించారు. కొంతమంది తుపాను హెచ్చరికలను ఎగతాళి చేశారని, కానీ తీవ్రత పెరిగాక వాస్తవం గ్రహించారని అన్నారు.

30 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు కళ్లముందు..

ఈ సందర్భంగా 30 ఏళ్ల క్రితం 1996లో వచ్చిన తుఫాను నాటి భయానక పరిస్థితులను చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. "ఆ రోజు నా కళ్ల ముందు ఆ దృశ్యాలు ఇంకా కదలాడుతున్నాయి. అప్పుడు ప్రైవేట్ ఫ్లైట్స్ లేవు, డిఫెన్స్ విమానంలో వచ్చాను. ఆర్మీ హెలికాప్టర్ సిబ్బంది ప్రాణాపాయం ఉంటుందని నన్ను తీసుకెళ్లలేమని చెప్పినా, నేను బలవంతం చేసి వెళ్లాను. రోడ్డు మీద దిగి మత్స్యకార గ్రామాలను చూస్తే భయంకరమైన దృశ్యాలు కనిపించాయి. ముమ్మడివరం, అమలాపురంలో దిగి ప్రజలకు ధైర్యం చెప్పి, రాజమండ్రి ఆర్డీవో ఆఫీసునే సెక్రటేరియట్‌గా మార్చి, ప్రతి మండలానికి ఒక సెక్రటరీని నియమించి వారం రోజుల్లో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చాం. ఆనాటి పరిస్థితులతో పోలిస్తే, ఈరోజు టెక్నాలజీ సాయంతో వేగంగా స్పందించగలుగుతున్నాం" అని ఆయన తెలిపారు.

వెయ్యి మందిని పంపమని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరాను

తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,000 విద్యుత్ స్తంభాలు దెబ్బతింటాయని అంచనా వేయగా, ఒక్క కోనసీమలోనే 8,000 స్తంభాలు నేలకూలాయని చంద్రబాబు తెలిపారు. "తుపాను తీరం దాటిన వెంటనే చెట్లను తొలగించే పనులు ప్రారంభించాం. ఈరోజు మారుమూల గ్రామాలకు కూడా రోడ్లు క్లియర్ చేశాం. విద్యుత్ పునరుద్ధరణే ఇప్పుడు మా ముందున్న ప్రధాన సవాలు. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి 1000 మంది సిబ్బందిని పంపమని కోరాను. అవసరమైతే తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అదనపు సిబ్బందిని తెప్పిస్తాం. ఎల్లుండిలోగా ప్రతి ఇంటికి 100% విద్యుత్ ఇచ్చే బాధ్యత తీసుకుంటాం" అని ఆయన హామీ ఇచ్చారు. టెలికమ్యూనికేషన్ సిగ్నల్స్‌కు అంతరాయం కలగకుండా జనరేటర్లు, డీజిల్ సిద్ధం చేసుకోవాలని ఆపరేటర్లకు సూచించినా, కొందరు నిర్లక్ష్యం చేశారని, వారికి అవసరమైతే ప్రభుత్వమే డీజిల్ ఖర్చులు భరిస్తుందని చెప్పామని అన్నారు.

నష్టపరిహారంపై స్పష్టమైన హామీ

తుపాను వల్ల ప్రాథమికంగా రూ. 4,600 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. "కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడాను. ఆయన స్వయంగా ఫోన్ చేసి శుక్రవారం కేంద్ర బృందాన్ని పంపిస్తానని చెప్పారు. ప్రాథమిక నష్టాల నివేదికను కేంద్రానికి పంపాం. కేంద్ర బృందం పర్యటన తర్వాత పూర్తిస్థాయి నివేదిక అందించి సహాయం కోరతాం" అని తెలిపారు. బాధితులకు అందించే పరిహారంపై స్పష్టత ఇస్తూ, "కొబ్బరి, ఆయిల్ పామ్ చెట్టుకు రూ. 1,500 చొప్పున పరిహారం అందిస్తాం. పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఇతర నిత్యావసరాలతో కూడిన ప్యాకేజీతో పాటు కొంత నగదు కూడా అందిస్తాం. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టం జరగకుండా ఆదుకుంటాం. ఈసారి పంటలకు బీమా కూడా చేయించాం కాబట్టి దిగుబడి తగ్గినా పరిహారం అందుతుంది" అని భరోసా ఇచ్చారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ, ఎన్నికలకు, సహాయక చర్యలకు సంబంధం లేదని, విపత్తు వచ్చినప్పుడు ప్రజలను ఆదుకోవడం తన బాధ్యత అని అన్నారు. గత 'మొంథా' తుపాను పరిహారంపై మాట్లాడుతూ, అర్హులైన ప్రతి రైతుకు నష్టపరిహారం అందిందని, ఈసారి కూడా పక్కాగా అంచనాలు వేసి త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో తుఫానులను తట్టుకునేలా కోస్తా తీరంలోని కీలక ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేసే ఆలోచన ఉందని చంద్రబాబు వెల్లడించారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

సంపాదకీయం

చదువుల వెనుక కార్పొరేట్ గ్రీడ్

ప్రాణం పోసే ఆసుపత్రి బాధ్యత మరిచిపోయి కార్పొరేట్ బిజినెస్ సెంటర్ గా మారిపోతే... మెడిసిన్స్ అమ్మాల్సిన మెడికల్ షాపు కసాయి దుకాణంగా రూపాంతరం చెందితే పరిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందో చెప్పడానికి తాజాగా సుప్రీంకోర్టులో జరిగిన ఈ లీగల్ వార్ఫేరే ప్రత్యక్ష సాక్ష్యం. రూ. 11 వేల క్యాన్సర్ ఇంజెక్షన్ కోసం ఏకంగా రూ. 1,30,000 వసూలు చేయడం, రూ. 15 సెలైన్ డ్రిప్ లైన్ కోసం రూ. 250 పిండడం వంటి సంఘటనలు మన దేశంలోని కార్పొరేట్ హాస్పిటల్స్ చేస్తున్న రియల్ రోడ్‌సైడ్ రాబరీకి అద్దం పడుతున్నాయి. బాధితుడు స్వయంగా ఆ మందులు పంపిణీ చేసే డీలర్ అయి ఉండి, "సార్, నేనే ఈ మందులు సప్లై చేస్తాను, నన్ను కాపాడండి, నా దగ్గరున్న ఇంజెక్షనే వాడండి" అని కాళ్లావేళ్లా పడినా కరగని కార్పొరేట్ రాయి లాంటి మనస్తత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా ఎండగట్టింది. "ఇది సర్దుబాటు కాదు... పగటిదోపిడీ! దారిదోపిడీ" అంటూ జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని, కార్పొరేట్ హాస్పిటల్ మాఫియాను కడిగేసింది.ఒక సామాన్యుడు లేదా మధ్యతరగతి పౌరుడు అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్తే చికిత్స కంటే ముందు బిల్లు చూసి హార్ట్ ఎటాక్ రావడం నేడు గ్యారెంటీగా మారింది. దీని వెనుక మెడిసిన్ చదివిన చదువుల వెనుక దాక్కున్న 'కార్పొరేట్ గ్రీడ్' స్పష్టంగా కనిపిస్తోంది. ఆసుపత్రిలో చేరిన భార్య కీమోథెరపీ కోసం ఆమె భర్త (స్వయంగా డ్రగ్ డిస్ట్రిబ్యూటర్) రూ. 11,000 ఖరీదు చేసే ఇంజెక్షన్‌ను ఆసుపత్రికి తెచ్చి తన వద్ద ఉన్నదే వాడాలని వేడుకున్నాడు. కానీ కార్పొరేట్ రూల్స్ పేరుతో దాన్ని తిరస్కరించిన యాజమాన్యం, తమ ఇన్‌హౌస్ ఫార్మసీ నుంచే దాన్ని కొనుగోలు చేయాలని నిర్బంధించి ఏకంగా రూ. 1,30,000 వసూలు చేసింది. అంటే కేవలం ఒక్క ఇంజెక్షన్‌పై ఏకంగా 1100% ప్రాఫిట్ మార్జిన్‌ను గుంజుకున్నారు. ఇక సెలైన్ ఐవీ సెట్, సిరంజీలు, కాటన్, సర్జికల్ గ్లౌజెస్, కాథెటర్స్ వంటి కన్స్యూమబుల్స్ విషయానికి వస్తే.. ఇవన్నీ హోల్‌సేల్ మార్కెట్‌లో కేవలం రూ. 10 నుంచి రూ. 15లకే లభిస్తాయి. కానీ కార్పొరేట్ ఆసుపత్రులు బాధితుడి పేషెంట్ ఫైల్‌లో వీటికి రూ. 200 నుంచి రూ. 350 వరకు బిల్లు వేస్తూ దోచుకుంటున్నాయి. తయారీ సంస్థ ఒక మందు లేదా సర్జికల్ ఐటమ్‌ను తయారు చేయడానికి అయ్యే ఖర్చు కేవలం రూ. 8 అయితే, దానికి ప్రింట్ చేసే ఎంఆర్‌పీ మాత్రం రూ. 100 లేదా రూ. 200 ఉంటుంది. హాస్పిటల్స్ ఈ ఎంఆర్‌పీ పక్కన బ్రాండ్ పేరు చూపిస్తూ, పేషెంట్ల నుంచి వందల రెట్లు ఎక్కువ డబ్బు గుంజుతున్నాయి.ఈ కేసు విచారణ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి "మేము ధరల విధానాన్ని నిరంతరం సర్దుబాటు చేస్తూనే ఉన్నాం" అని వాదించగా, ధర్మాసనం హై-వోల్టేజ్ ఆక్రోశాన్ని వ్యక్తపరిచింది. "మీ సర్దుబాటు పూర్తిగా దారి తప్పింది! రూ. 11 వేల నుంచి రూ. 1.30 లక్షలు కావడాన్ని సర్దుబాటు అనరు... దోపిడీ అంటారు! మనుషుల ప్రాణాలతో ఆడుకునేటప్పుడు ఇంత పెట్టుబడిదారీ ఆలోచన ఉండాలా? నిస్సహాయ స్థితిలో ఉన్న రోగులకు ఆసుపత్రుల దగ్గర బేరమాడే శక్త్యాయుధాలు ఉండవని మరచిపోవద్దు" అని మండిపడింది. ప్రభుత్వ డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ కింద అత్యవసర మందుల జాబితా ఉన్నప్పటికీ, మార్కెట్లోని 90 శాతానికి పైగా నాన్-షెడ్యూల్డ్ మందులు, లైఫ్ సేవింగ్ క్యాన్సర్ డ్రగ్స్, మెడికల్ డివైజెస్ ఈ కంట్రోల్ పరిధికి పూర్తిగా బయటే ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవల క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి క్యాప్ చేసినట్లు చెబుతున్నా, అసలు నోటిఫై చేయని రూట్లలో ఎంఆర్‌పీలను ఇష్టారాజ్యంగా ప్రింట్ చేసుకునే సడలింపులను కంపెనీలు వాడుకుంటున్నాయి. మూడు పార్లమెంటరీ కమిటీలు నివేదికలిచ్చినా.. తెర వెనుక ఉన్న కార్పొరేట్ సూత్రధారులకు ఆ రిపోర్టులు నచ్చడం లేదు కాబట్టే ప్రభుత్వం మౌనంగా ఉండిపోతోందని ధర్మాసనం ఘాటుగా విమర్శించింది.వివిధ నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ థింక్-ట్యాంక్స్, సర్వేల ప్రకారం భారతదేశంలో హెల్త్‌కేర్ దారిదోపిడీ ఏ స్థాయిలో ఉందో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి..ప్రైవేట్ ఆసుపత్రుల అసోసియేషన్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులపై తీవ్ర ఒత్తిడి ఉంది కాబట్టే ప్రైవేట్ రంగం రాత్రింబవళ్లు సేవలు అందిస్తోందని, 24 గంటలూ సదుపాయాలు సిద్ధంగా ఉంచేందుకు కోట్ల రూపాయల నిర్వహణ ఖర్చు అవుతుందని చెప్పారు. మందుల మార్జిన్లు తగ్గించేస్తే ప్రైవేట్ ఆసుపత్రులు కుప్పకూలిపోతాయని, మార్కెట్లో సగం నకిలీ మందులు ఉన్నందున రోగులు బయటి నుంచి తెచ్చే మందులను తాము నమ్మలేమని వాదించారు. దీనిని సుప్రీంకోర్టు తీవ్రంగా తిప్పికొట్టింది. మీది కార్పొరేట్ హాస్పటల్... పడక రెంట్, డాక్టర్ ఫీజు, వెంటిలేటర్, ల్యాబ్ టెస్ట్‌లు... ప్రతిదానికీ వేర్వేరుగా ఛార్జీలు లాగుతున్నారు కదా... అలాంటప్పుడు మందులను 100%, 200%, 1000% రెట్లు ఎక్కువకు ఎందుకు అమ్మాలి? ప్రైవేట్ ఆసుపత్రి నడుపుతున్నామన్న కారణంతో ఈ ఎంఆర్‌పీని సమర్థించుకోలేరు. నిలదొక్కుకోవడానికి వేరే మార్గాలు చూసుకోండి కానీ, ప్రాణాలు కాపాడాల్సిన మందులపై ఈ దోపిడీ వద్దు... తయారీ సంస్థలు ఇచ్చే కార్పొరేట్ కట్-బాక్స్ డిస్కౌంట్ల గుట్టు ఇంకా బయటకు రాలేదు... అని తేల్చిచెప్పింది. ఆవిష్కరణల పేరుతో కంపెనీలు అధిక ధరలను సమర్థించుకోవడాన్ని తప్పుబడుతూ, గత 30 సంవత్సరాల్లో భారత ఫార్మా పరిశ్రమ సొంతంగా అభివృద్ధి చేసిన ఐదు కొత్త మాలిక్యూల్స్ పేర్లు చెప్పాలని ధర్మాసనం సవాల్ విసిరింది. అంటే విదేశీ పేటెంట్లను రీ-ప్యాకేజింగ్ చేసి, లాభాలు పిండుకోవడం తప్ప మన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ శూన్యమని బట్టబయలు చేసింది.. ప్రధానమంత్రి జన్ ఔషధి కేంద్రాలు ఉన్నప్పటికీ, పెద్ద పెద్ద కార్పొరేట్ డాక్టర్లు జనరిక్ మందులు రాయకుండా, బ్రాండెడ్ ఫార్మా కంపెనీల స్పాన్సర్డ్ ట్రిప్స్ కోసం బ్రాండెడ్ మందులనే రాస్తూ పేషెంట్ల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.న్యాయవాది కిషన్ చంద్ జైన్ దాఖలు చేసిన ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ పూర్తి చేసిన సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. నాన్-షెడ్యూల్డ్ మందులు, సర్జికల్ ఐటమ్స్, కన్స్యూమబుల్స్ ఉత్పత్తుల తయారీ ధరకు, రీటైల్ అమ్మకపు ధరకు మధ్య గరిష్టంగా 30% నుంచి 50% కంటే ఎక్కువ మార్జిన్ ఉండకుండా కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధ నిబంధన తీసుకురావాలి. పేషెంట్లు క్వాలిటీ చెక్ కలిగిన సర్టిఫైడ్ బయటి ఫార్మసీల నుంచి మందులు తెచ్చుకునే వెసులుబాటును ప్రైవేట్ ఆసుపత్రులు నిరోధించకుండా కఠిన చట్టాలు చేయాలి. వైద్యులు తమ ప్రిస్క్రిప్షన్లలో కేవలం కెమికల్ మాలిక్యూల్ నామం మాత్రమే రాయాలి తప్ప, ఫార్మా కంపెనీల బ్రాండ్ పేర్లు రాయకూడదనే నిబంధనను కఠినంగా అమలు చేయాలి. వైద్యం అనేది లాభాలు పిండుకునే బిజినెస్ మోడల్ కాదు... అది రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు! ప్రాణాలను కాపాడాల్సిన ఆసుపత్రులే జేబులు గుల్ల చేసే కసాయి కొట్టులుగా మారితే, ఆ సమాజం వినాశనానికి దారితీస్తుంది. సుప్రీంకోర్టు ఇవ్వబోయే చారిత్రాత్మక తీర్పు భారతీయ హెల్త్‌కేర్ దోపిడీకి చెక్ పెడుతుందో లేదో వేచి చూడాలి!

ఈఎస్ఐ హౌస్ కీపింగ్‌లో ఏం జరుగుతోంది?

హైదరాబాద్, అక్టోబరు 29 : తెలంగాణలోని ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల ఖర్చు భారీగా పెరిగింది. ఈ సేవలకు చెల్లించే ఛార్జీలను ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) అధికారులు భారీగా పెంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2024లో చదరపు అడుగుకు రూ.10గా ఉన్న ఛార్జీని 2025లో రూ.25కు, తాజాగా రూ.49.50కు పెంచారు. కొన్ని చోట్ల అంతకంటే ఎక్కువ చెల్లింపులకు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. దీంతో గతేడాదితో పోలిస్తే 2026లో ఈ సేవలపై దాదాపు రూ.50 కోట్ల అదనపు భారం పడుతోంది. టెండర్లు నిర్వహించకుండా నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు అప్పగించడంపై కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అద్దె కంటే తొమ్మిది రెట్లు ఎక్కువ ఖర్చు ఖైరతాబాద్‌లో 3,060 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దె భవనంలో కొనసాగుతోంది. చదరపు అడుగుకు రూ.15 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ చదరపు అడుగుకు రూ.10 అద్దె చెల్లించాలని నిర్ణయించినప్పటికీ, భవనాల లభ్యత, డిమాండ్‌ను బట్టి యజమానితో చర్చించి అద్దెను ఖరారు చేశారు. దీంతో ప్రభుత్వం నెలకు దాదాపు రూ.45,900 చెల్లిస్తోంది. క్యాన్సర్ చికిత్సలో కొత్త ప్రయోగాలు అయితే, ఇదే భవనంలో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల కోసం నెలకు దాదాపు రూ.4.15 లక్షలు ఖర్చు చేస్తుండటం గమనార్హం. భవనం అద్దెతో పోలిస్తే ఈ వ్యయం తొమ్మిది రెట్లు ఎక్కువ. హౌస్ కీపింగ్‌కు చదరపు అడుగుకు రూ.70.49, సెక్యూరిటీ సేవలకు రూ.65.17 చొప్పున చెల్లిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఇతర డిస్పెన్సరీల్లోనూ ఇదే తరహాలో అధిక వ్యయం చేస్తున్నట్లు ఐఎంఎస్ లెక్కలు సూచిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రాంతీయ ఈఎస్ఐ ఆస్పత్రులు, రెండు డయాగ్నొస్టిక్ కేంద్రాలు, 71 డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో 53 డిస్పెన్సరీలు హైదరాబాద్ రీజియన్ పరిధిలో, 18 వరంగల్ రీజియన్ పరిధిలో ఉన్నాయి. రాష్ట్రంలో 21 లక్షల మంది ఈఎస్ఐ చందాదారులు ఉండగా, వారి కుటుంబసభ్యులతో కలిపి 90 లక్షల నుంచి కోటి మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారు ఛార్జీలు పెరిగినా ఉద్యోగులకు అందని ప్రయోజనం ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల బాధ్యతలను ఐఎంఎస్ డైరెక్టరేట్ పర్యవేక్షిస్తోంది. కాంట్రాక్టర్ల ఎంపిక, ధరల నిర్ణయం, బిల్లుల చెల్లింపులు ఈ విభాగం పరిధిలోనే జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,78,455 చదరపు అడుగుల విస్తీర్ణానికి ఈ సేవలు అందించాల్సి ఉంది. హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల ఛార్జీని చదరపు అడుగుకు రూ.49.50కు పెంచుతూ ఐఎంఎస్ డైరెక్టర్ ఈ నెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ధరలకు జీఎస్టీ అదనం. 2028 జనవరి నుంచి డిసెంబర్ వరకు ఈ ధరలు అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, కొన్ని ప్రాంతాల్లో హౌస్ కీపింగ్‌కు చదరపు అడుగుకు రూ.70.15 వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఖైరతాబాద్‌లో ఈ మొత్తం రూ.70.49గా ఉంది 2020 నుంచి చదరపు అడుగుకు రూ.10 చొప్పున చెల్లిస్తున్నారంటూ సీఎం ప్రజావాణికి పలువురు వినతులు సమర్పించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సంస్థలు ఛార్జీలు పెంచాలని కోరడంతో 2025 మేలో చదరపు అడుగుకు రూ.25 చెల్లించేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. తాజాగా ఈ మొత్తాన్ని రూ.49.50కు పెంచారు. కొన్ని చోట్ల అంతకంటే ఎక్కువ చెల్లించేందుకు కూడా అనుమతులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, ఛార్జీలు పెరిగినా ఉద్యోగులకు పెద్దగా ప్రయోజనం కలగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలాచోట్ల హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సిబ్బందికి నెలకు రూ.12 వేల నుంచి రూ.15 వేల మధ్యే వేతనాలు చెల్లిస్తున్నారు. ఛార్జీల పెంపుతో ఉద్యోగులకు కనీసం రూ.35 వేలకు పైగా వేతనం అందాల్సి ఉన్నప్పటికీ, ఆ ప్రయోజనం కాంట్రాక్టర్లకే దక్కుతోందనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు, ఉద్యోగులకు సంబంధించిన ఈఎస్ఐ, ఈపీఎఫ్ నిధులు నెల తరబడి జమ కావడం లేదని సమాచారం. ఈ సమస్యపై నాచారం ప్రాంతీయ ఆస్పత్రిలో ఉద్యోగులు గత వారం మూడు వారాల పాటు నిరసనలు, ఆందోళనలు చేపట్టినట్లు కథనంలో పేర్కొన్నారు. నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు అప్పగింత ప్రభుత్వ శాఖల్లో రూ.5 లక్షలు దాటిన పనులకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేయాల్సి ఉంటుందని కథనం పేర్కొంది. అయితే, ఐఎంఎస్‌లో కోట్ల రూపాయల విలువైన హౌస్ కీపింగ్, సెక్యూరిటీ పనులను టెండర్లు లేకుండానే నామినేషన్ పద్ధతిలో కొన్ని సంస్థలకు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఛార్జీల పెంపు, కాంట్రాక్టర్ల ఎంపిక, బిల్లుల చెల్లింపుల వెనుక ముడుపుల వ్యవహారం ఉందంటూ కార్మిక వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఐఎంఎస్ డైరెక్టరేట్‌లోని ఓ జాయింట్ డైరెక్టర్ ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. 2024లో ఈ సేవల కోసం రూ.10.50 కోట్లు ఖర్చు చేయగా, గతేడాది రూ.26.35 కోట్లు వ్యయమైంది. 2028 ఆర్థిక సంవత్సరానికి ఈ ఖర్చు రూ.78.5 కోట్లకు పైగా చేరినట్లు కథనంలో పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి దాదాపు రూ.50 కోట్ల అదనపు వ్యయం నమోదవడంపై కార్మికులు, ఉద్యోగులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఛార్జీల పెంపు, టెండర్లు లేకుండా కాంట్రాక్టులు అప్పగింతపై కొందరు ఇప్పటికే కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం.

పొలంలోకి మొసలి భయాందోళనలలో గ్రామస్థులు

మెదక్ జిల్లా, : పాపన్నపేట మండలం ఎంకేపల్లి గ్రామ శివారులో పంట పొలంలో మొసలి కనిపించడంతో రైతులు, గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. వనదుర్గ భవాని ప్రాజెక్టు, మంజీరా పరిసరాల్లో నీటిమట్టం తగ్గడంతో పొలంలోకి వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. అటవీశాఖ అధికారుల సమాచారంతో సంగారెడ్డి నుంచి వచ్చిన రెస్క్యూ టీమ్ మొసలిని పట్టుకుని సురక్షితంగా తరలించింది. మంజీరా పరిసరాల్లో వ్యవసాయ పనులు చేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని, మొసలి కనిపిస్తే దూరంగా ఉండి అటవీశాఖకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

ఎర్రగుంటపల్లిలో తాగునీటి కోసం మహిళల ఆందోళన

మంచిర్యాల : గ్రామంలో తాగునీటి కోసం నిరసనలు ప్రారంభమయ్యాయి. చెన్నూరు మండలం ఎర్రగుంటపల్లిలో తాగునీటి బోరు మోటారును తొలగించారని ఆరోపిస్తూ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ సర్పంచ్ భర్త రామయ్య మోటారును తొలగించారని గ్రామస్తుల ఆరోపణ. మోటారును తిరిగి ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు.

రాహుల్ గాంధీ ప్రధాని కావడం తథ్యం

దిగజార్చుకుంటున్నారని ఆరోపించారు. ట్వీట్ పెట్టి పైశాచికానందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. నిజంగానే మోదీకి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై స్పందించాలని ఉంటే, ఢిల్లీలో కానీ, వారణాసిలో కానీ ప్రెస్ మీట్ పెట్టి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో ఎన్ని గెలిచామన్నది ముఖ్యం కాదు, ఎక్కడ గెలిచామన్నది ముఖ్యమని, కొడితే కుంభస్థలాన్ని కొట్టాలన్నట్లు కాంగ్రెస్ పార్టీ సరిగ్గా అక్కడే కొట్టిందని, బీజేపీ కంచుకోటలలోనే బుల్లెట్ దించిందని అన్నారు.

నాగ్‌పూర్‌లో బీజేపీని ఓడించి సత్తా చూపించాం
- RSS కోటలో కాంగ్రెస్ జెండా

RSS హెడ్ క్వార్టర్స్ ఉండే నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచి సత్తా చూపించిందని గౌడ్ అన్నారు. బీజేపీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సొంత టౌన్ కూడా అయిన నాగ్‌పూర్‌లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అభిజిత్ వంజారి, బీజేపీ అభ్యర్థి సుధాకర్ కోహ్లేపై చారిత్రాత్మక విజయం సాధించారని తెలిపారు. ఇటీవల ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ, మోదీని మాత్రమే కాదు, వాళ్ల అబ్బను కూడా ఓడిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పుడు నాగ్‌పూర్ బీజేపీ అబ్బ అయిన RSS కంచుకోటలో కాంగ్రెస్ జెండా ఎగరేసామని, బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపామని అన్నారు. నాగ్‌పూర్ గెలిచి మోదీ ఛాతీమీద కొట్టామని స్పష్టం చేశారు. నాగ్‌పూర్‌లో బీజేపీ ఓటమి అంటే బీజేపీ మతవరమైన, సమాజాన్ని విడదీసే సిద్ధాంతాలను నాగ్‌పూర్ సాక్షిగా ప్రజలు తిరస్కరించారని అర్థమని, చదువుకున్న యువత, మేధావులు, ప్రజలు బీజేపీ సిద్ధాంతాలను చీ కొట్టారని అన్నారు.

వారణాసిలో ఓటమి మోదీకి చెప్పుపెట్టులాంటిది - నైతిక ఓటమి మోదీ సమాధానం చెప్పాలి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి టీచర్స్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ప్రమోద్ మిశ్రా ఓడిపోయారని, ఇండియా కూటమి పార్టీ అయిన సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్ గెలుపొందారని గౌడ్ తెలిపారు. వారణాసిలో బీజేపీ ఓటమి మోదీ పాలనకు చెప్పుపెట్టులాంటిదని, ఇది మోదీపై తీవ్ర వ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు. మోదీకి నీతి, నైతికత ఉంటే, వారణాసిలో బీజేపీ ఓటమికి బాధ్యత వహించడంతో పాటు తన వైఫల్యాలను అంగీకరించాలని డిమాండ్ చేశారు.వారణాసి నియోజకవర్గంలో బీజేపీ ఓటమి అంటే, అది కూడా మోదీ పాలనకు రిఫరెండం లాంటిదే అని చెప్పే దమ్ము బీజేపీ నేతలకు ఉందా అని ప్రశ్నించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఓడిపోతే అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం పని అయిపోయిందని మాట్లాడే బీజేపీ నేతలు, మోదీ సొంత నియోజకవర్గంలోనే ప్రజలు మోదీకి వ్యతిరేకంగా ఓటు వేసి బీజేపీ అభ్యర్థిని ఓడించిన విషయాన్ని ఏమని సమాధానం చెప్తారని నిలదీశారు. బీజేపీకి కర్ణాటకలో ఒక రీతి, వారణాసిలో మరో నీతి అని విమర్శించారు. యువతలో మోదీ పాలనపై పెరుగుతున్న వ్యతిరేకత, చదువుకున్న వర్గాల్లో మోదీ పాలనపై పెరుగుతున్న అసంతృప్తి ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందని, మోదీ నియోజకవర్గమైన వారణాసిలో బీజేపీ అభ్యర్థి ఓడిపోవడం మోదీ పాలనపై పెరిగిన తీవ్రమైన వ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు.

లక్నో, పాట్నా, పూణే, గోరఖ్‌పూర్, ప్రయాగ్‌రాజ్‌లోనూ బీజేపీకి ఎదురుదెబ్బలు

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్న లక్నోలో గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాన్ని సమాజ్‌వాదీ పార్టీ బీజేపీ నుంచి కైవసం చేసుకుందని, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి కాంతి సింగ్, బీజేపీ అభ్యర్థి అవనీష్ కుమార్ సింగ్‌పై మంచి మెజారిటీతో విజయం సాధించారని అన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాజకీయ ప్రాబల్యం ఉన్న పాట్నాలో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలిందని, ఐదుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన నవల్ కిశోర్ యాదవ్, పాట్నా టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకోలేకపోయారని, =జన అభ్యర్థి సంజీవ్ కుమార్ విజయం సాధించి ఈ స్థానాన్ని బీజేపీ నుంచి కైవసం చేసుకున్నారని తెలిపారు. పూణే డివిజన్ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో బీజా (శరద్‌చంద్ర పవార్) అభ్యర్థి హర్షదా దేశ్‌ముఖ్, బీజేపీ అభ్యర్థి స్మిత జాధవ్‌పై విజయం సాధించారని, అలాగే ప్రయాగ్‌రాజ్‌లోనూ (అలహాబాద్-ఝాన్సీ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ) బీజేపీకి ఎదురుదెబ్బ తగిలిందని అన్నారు. యోగి ఆదిత్యనాథ్ సొంత గడ్డ గోరఖ్‌పూర్‌లో బీజేపీకి గట్టి పోటీ ఎదురైందని, గోరఖ్‌పూర్-ఫైజాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ అభ్యర్థి ధ్రువ్ కుమార్ త్రిపాఠి కేవలం 307 ఓట్ల స్వల్ప మెజారిటీతో మాత్రమే గట్టెక్కారని, అది చావు తప్పి కన్ను లొట్టబోయినట్లైనని వ్యాఖ్యానించారు. మూడు నెలల క్రితం, బీహార్ రాష్ట్రంలోని బాంకీపూర్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో కూడా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రాతినిధ్యం వహించిన స్థానంలో బీజేపీ ఓడిపోయిందని గుర్తు చేశారు. బంకీపూర్ నుంచి వారణాసి వరకు, మోదీ సొంత నియోజకవర్గం వారణాసి నుంచి, రాజ్‌నాథ్ సింగ్ కంచుకోట లక్నో వరకు, దేవేంద్ర ఫడ్నవీస్ సొంత నగరం నాగ్‌పూర్ నుంచి, నితిన్ నబీన్‌కు చెందిన పాట్నా వరకు బీజేపీ అగ్రనేతల కంచుకోటల్లోనే ప్రజలు ఆ పార్టీకి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారని అన్నారు. బంకీపూర్ నుంచి వారణాసి వరకు బీజేపీ అభ్యర్థుల ఓటమి అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తికి నిదర్శనమని, గ్రాడ్యుయేట్, టీచర్స్, యువత, మేధావులు, ఉద్యోగులు అందరూ బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించారని అన్నారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఉన్నా, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నా, కేంద్రంలో కూడా బీజేపీ అధికారంలో ఉన్నా, వారణాసి, నాగ్‌పూర్ లాంటి కీలక స్థానాల్లో బీజేపీ ఓడిపోయిందంటే మోదీ పాలనపై ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. కీలక నేతల సొంత ప్రాంతాల్లోనే ఈ పరిస్థితి ఉంటే, దేశంలో బీజేపీ పరిస్థితి ఏంటో స్పష్టమవుతోందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ మూడు అంకెల సీట్లు కూడా గెలవలేని పరిస్థితి తప్పదని జోస్యం చెప్పారు.

రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీ వ్యతిరేక శక్తులకు పెరుగుతున్న ప్రజా మద్దతు

రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీ వ్యతిరేక శక్తులకు ప్రజా మద్దతు పెరుగుతోందని గౌడ్ అన్నారు. బీజేపీ వంటి ప్రమాదకర రాజకీయ శక్తులను ఓడించాలంటే, వాటికి వ్యతిరేకంగా నిలిచే ప్రత్యామ్నాయ శక్తులకు ఓటు వేయాలనే ప్రజా చైతన్యం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలనే సంకల్పంతో రాహుల్ గాంధీ ప్రజల్లో తీసుకొచ్చిన చైతన్యానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు. తమకు అత్యంత బలమైన రాష్ట్రంగా చెప్పుకునే ఉత్తరప్రదేశ్‌లోనూ బీజేపీకి భారీ ఎదురుదెబ్బ తగిలిందని, ఉత్తరప్రదేశ్‌లో ఎమ్మెల్సీ ఫలితాలు బీజేపీకి పెరుగుతున్న వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఎదురయ్యే పరాజయం ఏ స్థాయిలో ఉంటుందో ఈ ఫలితాలు ముందస్తు సంకేతాలిస్తున్నాయని అన్నారు. ఓటు చోరీ ద్వారా, SIRను అడ్డం పెట్టుకుని మరోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని, వచ్చే ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా ఇండియా కూటమికి ప్రజలు పట్టం కట్టబోతున్నారని, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని ప్రజలు డిసైడ్ అయ్యారని, వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు.

SIRపై సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు, ఢిల్లీలో భారీ నిరసనకు సిద్ధం

SIR ప్రక్రియ దేశంలో అలజడి సృష్టించిందని, SIR పై సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని, కుంటిసాకులు చెప్పేవారికి అది చెంపపెట్టు అని అన్నారు. SIR ద్వారా ఓటర్ల జాబితా నుంచి అక్రమంగా తొలగించిన 13.3 కోట్ల ఓట్లను వెంటనే తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. ఓటు చోరీపై కాంగ్రెస్ ఢిల్లీ నిరసన తో బీజేపీలో వణుకు పుడుతోందని, బీజేపీ ఓటు చోరీకి వ్యతిరేకంగా, నవంబర్ 1న ఢిల్లీలో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో లక్షలాది మంది ప్రజలతో ఇండియా కూటమి భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించనుందని తెలిపారు. రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ర్యాలీకి రైళ్లు నిరాకరించడం కుట్ర అని, ప్రధాని కార్యాలయం, హోంమంత్రి కార్యాలయం నుంచి ఒత్తిడి మేరకు రైల్ల నిరాకరణ జరిగిందని ఆరోపించారు. ఈ కార్యక్రమం ఘన విజయం సాధిస్తే బీజేపీకి దేశ వ్యాప్తంగా ఇబ్బందులు తప్పవని, అందుకే కాంగ్రెస్ కార్యక్రమానికి ప్రజలు ఎక్కువగా రాకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. రాహుల్ గాంధీ అంటే బీజేపీ నేతలకు భయం పట్టుకుందని, బీజేపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ నుంచి వేలాదిమంది ప్రజలు, దేశవ్యాప్తంగా లక్షలాది ప్రజలు నవంబర్ 1న ఢిల్లీ చేరుకోవడం ఖాయమని అన్నారు.

అమిత్ షా రాక వల్ల ప్రయోజనం శూన్యం, హరీష్ రావు, కెసిఆర్ పై సెటైర్లు

రాష్ట్రానికి అమిత్ షా రాక వల్ల ప్రయోజనం శూన్యమని, అమిత్ షా తో ఒరిగేది ఏమీ లేదని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఎల్ నినో ప్రకృతి విపత్తు అని, బటన్ తిప్పితే ఎల్ నినో వస్తుందని హరీష్ రావు అనుకుంటున్నారని, సిద్దిపేట ప్రజలు హరీష్ మాటలు చూసి నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. విపత్తులు వస్తే రాజకీయాలు చేయడం తగదని, ఇష్టానుసారం మాట్లాడితే బండకేసి కొడతారని హెచ్చరించారు. కరోనా విపత్తు వస్తే కెసిఆర్ పారాసిటమాల్ అంటూ వెకిలిగా వ్యవహరించారని గుర్తు చేశారు. కొండా సురేఖకు బాసటగా ఉంటామని, అనిరుధ్ నిధుల అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పర్యవేక్షిస్తుందని, నిధుల కొరత దీనా పాపమని అన్నారు. చివరగా, యువతలో మోదీ పాలనపై, చదువుకున్న వర్గాల్లో మోదీ పాలనపై పెరుగుతున్న అసంతృప్తి ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందని, ఈ మార్పును ఎవరూ ఆపలేరని మహేష్ కుమార్ గౌడ్ తేల్చి చెప్పారు...

కేటీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పిన మాజీ మంత్రి కొండా సురేఖ!

ఆమె చెప్పారు. కొండా సురేఖ ఓ లో కేటీఆర్ పై గతంలో మాట్లాడిన మాటలపై సారీ చెప్పినట్టు కనిపిస్తోంది. ఈ ఒక్క పరిణామంతో తెలంగాణ రాజకీయాల్లో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయా అనే చర్చ జోరుగా సాగుతోంది. కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరే అవకాశం ఉందా అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ అంశంపై రకరకాల చర్చలు జరుగుతున్నాయి.

కేటీఆర్ పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా - కొండా సురేఖ పూర్తి వివరణ ఏమిటి?

మాజీ మంత్రి కొండా సురేఖ తన వివరణలో చాలా స్పష్టంగా కొన్ని విషయాలు చెప్పారు. కేటీఆర్ పై గతంలో చేసిన వ్యక్తిగత దూషణల పట్ల తాను విచారం వ్యక్తం చేస్తున్నానని అన్నారు. ఆనాడు తాను చేసిన కొన్ని నిరాధారమైన వ్యాఖ్యలు చేయకుండా ఉండవలసిందని ఆమె అన్నారు. ఆ వ్యాఖ్యలపై తనకు ఇప్పుడు పశ్చాత్తాపం ఉందని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడిగా కేటీఆర్ ను వ్యక్తిగతంగా విమర్శించడం తన ఉద్దేశం కాదని, ఏదో ఆవేశంలో అలా మాట్లాడానని, అంతే తప్ప ఉద్దేశపూర్వకంగా కేటీఆర్ ను గానీ, ఆయన కుటుంబాన్ని గానీ బాధపెట్టాలని తాను అనుకోలేదని చెప్పారు. కేటీఆర్‌ను లేదా ఆయన కుటుంబ సభ్యులను బాధపెట్టాలని గానీ, వారి ప్రతిష్టను భంగం కలిగించాలనే దురుద్దేశం గానీ తనకు ఎంతమాత్రం లేదని ఆమె స్పష్టం చేశారు. నా వ్యాఖ్యలు కేటీఆర్‌ను గానీ, వారి కుటుంబ సభ్యులను గానీ నొప్పించి ఉంటే అందుకు చింతిస్తూ, ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానంటూ బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఈ క్షమాపణతో రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చ మొదలైంది. కేటీఆర్ పై కొండా సురేఖ గతంలో మాట్లాడిన మాటలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ప్రతిపక్షం నుండి అధికార పక్షం వరకు అందరూ ఈ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. ఇప్పుడు ఆమె స్వయంగా ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయాల్లో విమర్శలు ఉండవచ్చు, కానీ వ్యక్తిగత దూషణలకు దిగకూడదు అనే చర్చను ఈ క్షమాపణ మరోసారి తెరపైకి తెచ్చింది.

మంత్రి పదవి పోయిన నేపథ్యంలో ఈ క్షమాపణ - వెనుక అసలు కారణం ఏంటి?

కొండా సురేఖ మంత్రి పదవి తీసేసిన తర్వాత, ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ క్షమాపణకు రాజకీయ అర్థాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. మినిస్టర్ పదవి నుండి తప్పించిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో ఆమె కొంత అసంతృప్తి తో ఉన్నారనే ప్రచారం ఉంది. సీనియర్ నేత అయిన తనకు పార్టీ సరైన గుర్తింపు ఇవ్వడం లేదని, పార్టీ వైఖరి తనకు నచ్చడం లేదని ఆమె సన్నిహితులు చెబుతున్నారని టాక్ వినిపిస్తోంది. మొత్తం మీద సీనియర్ నేత పట్ల కాంగ్రెస్ పార్టీ వైఖరి నచ్చక పార్టీ వీడొచ్చు అనే భావనలు బలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరే అవకాశం ఉందా అనే చర్చ రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా సాగుతోంది. తెలంగాణలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయా అనే సందేహం రాజకీయ విశ్లేషకుల్లో కూడా వ్యక్తమవుతోంది. ఒక సీనియర్ మహిళా నేత పార్టీ మారితే కాంగ్రెస్ కు మాత్రమే కాదు, రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద ప్రభావం పడుతుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు.

రెండు రకాల చర్చలు - పార్టీ మార్పా? పరువు నష్టం దావా భయమా?

ఈ క్షమాపణ వెనుక రెండు రకాల చర్చలు బలంగా వినిపిస్తున్నాయి. మొదటి చర్చ ఏమిటంటే, సీనియర్ నేత పట్ల కాంగ్రెస్ పార్టీ వైఖరి నచ్చక, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ముందస్తుగా వాతావరణం సిద్ధం చేస్తున్నారా అనేది. పార్టీలో తనకు జరిగిన అవమానం కారణంగా ఈ నిర్ణయం తీసుకుంటారా, బీఆర్ఎస్ తనకు మరింత గౌరవం ఇస్తుందనే ఆలోచనతో ఉన్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండవ చర్చ ఏమిటంటే, కేటీఆర్ పరువు నష్టం దావా వేస్తారనే భయంతోనే ఈ క్షమాపణ చెబుతున్నారా అనేది. పరువు నష్టం కేసు నుండి తప్పించుకోవడానికి ముందస్తుగా ఈ వివరణ ఇచ్చారని వాదన కూడా బలంగా వినిపిస్తోంది. న్యాయపరమైన చిక్కుల నుండి బయటపడేందుకు ఈ క్షమాపణ ఉపయోగపడుతుందా అనే కోణంలో కూడా చర్చ జరుగుతోంది. ఈ రెండు కోణాలపై రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా చర్చ నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో కూడా ఈ పరిణామంపై రకరకాల అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొందరు ఇది సరైన నిర్ణయమని, పొరపాటును ఒప్పుకోవడం గొప్పతనమని అంటున్నారు. మరికొందరు ఇది రాజకీయ వ్యూహంలో భాగమేనని అంటున్నారు.

తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాందా?

మొత్తం మీద చూస్తే, ఒక సీనియర్ నేత బహిరంగంగా క్షమాపణ చెప్పడం అనేది సాధారణ విషయం కాదు. దీని వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయా లేదా నిజంగా పశ్చాత్తాపంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది. తెలంగాణలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయా? కొండా సురేఖ బీఆర్ఎస్ వైపు అడుగులు వేస్తున్నారా? కచ్చితంగా బీఆర్ఎస్ వైపే అడుగులు వేస్తారని జోరుగా చర్చ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ఎలా స్పందిస్తుంది? కేటీఆర్ ఈ క్షమాపణను ఎలా స్వీకరిస్తారు? అనే ప్రశ్నలకు సమాధానం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా చర్చ నడుస్తుంది. సోషల్ మీడియాలో కూడా ఈ అంశంపై తీవ్రస్థాయిలో చర్చ సాగుతోంది. కొందరు కొండా సురేఖ నిర్ణయాన్ని స్వాగతిస్తుండగా, మరికొందరు విమర్శిస్తున్నారు. ఏదేమైనా, తెలంగాణ రాజకీయాల్లో ఈ పరిణామం మాత్రం చాలా కీలకమైనదిగా మారింది. రాబోయే రోజుల్లో ఈ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో చూడాలి.

పోలవరం ప్రాజెక్టులో మరో కీలక మైలురాయి..

90.1 శాతం ఫిజికల్ ప్రోగ్రెస్

ఏలూరు, అక్టోబరు 29: ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా సాగుతుంది. తాజాగా పోలవరం ప్రాజెక్టు మరో ప్రధాన మైలురాయిని చేరుకుంది. సెప్టెంబర్ నాటికి ఈ ప్రాజెక్టు మొత్తం నిర్మాణంలో 90.1 శాతం ఫిజికల్ ప్రోగ్రెస్ సాధించగా, మొదటి విడత కింద 78 శాతం పనులు పూర్తైనట్లు అధికారులు తెలిపారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నీటి వనరుల శాఖ కార్యదర్శి అధ్యక్షతన అక్టోబర్ 12న జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో సమర్పించిన నివేదిక ప్రకారం ప్రాజెక్టుకు సంబంధించిన హెడ్‌వర్క్స్, ప్రధాన కాలువల పనులు తుది దశకు చేరుకున్నాయి. స్పిల్‌వే, గ్యాప్-3లో మెయిన్ డ్యామ్, గ్యాప్-1, 2లలో డయాఫ్రమ్ వాల్స్, అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ కాఫర్ డ్యామ్‌లు, అప్‌స్ట్రీమ్ కాఫర్ డ్యామ్ బట్రెస్, కుడి కాలువ పనులు వంద శాతం పూర్తయ్యాయి. సివిల్ పనుల్లో 88 శాతం ఆర్థిక పురోగతి, భూసేకరణలో 95.6 శాతం పూర్తైందని నివేదిక తెలిపింది. అయితే, నిర్వాసితుల పునరావాసం, పునర్నిర్మాణం పనులు ప్రస్తుతం 51.9 శాతం వద్ద ఉండటంతో, ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి అధికారులు దీనిపై దృష్టి సారించారు. ఆగస్టు 28, 2024న కేంద్ర క్యాబినెట్ ఫేజ్-1 వ్యయం రూ. 30,436.95 కోట్లకు సవరించి ఆమోదం తెలిపింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం నుండి ప్రాజెక్టుకు నిరంతరంగా ఆర్థిక సహాయం అందుతోంది. ఏప్రిల్ 1, 2014 నుండి ఇప్పటివరకు కేంద్రం రూ. 23,485.31 కోట్లను విడుదల చేసింది. ఇందులో నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసేందుకు 2024?25, 2025?26 సంవత్సరాలకు గానూ రూ. 7,862.93 కోట్ల ముందస్తు గ్రాంట్ మంజూరు చేసింది. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశాయి. డిసెంబర్ 2026 నాటికి ప్రాజెక్టు ప్రాథమిక కనెక్టివిటీ పనులన్నీ పూర్తి చేయనున్నారు. మార్చి 2027 నాటికి గ్యాప్-1లోని ఎర్త్-కమ్-రాక్-ఫిల్ డ్యామ్ ఎంబ్యాంక్‌మెంట్ పనులు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. జూన్ 2027 నాటికి గ్యాప్-2 ఎంబ్యాంక్‌మెంట్ పనులతో పాటు స్కాడా కంట్రోల్ బిల్డింగ్, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్లు, యాక్సెస్ రోడ్లు, స్లోప్ ప్రొటెక్షన్ పనులు పూర్తి చేసి ప్రాజెక్టును రెడీ చేయనున్నారు.

వైనాట్ పులివెందుల..

విశాఖపట్టణం, అక్టోబరు 29 : రాజకీయాల్లో గెలుపు ఆశలు ఉండొచ్చు. కానీ అవి రెక్కలు విప్పుకుని మరీ ప్రజాస్వామ్య సూత్రాలను దాటి

వెళ్ళిపోరాదు, అధికార దుర్వినియోగంగా మారరాదు. అంతే కాదు ప్రజల ఆకాంక్షలను దాటి భిన్నంగా ఆలోచించరాదు. ఇది రాజుల కాలం కాదు కోటలను జయించుకోవడానికి, ఇది ప్రజాస్వామ్యం. జస్ట్ అయిదేళ్ళు మాత్రమే అక్కడ అధికారం ఉంటుంది. మళ్ళీ ఎన్నికలు జరిగితే తీర్పు మారుతుంది. అయినా సరే ప్రజాస్వామ్యంలో రాచరిక పోకడలతో వై నాట్ అంటున్నారు రాజకీయ అధినేతలు. అందుకే నాడు కుప్పం జగన్ టార్గెట్ అయితే నేడు పులివెందుల చంద్రబాబు టార్గెట్ అయింది. నిజానికి రాజకీయ పార్టీలు మఠాలు కావు, మడి కట్టుకుని కూర్చోవడానికి. అవి రాజకీయ ప్రాబల్యం కోసం ప్రయత్నం చేస్తాయి, చేయాలి కూడా. అది తప్పు కానే కాదు, జగన్ కుప్పం గెలవాలనుకున్నా చంద్రబాబు పులివెందుల గెలిచి తీరాలనుకున్నా లక్ష్యాలలో విభేదించేవారు లేరు, కానీ అక్కడ పార్టీలు అమలు చేస్తున్న విధానాలనే అంతా తప్పు పడుతున్నారు. అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ప్రత్యర్థి పార్టీ క్యాడర్ ని వేధించి చివరికి గెలిచామని చెప్పుకోవడం వెనక సంతోషం కానీ సంబరం కానీ ఉండదు, అది ఆత్మ సంతృప్తి కోసం మాత్రమే. జగన్ కి కుప్పంలో 2021లో కలిగిన తాత్కాలిక ఆనందం కాస్త 2024 నాటికి పూర్తిగా కరిగిపోయింది. ఎందుకంటే చంద్రబాబు కంచుకోట కుప్పాన్ని గెలిచామని జగన్ సంతోషపడినంత సేపు లేదు, ఏపీ మొత్తాన్ని టీడీపీ కూటమి కబలించి వైసీపీని అధికారంలో నుంచి దించేయడానికి పట్టిన సమయం. మరి నాడు తప్పు అని ఘోషించిన టీడీపీ వర్గాలు ఇపుడు పులివెందుల విషయంలో ఎలా ఒప్పు అనగలవని కూడా ప్రశ్నిస్తారు, అలాగే నాడు ఒప్పు అని కుప్పం కోట మీదకు రాజకీయ దండయాత్ర చేసిన వైసీపీకి ఈ రోజు పులివెందులలో టీడీపీ దండయాత్ర తప్పు ఎలా అనిపించిందో కూడా ఆలోచించాల్సిందే. నిజానికి కుప్పం అంటే చంద్రబాబు కంచుకోట అని భావిస్తారు. ఆయన 1989 నుంచి అక్కడ నుంచే గెలుస్తూ వస్తున్నారు. అందువల్ల కుప్పంలో స్థానిక ఎన్నికల్లో టీడీపీని ఓడిస్తే బాబు కోటకు బీటలు వారాయని చెప్పవచ్చు అనుకుంది వైసీపీ. కానీ అలా జరగలేదు కదా, 2024లో మళ్ళీ చంద్రబాబు అక్కడ నుంచి గెలిచారు. అంతే కాదు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కూడా గెలిచింది. ఇపుడు పులివెందుల మీద చంద్రబాబు టార్గెట్ చేశారు. పులివెందుల అంటే 1978 నుంచి వైఎస్సార్ కుటుంబానికి కంచుకోట, వైఎస్సార్ నుంచి జగన్ దాకా వరసగా గెలుస్తూ వస్తున్నారు. అందువల్ల ఆ కోటను కొడితే జగన్ రాజకీయంగా సరి అన్నది టీడీపీ ఫిలాసఫీ. మరి కుప్పంలో టీడీపీని ఓడిస్తే 2024లో బాబు ఓడలేదు కదా మరి ఈ థియరీ కళ్ళ ముందు ఉంచుకుని మరీ ఈ రోజున పులివెందులలో అన్నీ గెలిచేశామని టీడీపీ సంబరపడడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి అన్నది ఒక చర్చ.

విజిలెన్స్ ఆవేర్నెస్ వీక్ పేరిట వాక్

హైదరాబాద్ : అవినీతి రహిత సమాజం ఏర్పడినప్పుడే దేశం అభివృద్ధిలో ముందుకు సాగుతుందని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దోమన్ యాదవ్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, అవినీతి నిరోధక వారోత్సవాలను పురస్కరించుకొని విజిలెన్స్ అవేర్నెస్ వీక్ పేరిట వాక్ నిర్వహించారు. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు హైదరాబాద్ సంజీవయ్య పార్క్ నుండి జలవిహార్ వరకు గొడుగులతో వినూత్నంగా వాక్ నిర్వహించారు. సమాజాన్ని అవినీతి అనే జబ్బు పట్టిపీడిస్తుందని ... అవినీతిపై పోరాటం చేయాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. అవినీతి రహిత దేశం కోసం పాటుపడాలని నినాదాలు చేస్తూ వాక్ నిర్వహించారు.

నాదెండ్ల మనోహర్ వైపే గురి

గుంటూరు, అక్టోబరు 29 : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో , ముఖ్యంగా డిజిటల్ స్పేస్‌లో ప్రస్తుతం తీవ్రమైన చర్చకు దారితీస్తున్న అంశం జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ లక్ష్యంగా సాగుతున్న సోషల్ మీడియా దాడులు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొంతమంది జనసేన సానుభూతిపరులు, అభిమానులు , శ్రేణులు అని చెప్పుకునే నెటిజన్లు నేరుగా నాదెండ్ల మనోహర్‌ను టార్గెట్ చేస్తూ.. ఆయన పార్టీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని, లేదా ఆయనను పక్కన పెట్టాలని పోస్టులు పెట్టడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. గతంలో అనేక సందర్భాల్లో జనసేనాని పవన్ కళ్యాణ్ స్పందిస్తూ నాదెండ్ల మనోహర్‌ను ఏమైనా అంటే నన్ను అన్నట్లే, పార్టీ కష్టకాలంలో నిలబడిన శ్రేయోభిలాషి ఆయన అని బహిరంగ వేదికలపై స్పష్టమైన హామీ ఇచ్చినా కూడా.. ఈ ప్రచారం తగ్గకపోవడం వెనుక పెద్ద పొలిటికల్ స్కిట్ నడుస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి, 2019 ఘోర పరాజయం తర్వాత జనసేన ఉనికిని కాపాడుకోవడంలో, క్షేత్రస్థాయిలో పార్టీకి ఒక బలమైన ఆర్గనైజేషనల్ స్ట్రక్చర్ తీసుకురావడంలో నాదెండ్ల మనోహర్ పాత్రను ఎవరూ కాదనలేరు. మాజీ స్పీకర్‌గా ఆయనకున్న రాజకీయ అనుభవం, లీగల్ , అడ్మినిస్ట్రేటివ్ పరిజ్ఞానం పవన్ కళ్యాణ్‌కు ఎంతో ఉపకరించాయి. పార్టీ నాయకులు కార్యకర్తలను సమన్వయం చేయడం, పొత్తుల చర్చల సమయంలో టీడీపీ-బీజేపీ అగ్రనేతలతో సంప్రదింపులు జరపడం వంటి క్లిష్టమైన బాధ్యతలను నాదెండ్ల ఎంతో సైలెంట్‌గా నిర్వర్తించారు. అలాంటి వ్యూహకర్తను ఇప్పుడు ఉన్నపలంగా సొంత పార్టీకి చెందిన నెటిజన్లే నిందించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనేది ప్రధాన ప్రశ్నగా మారింది. ఈ టార్గెటింగ్ వెనుక మొదటి ప్రధాన కారణం.. సీట్ల కేటాయింపులు , స్థానిక సంస్థల టికెట్ల అసంతృప్తి . కూటమి ప్రభుత్వంలో జనసేన 21 అసెంబ్లీ స్థానాల్లో 100% స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించినప్పటికీ, స్థానిక ఎన్నికల్లో పొత్తుల కారణంగా అనేకమంది క్షేత్రస్థాయి నేతలకు, పోటీ చేయాలనుకున్న ఆశావహులకు సీట్లు దక్కలేదు. మున్సిపల్, పంచాయతీ, పరిషత్ ఎన్నికలలో కూడా సీట్ల కేటాయింపుల బాధ్యత నాదెండ్ల మనోహర్ నేతృత్వంలోని పిఏసి సమీక్షిస్తుండటంతో.. అవకాశాలు రాని ఆశావహులు తమ కోపాన్ని పవన్ కళ్యాణ్‌పై చూపించలేక, ఆయనకు కుడి భుజంగా ఉన్న నాదెండ్లపైకి మళ్లిస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్‌ను కలవడానికి లేదా ఆయన వరకు తమ ప్రతిపాదనలు తీసుకెళ్లడానికి నాదెండ్ల మనోహర్ ఒక పెద్ద అడ్డంకిగా మారారని, ఆయన అనుమతి లేనిదే అధినేతను కలిసే అవకాశం దక్కడం లేదని ద్వితీయ శ్రేణి నేతలలో కొంత అసహనం ఉంది. రాజకీయాల్లో పార్టీ అధినేత చుట్టూ ఉండే రక్షణ కవచం వంటి నేతలే ఎప్పుడూ క్యాడర్ ఆగ్రహానికి మొదటి బాధితులవుతుంటారు. ఈ క్రమంలోనే పవన్ కంటే ముందు నాదెండ్ల విమర్శల దాడికి గురవుతున్నారు. విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రత్యర్థులు జనసేనను సంస్థాగతంగా బలహీనపరచడానికి డివైడ్ అండ్ రూల్ వ్యూహాన్ని అమలు చేస్తున్నాయనే కోణాన్ని తోసిపుచ్చలేం. నాదెండ్ల మనోహర్‌ను సామాజిక వర్గపరంగా, అలాగే రైట్ హ్యాండ్ స్థానం నుంచి వేరు చేయగలిగితే.. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న పరిపాలనా వ్యవస్థ, సమన్వయం దెబ్బతింటుందనేది ప్రత్యర్థుల ఆలోచన అయి ఉండవచ్చు. సోషల్ మీడియాలో డమ్మీ ప్రొఫైల్స్ ద్వారా జనసేన కార్యకర్తల పేరిట నాదెండ్లపై నెగెటివ్ ప్రచారం చేయించడం ఈ మైండ్ గేమ్‌లో భాగమని భావిస్తున్నారు. అసలు నాదెండ్ల మనోహర్‌ను పార్టీకి దూరం చేస్తే లేదా ప్రాధాన్యత తగ్గిస్తే ఎవరికి లాభం.. ప్రథమంగా, ఇది జనసేనకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది. పవన్ కళ్యాణ్ పూర్తిస్థాయి డిప్యూటీ సీఎంగా నిరంతరం బిజీగా ఉండే సమయంలో పార్టీ రోజువారీ వ్యవహారాలు చూసే అనుభవజ్ఞుడైన అడ్మినిస్ట్రేటివ్ ఫేస్ కరువవుతుంది. రెండవది, కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, బీజేపీలతో సత్సంబంధాలు నెరపే సమన్వయకర్త తగ్గిపోతారు. ప్రత్యర్థులకు ఇది చాలా పెద్ద విజయం కాగా, జనసేనలోని కొన్ని అసంతృప్తి వర్గాలకు తాత్కాలిక సంతోషాన్ని ఇవ్వవచ్చు. సోషల్ మీడియా ట్రోలింగ్స్ , అసంతృప్తులు రాజకీయాల్లో సహజమే అయినప్పటికీ, నాదెండ్ల మనోహర్ లాంటి సీనియర్ నాయకుడి విషయంలో క్రమశిక్షణ తప్పడం పార్టీకి నష్టం కలిగిస్తుంది. పవన్ కళ్యాణ్ స్వయంగా రంగంలోకి దిగి తన స్పష్టమైన సందేశాన్ని మళ్లీ శ్రేణులకు అందిస్తే తప్ప, నాదెండ్లపై సాగుతున్న ఈ డిజిటల్ ప్రచారానికి తెరపడకపోవచ్చు.

స్థానిక ఎన్నికల వేళ టీడీపీలో అంతర్గత సెగ..

విజయవాడ, అక్టోబరు 29 : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకుంటున్న వేళ కూటమి పార్టీల్లో అంతర్గత విభేదాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు, స్థానిక నాయకులకు మధ్య కొనసాగుతున్న అసంతృప్తి ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని కొందరు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, ఎన్నికల సమయంలో సహకరించకపోవడం పార్టీ విజయావకాశాలను దెబ్బతీస్తుందని ఎమ్మెల్యే వర్గాలు భావిస్తున్నాయి. నవంబరు 1న జరగనున్న మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలుగుదేశం పార్టీ లో కొన్ని ప్రాంతాల్లో స్థానిక నాయకులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేలు తమకు సంబంధించిన నాయకులకే ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇతర వర్గాలను పట్టించుకోవడం లేదని అసంతృప్తితో ఉన్న నేతలు ఆరోపిస్తున్నట్లు సమాచారం. దీంతో అధికారిక అభ్యర్థులకు ప్రచారంలో అవసరమైన సహకారం అందడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు, ఎన్నికల సమయంలో అందరూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని ఎమ్మెల్యేలు తమ అనుచరులకు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ కు, స్థానికంగా ఉన్న కొన్ని నాయకుల వర్గాలకు మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారం రాజకీయంగా చర్చకు దారితీసింది. ఆమెకు సన్నిహితంగా ఉన్న నాయకులకు కొందరు స్థానిక నేతలు సహకరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు కూడా కొన్ని వర్గాల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించడం లేదనే చర్చ సాగుతోంది. అయితే ఈ పరిణామాలపై సంబంధిత నాయకుల అధికారిక స్పందనలు, పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది. మున్సిపల్ చైర్మన్, మేయర్ పదవులను ఆశించిన నాయకులకు అవకాశం దక్కకపోవడం కూడా అసంతృప్తికి కారణమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో తెలుగుదేశం నాయకులు, వారి కుటుంబ సభ్యులు పదవులను ఆశించగా, పొత్తులో భాగంగా ఆ స్థానాలు జనసేన , భారతీయ జనతా పార్టీ అభ్యర్థులకు కేటాయించినట్లు తెలుస్తోంది. మరికొన్ని చోట్ల పార్టీ కోసం పనిచేసినప్పటికీ తమకు అవకాశం రాలేదని భావిస్తున్న నేతలు ప్రచారానికి దూరంగా ఉంటున్నారనే వార్తలు వస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం నుంచి సూచనలు వచ్చినా, బుజ్జగింపు ప్రయత్నాలు సాగుతున్నా అసంతృప్తి పూర్తిగా తగ్గడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ, విజయనగరం , కర్నూలు, అనంతపురం, చిత్తూరు వంటి నగరాల్లో స్థానిక నాయకుల మధ్య సమన్వయం ఎన్నికల ఫలితాలకు కీలకంగా మారే అవకాశం ఉంది. అభ్యర్థులకు క్షేత్రస్థాయిలో కార్యకర్తల మద్దతు లభించకపోతే ప్రచార ప్రభావం తగ్గే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకత్వం పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, విభేదాలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అసంతృప్త నేతలకు నామినేటెడ్ పదవులు కల్పించడం ద్వారా వారిని పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా భాగస్వాములను చేసే ఆలోచన కూడా చర్చలో ఉంది. చివరి దశ ప్రచారంలో అసంతృప్తులను ఎంతవరకు సమన్వయం చేయగలరన్నది ఇప్పుడు కీలకంగా మారింది. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు కలిసి పనిచేస్తారా? లేక అంతర్గత పోరు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుందా? అన్నది నవంబరు 1న జరిగే ఎన్నికలతో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

బ్యాలెట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జీరో

న్యూఢిల్లీ, అక్టోబరు29, : నాలుగు ప్రధాన రాష్ట్రాల్లోని శాసనమండలి ఎన్నికల ఫలితాలు వెలువడిన వేళ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని ట్విట్టర్ వేదికగా విసిరిన సెటైర్ వైరల్ అవుతోంది. ఈవీఎంలపై ఆరోపణలు చేస్తూ బ్యాలెట్ ఎన్నికలు కావాలంటున్న కాంగ్రెస్ కు తన ట్వీట్ తో మంట పుట్టించారు మోదీ. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక వంటి నాలుగు పెద్ద రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. పైగా ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారానే జరిగాయి.. కాంగ్రెస్ పార్టీ ఎన్ని సీట్లు గెలుచుకుందో ఊహించండి? అంటూ ప్రధాని మోదీ సంధించిన ప్రశ్న నెట్టింట వైరల్ అవుతోంది. ఏ ఎన్నికల్లో ఓడిపోయినా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పై నెపం నెట్టేసే కాంగ్రెస్ పార్టీకి.. బ్యాలెట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కకపోవడాన్ని పరోక్షంగా ఎత్తిచూపుతూ మోదీ వేసిన సెటైర్ కాంగ్రెస్‌కు సూటిగా తగులుతోంది. ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించగా, కాంగ్రెస్ పార్టీ పోటీ చేసిన నాలుగు రాష్ట్రాల్లో కలిపి ఒక్కటంటే ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేక పూర్తిగా జీరో వద్దే చతికిలపడింది. సొంతంగా అధికారంలో ఉన్న కర్ణాటకలోనూ కాంగ్రెస్‌కు పరాభవం తప్పలేదు. అక్కడ బీజేపీ-జేడీఎస్ కూటమి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంది. ఇక ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్రల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యతతో విజయఢంకా మోగించారు. విద్యావంతులు, పట్టభద్రులు, ఉపాధ్యాయ వర్గాలు ఓటర్లుగా ఉన్న ఈ స్థానాల్లో కాంగ్రెస్ కనీస పోటీ కూడా ఇవ్వలేకపోవడం ఆ పార్టీ కేడర్‌ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టింది. కాంగ్రెస్ పార్టీ , ఇండియా కూటమి పక్షాలు ఎన్నికల ఓటములను కప్పిపుచ్చుకునేందుకు ఈవీఎం ట్యాంపరింగ్ ఆరోపణలను ప్రధాన అస్త్రంగా వాడుతున్నాయి. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ఈవీఎంలను తొలగించి మళ్లీ పాత పద్ధతి అయిన బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు



నిర్వహించాలని రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ అగ్రనేతలు నిరంతరం ఉద్యమిస్తున్నారు. విపక్షాలు కోరుకున్నట్లుగానే బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించినా ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారన్న నిజాన్ని ప్రధాని మోదీ తనదైన శైలిలో తేటతెల్లం చేశారు. ఓటమికి కారణం యంత్రాలు కాదని, కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలేనన్న స్పష్టమైన సంకేతాన్ని ఆయన ఈ చిన్న ట్వీట్‌తో దేశ ప్రజల ముందుంచారు. బ్యాలెట్ పేపర్లతో ఓటింగ్ జరిగినా ఖాతా తెరవలేకపోయిన కాంగ్రెస్.. ఇకపై దేనిని బూచిగా చూపిస్తుందో చెప్పాలంటూ బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో ఎదురుదాడి ప్రారంభించారు. ప్రధాని మోదీ సంధించిన ఈ ఒక్క చురకతో అటు కాంగ్రెస్ నైతిక స్థైర్యం దెబ్బతినడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఈవీఎంలపై రచ్చ చేసేందుకు విపక్షాలకు రాజకీయంగా నోరు మెదపలేని పరిస్థితి ఏర్పడింది.

కాంగ్రెస్ కు సున్నా...

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరిగిన శాసనమండలి సభ్యుల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి నిరాశను మిగిల్చాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఖాళీ అయిన 28 ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేక బోణీ కొట్టకుండానే వెనుదిరిగింది. మరీ ముఖ్యంగా తమ సొంత పాలనలో ఉన్న కర్ణాటకలో సీటింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని సైతం కోల్పోవడం ఆ పార్టీకి మింగుడుపడని పరిణామంగా మారింది. అధికారం చేతిలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఓటమిని మూటగట్టుకోవడం హస్తం పార్టీ శ్రేణులను తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలన్నీ బ్యాలెట్ పత్రాల ద్వారానే జరుగుతాయి. సాధారణంగా ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యక్షంగా సమగ్ర ప్రజాతీర్పును ప్రతిబింబించనప్పటికీ, ప్రాంతీయంగా రాజకీయ సమీకరణాలు, అధికార పంపిణీ , పార్టీ సంస్థాగత బలాబలాలను అంచనా వేయడానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తాయి. ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు ఓటర్లుగా ఉండే ఈ ఎన్నికల్లో 28కి ఒక్క సీటు కూడా సాధించలేకపోవడం కాంగ్రెస్ క్షేత్రస్థాయి మేనేజ్‌మెంట్ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. మిత్రపక్షాలతో సమన్వయం లోపించడం, ప్రత్యర్థుల వ్యూహాలను తిప్పికొట్టలేకపోవడమే ఈ ఘోర పరాభవానికి ప్రధాన కారణమం. పార్టీ అగ్రనాయకత్వం జాతీయ స్థాయి రాజకీయాలు, ర్యాలీలపైనే ఎక్కువ దృష్టి పెడుతూ క్షేత్రస్థాయిలోని నెట్‌వర్క్‌ను పూర్తిగా గాలికి వదిలేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బూత్ స్థాయి నుంచి స్థానిక సంస్థల వరకు బలమైన యంత్రాంగం లేకపోవడం వల్లనే ఇటువంటి ఎన్నికల్లో కాంగ్రెస్ తేలిపోతోంది. ప్రతిపక్షాల వ్యూహాత్మక ఓటింగ్, ఆకర్షణీయమైన అభ్యర్థుల ఎంపికతో ప్రత్యర్థులు పైచేయి సాధిస్తుంటే, కాంగ్రెస్ మాత్రం అంతర్గత విభేదాలు మరియు అనాలోచిత నిర్ణయాలతో మూల్యం చెల్లించుకుంటోంది. 28 స్థానాల్లో సున్నా ఫలితం రావడం అనేది కాంగ్రెస్ పార్టీ ఏమాత్రం ఉపేక్షించలేని తీవ్రమైన హెచ్చరిక. స్థానిక స్థాయిలో అధికార సమీకరణాలు మారడం ,పార్టీ యంత్రాంగం బలహీనపడటం కాంగ్రెస్ కుగడ్డు కాలం ఇంకాపోలేదని నిరూపిస్తున్నాయి. ఈ పరాభవం నుంచి వెంటనే పాఠాలు నేర్చుకుని, సంస్థాగత లోపాలను సరిదిద్దుకోకపోతే కాంగ్రెస్ భవిష్యత్తులో మరింత భారీ వెనుకబాటును ఎదుర్కోక తప్పదు. ఎప్పుడు చూసినా ఓటు చోరీ అంటూ వ్యవస్థలపై పోరాటం చేయడం తప్ప..ప్రజల తరపున పోరాటం చేయని కాంగ్రెస్కు ఇదిఇబ్బందికరమే.

అనకాపల్లి జెడ్పీ పీఠం...బీజేపీ వర్సెస్ జనసేన

విశాఖపట్టణం, అక్టోబరు 29 : అనకాపల్లి లో మొత్తం, 24 మండలాలు ఉన్నాయి. ఉమ్మడి విశాఖ నుంచి విడిపోయి తొలిసారి జిల్లా పరిషత్తుగా రూపు దిద్దుకుంది. ఈ జెడ్పీ పీఠం మీద తొలి చైర్మన్ ఎవరు కావాలి అన్నదే కూటమి పార్టీల మధ్య చర్చ సాగుతోంది. జడ్పీ పీఠాన్ని టీడీపీ అయితే మిత్రులకు వదిలేసి తాను విశాఖ జిల్లా జెడ్పీ పీఠాన్ని తీసుకుంటుందని చర్చ సాగుతోంది. దాంతో ఇక్కడ జనసేన వర్సెస్ బీజేపీల మధ్యనే ఈ పీఠం కోసం పోటీ సాగుతోంది అని అంటున్నారు. దానికి కారణం ఉంది. అనకాపల్లి ఎమ్మెల్యే జనసేనకు చెందిన మాజీ మంత్రి కొణతాల రామక్రిష్ణ అయితే అనకాపల్లి ఎంపీగా బీజేపీకి చెందిన సీఎం రమేష్ ఉన్నారు. దాంతో ఆయన తన పట్టుని కొనసాగించడానికి జెడ్పీ పీఠం బీజేపీకి కావాలని కోరుతున్నారు. ఈ మేరకు ఆయన టీడీపీ పెద్దలతో మంతనాలు జరుపుతున్నారని అంటున్నారు. ఇక ఉత్తరాంధ్రాలో ఆరు జడ్పీ పీఠాలు ఉంటే రెండు తమకు కేటాయించాలని జనసేన కోరుతోంది. అందులో ఒకటి అల్లూరి జిల్లా అయితే రెండవది అనకాపల్లి కావాలని ఆ పార్టీ అడుగుతోంది. అలా కాకపోతే శ్రీకాకుళం అయినా ఇవ్వాలని అంటోంది. ఎందుకంటే విజయనగరం, విశాఖ జెడ్పీలతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా జెడ్పీ టీడీపీ తీసుకుంది. శ్రీకాకుళం జనసేనకు ఇవ్వాలనుకున్నా మేయర్ సీటు ఇప్పటికే ఆ పార్టీకి ఇచ్చారు. జెడ్పీ కూడా అదే పార్టీకి ఇస్తే మొత్తం జిల్లా అంతా ఆ పార్టీకే ఇచ్చినట్లు అవుతుందని తమ్ముళ్ళు అభ్యంతరం చెబుతున్నారు. ఇక జనసేనకు కూడా తామకు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న అనకాపల్లి జిల్లాలోనే జెడ్పీ ఇస్తే బెటర్ అని కోరుకుంటోంది. దానికి టీడీపీ సుముఖంగ ఉంది అని వార్తలు వచ్చాయి. బీజేపీ కూడా అనకాపల్లి జిల్లాలో బలపడాలని చూస్తోంది. అయితే ఆ పార్టీకి జిల్లాలో ఎలమంచిలి మునిసిపాలిటీ చైర్మన్ పదవి ఇచ్చారు. ఇపుడు జెడ్పీ చైర్మన్ కూడా ఎలా ఇస్తారు అని అంటున్నారు. కానీ సీఎం రమేష్ ఎంపీగా తన రాజకీయ పరపతి ఉపయోగించి బీజేపీకి జెడ్పీ చైర్మన్ పీఠం తీసుకుని వస్తారని కమలనాథులు ఆశపడుతున్నారు. ఇక అనకాపల్లిలో చూస్తే కూటమిలో ఏ పార్టీ ఎన్నెన్ని జడ్పీటీసీలకి పోటీ చేస్తోంది అంటే టీడీపీ 15, జనసేన 5, బీజేపీ 4గా ఉంది. ఈ మేరకు కూటమి అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసి ప్రచారంలో పాల్గొంటున్నారు. కూటమి ఒప్పందంలో భాగంగా అనకాపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాన్ని జనసేన పార్టీకి కేటాయించే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల సమాచారంగా ఉంది కానీ బీజేపీ ముందుకు రావడమే విశేషం.

యంగ్ ఇండియా విద్యాలయ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- నాణ్యతా ప్రమాణాలతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- మూడపెల్లిలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న విద్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

విజన్ ఆంధ్ర బ్యూరో । రాజన్న సిరిసిల్ల జిల్లా : చందుర్తి, అక్టోబర్ 29: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయ నిర్మాణ పనులను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. చందుర్తి మండలం మూడపెల్లిలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయాల నిర్మాణం విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడంలో కీలకమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేసి విద్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ పరిశీలనలో వేములవాడ ఆర్డీఓ కేవీఎస్‌బీ కుమారి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రామకృష్ణ, తహసీల్దార్ భూపతి, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలి

- స్పోర్ట్స్ అరీనాలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలి
- అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా,అక్టోబర్ 29,(విజన్ ఆంధ్ర); జిల్లాలోని విద్యా సంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలని, స్పోర్ట్స్ అరీనాలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ నిర్మల్ పట్టణ, గ్రామీణ మండలాల్లో విస్తృతంగా పర్యటించి వివిధ సంస్థలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. సోఫీనగర్‌లోని బాలికల సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాల వసతిగృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు మెరుగైన భద్రతతోపాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెమిస్టర్ పరీక్షల సమయానికి సిలబస్ పూర్తిచేయడంతోపాటు, విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఎంఈసీ విభాగం విద్యార్థులతో మాట్లాడి విద్య, భోజనం, వసతులపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించి, ప్రతిభ కనబరిచిన వారిని

అభినందించి పెన్నులను బహుమతిగా అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దివ్యనగర్‌లోని స్పోర్ట్స్ అరీనాను పరిశీలించిన కలెక్టర్, క్రీడాకారులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని, క్రీడలు ఆడేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. షటిల్ బ్యాడ్మింటన్, పికిల్‌బాల్ కోర్టుల పరిసరాల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. మహాలక్ష్మీవాడ సమీపంలోని అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, జంతువుల స్టెరిలైజేషన్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఖానాపూర్, భైంసా ప్రాంతాల్లోనూ అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డంప్ యార్డును పరిశీలించిన కలెక్టర్, తడి, పొడి చెత్త వేర్పాటు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. గండిరామన్న నుంచి కమలానగర్ వరకు చేపడుతున్న అటవీ, రెవెన్యూ భూముల రీ-సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, అటవీ, రెవెన్యూ శాఖల భూముల హద్దులను స్పష్టంగా గుర్తించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియ భూముల సరిహద్దుల నిర్ధారణకు, భవిష్యత్తులో వివాదాల నివారణకు దోహదపడుతుందని తెలిపారు. ఈ పర్యటనలో డివిఎహెచ్ఓ సురేష్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్లు రాజు, ప్రభాకర్, మున్సిపల్ డీఈ హరిభువన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో రోడ్డు ప్రమాదం..

డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా పడిపోయిన కర్రల లారీ

తిరువూరు : లక్ష్మీపురం గ్రామంలోని వాటర్ ట్యాంక్ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వస్తున్న కర్రల లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో రోడ్డుకు అడ్డంగా పడిపోయింది.తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనతో రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడే పరిస్థితి నెలకొంది.

ఇద్దరు కూతుళ్లతో తల్లి ఆత్మహత్య

మెదక్ : పిల్లల్ని పెంచే స్తోమత లేక ఒక తల్లి తన ఇద్దరు కూతుళ్లతో తల్లి ఆత్మహత్య చేసుకుంది. మెదక్ జిల్లా ఏడుపాయల సమీపంలోని మంజీరా నదిలో తల్లి, ఇద్దరు చిన్నారులు దూకారు. మృతులు మాల్కాపూర్కు చెందిన సరిత (27), కుమార్తెలు వైష్ణవి (7), శాన్విక (6). సరిత భర్త కొన్నేళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి కూలి పనులు చేసుకుంటూ సరిత జీవనం కొనసాగిస్తోంది. పిల్లల పోషణ భారంగా మారడంతో తీవ్ర మనస్తాపం చెందిందని సమాచారం. నదిలో దూకే ముందు తన తండ్రికి ఫోన్ చేసి తన ఆవేదనను తెలిపింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు ప్రారంభించారు..

భూగర్భ జలాల పరిరక్షణకు కఠిన చర్యలు

- తాగునీటి అవసరాలకే కొత్త బోర్లు.. అనుమతి తప్పనిసరి
- బోర్‌వెల్ యజమానులు వారం రోజుల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో పడిపోతున్న భూగర్భ జలమట్టాలను దృష్టిలో ఉంచుకుని నూతన బోర్ల ఏర్పాటుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి అవసరాల కోసమే కొత్త బోర్లు వేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. వాల్టా చట్టం ప్రకారం సంబంధిత తహసీల్దార్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, బోర్‌వెల్ యజమానులంతా భూగర్భ జల శాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో గురువారం భూగర్భ జల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులతో పాటు బోర్‌వెల్ యజమానులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్ల ఏర్పాటుకు సంబంధించిన నిబంధనలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, భూగర్భ జలాల పరిరక్షణ చర్యలపై అధికారులతో చర్చించారు.

వ్యవసాయ బోర్ల ఏర్పాటుకు అనుమతి లేదు

ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఇతర జిల్లాలతో పోలిస్తే రాజన్న సిరిసిల్ల జిల్లాలో భూగర్భ జలమట్టాలు ఆందోళనకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రస్తుతం వ్యవసాయ అవసరాల కోసం కొత్త బోర్లు వేయకూడదని స్పష్టం చేశారు. బోర్‌వెల్ యజమానులు తమ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ముందస్తు అనుమతి పొందాలని, ఐడీఓసీలోని భూగర్భ జల శాఖ కార్యాలయంలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రతి బోర్‌వెల్ యజమాని వారానికి ఎన్ని బోర్లు వేస్తున్నారు, ఎక్కడ వేస్తున్నారు అనే వివరాలను శాఖకు అందజేయాలని ఆదేశించారు.

వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గించేందుకు రైతులు అధిక నీటి వినియోగం ఉండే వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ నీటిని పొదుపుగా వినియోగించాలని పిలుపునిచ్చారు.

మండలాల వారీగా భూగర్భ జలమట్టాలు

జిల్లాలోని వివిధ మండలాల్లో భూగర్భ జలమట్టాల లోతు వివరాలను అధికారులు వెల్లడించారు. బోయినపల్లిలో 4.78 మీటర్లు, చందుర్తిలో 5.31, గంభీరావుపేటలో 8.39, ఇల్లంతకుంటలో 4.65, కోనరావుపేటలో 7.03, ముస్తాబాద్‌లో 8.50, రుద్రంగిలో 7.45, సిరిసిల్లలో 14.62, తంగళ్లపల్లిలో 7.80, వీర్నపల్లిలో 13.03, వేములవాడ రూరల్‌లో 4.81, వేములవాడ అర్బన్‌లో 15.39, ఎల్లారెడ్డిపేటలో 10.91 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నట్లు తెలిపారు. జిల్లా సగటు భూగర్భ జలమట్టం 7.82 మీటర్లుగా నమోదైనట్లు పేర్కొన్నారు. సమావేశంలో భూగర్భ జల శాఖ డీడీ నాగరాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, కలెక్టరేట్ పర్యవేక్షకులు వైశాలి, బోర్‌వెల్ యజమానులు పాల్గొన్నారు.

కొమురం భీమ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఘన నివాళులు

- ఇంద్రవెల్లి కేంద్రంలో పూజలు నిర్వహించి పూలమాలలు వేసిన అధికారులు, ఆదివాసీ నాయకులు

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర)ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన వీర యోధుడు కొమురం భీమ్‌కు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఘనంగా నివాళులర్పించారు. గురువారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కొమురం భీమ్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఐటీడీఏ పీవో మంద మకరందు, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ ఆశయాలు, ఆదివాసీల హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఆదివాసీ సమాజ అభ్యున్నతి, గిరిజనుల హక్కుల పరిరక్షణలో కొమురం భీమ్ పోరాట స్ఫూర్తి ఎప్పటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో మహేందర్, ఎంపీవో సంజీవ్ రావు, కొమురం భీమ్ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మెస్రం నాగ్‌నాథ్, కేస్లాపూర్ రాయిసెంటర్ సార్‌మెడి మెస్రం వెంకటరావు పటేల్, గిన్నెరా రాయిసెంటర్ సార్‌మెడి మెస్రం దుర్గ, ఇంద్రవెల్లి సర్పంచ్ రాథోడ్ మోహన్ సింగ్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, ఆదివాసీ నాయకులు పూర్కా చిత్రు, కనక తుకారామ్, జుగాదిరావు, గేడం భరత్, సుంకట్ రావు, పలువురు ప్రజాప్రతినిధులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా అరెస్ట్

నల్గొండ : తెలుగు రాష్ట్రాల్లో రైతుల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని 29 చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన నలుగురిని సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. మిర్యాలగూడ వేములపల్లి వద్ద వాహన తనిఖీల్లో పట్టుబడిన నిందితుల నుంచి రూ.30 లక్షల విలువైన రెండు కార్లు, రూ.20 లక్షల నగదు, కాపర్ వైర్, కట్టర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు 29 కేసులలో వున్నారని పోలీసులు గుర్తించారు. నల్గొండలో 18 కేసులు, ఏపీలో నాలుగు కేసులు, ఇతర కేసులలో వున్నారు.

పేద ప్రజలకు మరిన్ని సరుకులు

హైదరాబాద్, అక్టోబరు 29 : కరవు పరిస్థితులు తలెత్తవచ్చన్న ఆందోళనల నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం రేషన్ కార్డులపై పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో పా టు కందిపప్పు, గోధుమపిండి, పామాయిల్, చక్కెర, చింతపండు, కారంపొడి వంటి మరిన్ని సరుకులను అందించే ప్రతిపాదనను తీవ్రంగా పరిశీలిస్తోంది.ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల అవసరాలు, సరుకుల సేకరణకు ఏర్పాట్లు, ఎంత పరిమాణంలో ఇవ్వాలి? ఎంతకాలం కొనసాగించాలి? బడ్జెట్‌పై పడే భారం వంటి అంశాలను అంచనా వేయాలని సూచించారు. ఆర్థిక, లాజిస్టిక్స్ పరమైన అంశాలు కొలిక్కి వస్తే, వచ్చే సంక్రాంతి నాటికి ఈ పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది.రాష్ట్రంలో ప్రస్తుతం 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులపై సుమారు 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి నెలకు తలసరి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నారు. ఇందుకు నెలకు 2.18 లక్షల టన్నుల బియ్యం అవసరం. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 14 నెలలకు సరిపడా ఆహార ధాన్యాల బఫర్ స్టాక్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం గోదాముల్లో 9.64 లక్షల టన్నుల బియ్యం నిల్వ ఉండగా, కస్టమ్ మిల్లింగ్ రైస్, ఇతర మార్గాల ద్వారా మరో 18.39 లక్షల టన్నులు సమకూరనున్నాయి. ఈ నిల్వలు 2027 సెప్టెంబర్ వరకు సరిపోతాయని అధికారులు భావిస్తున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో రేషన్ షాపుల ద్వారా పలు రకాల నిత్యావసరాలను అందించేవారు. 2023లో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ కూడా ఇదే తరహాలో పంపిణీని విస్తరిస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ దిశగానే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదల నుంచి ప్రజలను ఆదుకోవడమే

లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందిస్తున్నారు. అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా ఏయే సరుకులు ఎంత పరిమాణంలో ఇవ్వాలనే దానిపై కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుంది.

వడ్లకు రికార్డ్ ధర.. జై శ్రీరామ్ రికార్డ్

తెలంగాణ రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ సిరుల పంట పండిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో వరి ధాన్యానికి ఎన్నడూ లేనంత రికార్డు స్థాయిలో ధర లభిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకం వడ్లు ఏకంగా క్వింటాలుకు రూ. 5,016 పలికి ఆల్ టైమ్ రికార్డు సృష్టించాయి. రాష్ట్రవ్యాప్తంగా నల్గొండ, కరీంనగర్, ఖమ్మం వంటి జిల్లాల్లో సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 3,000 నుంచి రూ. 3,500 వరకు ధర లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం తగ్గడం, ఎల్ నినో ప్రభావం వంటి కారణాలతో దిగుబడిపై అంచనాలు మారాయి. ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల నుంచి ప్రైవేట్ వ్యాపారులు, రైస్ మిల్లర్ల నుంచి భారీ డిమాండ్ ఏర్పడింది. కొందరు వ్యాపారులు రైతులకు అడ్వాన్సులు ఇచ్చి మరీ పంటను కొనుగోలు చేస్తుండటంతో బహిరంగ మార్కెట్‌లో పోటీ పెరిగింది. ఫలితంగా, ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్ ధర చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రభుత్వం ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,461 మద్దతు ధర ప్రకటించగా, ఎంపిక చేసిన 7 సన్న రకాలకు రూ. 500 బోనస్ ఇస్తోంది. దీంతో ప్రభుత్వానికి అమ్మితే రైతుకు గరిష్ఠంగా రూ. 2,961 లభిస్తుంది. అయితే, బహిరంగ మార్కెట్‌లో రూ. 3,500 ధర పలుకుతుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైపు చూడటం లేదు. ఇది ప్రజా పంపిణీ వ్యవస్థ (ఖఊూ) కోసం సన్న బియ్యాన్ని సేకరించాలనుకుంటున్న ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. మరోవైపు, ఈ ధరల పెరుగుదల ప్రభావం సామాన్య వినియోగదారులపై పడుతోంది. రిటైల్ మార్కెట్‌లో సన్న రకం బియ్యం కిలో ధర రూ. 90 నుంచి రూ. 100కి చేరింది."వరికి ఒక్కసారిగా ఇంత ధర పెరుగుతుందని అనుకోలేదు. పెరిగిన ధరలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది" అని ఓ రైతు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా, సన్న రకం బియ్యం ధరల పెరుగుదలకు ఎల్ నినో ప్రభావమే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో తాను సన్న రకం వరి సాగును ప్రోత్సహించినప్పుడు విమర్శలు వచ్చాయని, కానీ ఇప్పుడు దాని ప్రయోజనం రైతులకు అందుతోందని ఆయన వ్యాఖ్యానించారు.ప్రస్తుతం 'జై శ్రీరామ్' రకంతో పాటు, ఆర్ఎన్ఆర్ వంటి ఇతర సన్న రకాలకు కూడా క్వింటాలుకు రూ. 4,300 వరకు ధర పలుకుతోంది. రాబోయే నవంబర్, డిసెంబర్ నెలల్లో పంట కోతలు పూర్తిస్థాయికి చేరిన తర్వాత ధరల తీరు ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

బిగ్ ప్లాన్ లో కేసీఆర్

హైదరాబాద్, అక్టోబరు 29 : ఎగిసిపడే ప్రతి అలకూ తిరిగి పైకి లేచే నైజం ఉంటుంది... అనుభవించిన ఓటమి కంటే.. గుండెల్లో రగిలే ఆత్మగౌరవమే నాయకుడిని మళ్లీ ప్రజాక్షేత్రంలోకి నడిపిస్తుంది.. అలాంటి ఒక ఉద్వేగభరితమైన పోరాటానికి.. తన రాజకీయ జీవితంలో ఎన్నో తుఫాన్లను తట్టుకుని నిలబడిన గులాబీ దళపతి కేసీఆర్ మళ్లీ సిద్ధమవుతున్నారు. 2004లో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన నాటి చారిత్రాత్మక వ్యూహాన్ని తిరిగి 2029లో పునరావృతం చేస్తూ... ఒకవైపు గజ్వేల్ గడ్డపై ఎమ్మెల్యేగా.. మరోవైపు ఉత్తర తెలంగాణ ఉద్యమ నేలపై ఎంపీగా సమరశంఖం పూరించడానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారనే వార్త ఇప్పుడు ప్రతి గులాబీ కార్యకర్త గుండెల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతోంది. తెలంగాణ రాజకీయాలు ఎప్పుడూ ఒక కొత్త మలుపు కోసం ఎదురుచూస్తూనే ఉంటాయి. విజయాలు.. అపజయాలు రాజకీయాల్లో సహజమే అయినా... మళ్లీ పుంజుకోవడం.. మళ్లీ ప్రజాక్షేత్రంలో తిరుగులేని శక్తులుగా నిలబడటమే అసలైన నాయకత్వానికి గురుతు. గులాబీ దళపతి కేసీఆర్ మళ్లీ తన మార్క్ రాజకీయ వ్యూహానికి పదును పెడుతున్నారనే వార్తలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. 2029 రాబోయే సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ఒక సరికొత్త, అసాధారణమైన వ్యూహంతో ముందుకు రాబోతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒకవైపు గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తూనే మరోవైపు ఉత్తర తెలంగాణలోని ఒక కీలక పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా బరిలోకి దిగేందుకు గులాబీ అధినేత సిద్ధమవుతున్నారట..2004 నాటి సెంటిమెంట్... పూర్వ వైభవం దిశగా గులాబీ జెండా ఇది కేవలం ఒక ఎన్నికల వ్యూహం మాత్రమే కాదు... తెలంగాణ గుండెచప్పుడును మళ్లీ మీటే ఒక ఉద్వేగభరితమైన ప్రయత్నం.. 2004 ఎన్నికల్లో కేసీఆర్ కరీంనగర్ ఎంపీగా.. సిద్దిపేట ఎమ్మెల్యేగా పోటీ చేసి సాధించిన అద్భుత విజయం.. ఆ తర్వాతి కాలంలో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన తీరు ఎవరూ మరచిపోలేరు. సరిగ్గా పాతికేళ్ల తర్వాత అదే 2004 నాటి సెంటిమెంట్‌ను.. అదే వ్యూహాన్ని 2029లో పునరావృతం చేయాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఉత్తర తెలంగాణ ఎప్పుడూ గులాబీ దళానికి బలమైన కోట. ఉద్యమ కాలం నుంచి పార్టీకి అండగా నిలిచిన ఆ గడ్డపై కేసీఆర్ స్వయంగా ఎంపీగా పోటీ చేస్తే... ఆ ప్రాంతమంతటా ఒక కొత్త చైతన్యం వెల్లువిరుస్తుందని.. కేడర్‌లో నూరిపోసినట్లు నవనాడుల్లో ఉత్సాహం నిండుతుందని గులాబీ శ్రేణులు భావిస్తున్నాయి. కేసీఆర్ పోటీ చేయడం ద్వారా ఉత్తర తెలంగాణలోని మెజారిటీ అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను క్లీన్ స్వీప్ చేయవచ్చని పార్టీ అంచనా వేస్తోంది.

రాష్ట్రంలో తిరుగులేని అధికారం ఈ మాస్టర్ ప్లాన్ వెనుక కేవలం రాష్ట్రంలో అధికారంలోకి రావడం మాత్రమే కాదు.. కేంద్ర రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించాలనే భారీ లక్ష్యం ఉంది. గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రంలో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడం ఎంత ముఖ్యమో... ఎంపీగా గెలిచి ఢిల్లీ పీఠం వద్ద తెలంగాణ గళాన్ని బలంగా వినిపించడం కూడా అంతే ముఖ్యమని కేసీఆర్ భావిస్తున్నారు. గరిష్ట సంఖ్యలో ఎంపీ స్థానాలను గెలుచుకోవడం ద్వారా కేంద్రంలో చక్రం తిప్పే శక్తిగా బిఆర్ఎస్ ను నిలబెట్టాలనేది ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు ఉద్దేశం. సంచలనమా... సవాలా? ఒక దశాబ్ద కాలం చేసిన అనుభవం, తెలంగాణను తీర్చిదిద్దిన శ్రమ, పడిలేచిన కెరటంలా మళ్లీ ప్రజల మధ్యకు వస్తున్న కేసీఆర్ మార్క్ రాజకీయం ఉమ్మడి తెలంగాణను మరోసారి ఊపేస్తుందనడంలో సందేహం లేదు. అయితే మారిన రాజకీయ సమీకరణలు.. ప్రత్యర్థుల వ్యూహాల నడుమ 2004 నాటి మ్యాజిక్‌ను కేసీఆర్ 2029లో మళ్లీ రీక్రియేట్ చేయగలుగుతారా? ఈ సరికొత్త వ్యూహంతో గులాబీ పార్టీకి పూర్వ వైభవం తెచ్చి రాజకీయ సంచలనానికి తెరతీస్తారా లేక ఈ వ్యూహం ఎలాంటి ఫలితాన్ని ఇస్తుంది? అనేది కాలమే నిర్ణయించాలి. తన రాజకీయ జీవితంలో ఎన్నో తుఫాన్లను తట్టుకుని నిలబడిన ఈ వ్యూహకర్త వేసే తదుపరి అడుగుపైనే ఇప్పుడు తెలంగాణ భవిష్యత్తు ఆధారపడి ఉందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల (ప్రతినిధి)అక్టోబర్ 29 విజన్ ఆంధ్ర : ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జి.ఓ. నం. 59, 76 అమలుపై జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, సింగరేణి భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొన్న నిబంధనలు, అర్హతలు, నిర్దేశిత గడువులకు అనుగుణంగా ప్రక్రియను చేపట్టాలని సూచించారు. నిర్దేశిత కటాఫ్ తేదీకి ముందుగా జరిగిన ఆక్రమణలకు మాత్రమే, సంబంధిత జి.ఓ. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న సందర్భాలలో క్రమబద్ధీకరణ చేపట్టాలని తెలిపారు. భూముల క్రమబద్ధీకరణకు ముందు సంబంధిత భూమి అటవీ భూముల పరిధిలోకి వస్తుందా/లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, అటవీ భూములకు సంబంధించిన చట్టాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అన్ని అంశాలను నిర్ధారించిన అనంతరమే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు. జి.ఓ. నం. 59 ప్రకారం 500 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి నిర్దేశించిన నిబంధనలు, అర్హతలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. జి.ఓ. నం. 76కు సంబంధించి తహసిల్దార్లు, సింగరేణి అధికారుల సమన్వయంతో క్రమబద్ధీకరణ ప్రక్రియను కొనసాగించాలని, సింగరేణి ఉద్యోగులు కాని వారు సింగరేణి క్వార్టర్లలో నివాసం ఉంటున్నట్లయితే, నిబంధనల ప్రకారం వాటిని ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సింగరేణి నిర్మాణాలలో నివాసం ఉంటున్న వారికి సంబంధిత మున్సిపాలిటీల ద్వారా ఆస్తి పన్ను విధించడం, ఇంటి నంబర్లు కేటాయించడం వంటి అంశాలను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి చర్యలు జరిగినట్లు గుర్తిస్తే, సంబంధిత మున్సిపల్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూముల క్రమబద్ధీకరణలో పారదర్శకత పాటిస్తూ, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, సింగరేణి అధికారులు, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు

- అధికారులతో సమీక్షలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి
- యాసంగిలో వరి సాగు వద్దని రైతులకు హితవు
- మాధవనగర్ ఆర్.ఓ.బీ పనులకు రూ. 42 కోట్లు కేటాయించామని వెల్లడి

నిజామాబాద్, అక్టోబర్ 29 :(విజన్ ఆంధ్ర) ఎల్ నినో ప్రభావంతో విపత్కర పరిస్థితులు నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో జిల్లా వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. వచ్చే వేసవి సీజన్ ముగిసే వరకు కూడా అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి హాబిటేషన్ కు రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా ముందస్తుగానే సమగ్ర ప్రణాళికను అమలు చేస్తున్నామని అన్నారు. తీవ్ర వర్షాభావం, భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న దృష్ట్యా రబీలో వరి పంటకు సాగు నీరు అందించే పరిస్థితి లేనందున వరి వేయవద్దని రైతులకు హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, ఆర్.డబ్ల్యూ.ఎస్, గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, ఉద్యానవన, పశుసంవర్ధక, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరా, పశుగ్రాసం, యాసంగి పంటల సాగు, ఆర్ఓబీ ల నిర్మాణ పనుల పురోగతి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాల పనులు, నిజామాబాద్ కార్పొరేషన్ సహా బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ పట్టణాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధాన తాగునీటి వనరులుగా ఉపయోగపడుతున్న నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను పూర్తిగా తాగు నీటి అవసరాల కోసమే వినియోగించాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగిలో తక్కువ నీటి అవసరం ఉండే కూరగాయలు, పప్పు దినుసులు వంటి పంటలు విత్తుకోవాలని కోరారు. ఆరుతడి పంటలకు కూడా అవసరం మేరకే సాగు నీరు వినియోగించుకునేందుకు వీలుగా రైతుల ప్రయోజనాల కోసం అన్ని మండలాలకు సబ్సిడీపై రెయిన్ గన్స్ మంజూరు చేయాలని నిర్ణయించామన్నారు. ఒక్కో యూనిట్ ధర 24 వేలు ఉండగా, అందులో 8 వేలు చెల్లిస్తే మిగతా మొత్తాన్ని ప్రభుత్వం రాయితీ కింద భరిస్తుందని తెలిపారు. కాగా, మూగజీవాలకు కూడా పశుగ్రాసం కొరత, నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చోట నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని, పశుగ్రాసం విత్తనాలు సబ్సిడీపై అందించాలని అధికారులకు సూచించారు. జలాశయాలలో నిలువ ఉన్న నీటిని పూర్తిగా తాగునీటి అవసరాలకు ఉపయోగించేలా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. అవసరమైన చోట పైప్ లైన్ల మరమ్మతులు చేపట్టి లీకేజీలు లేకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరాకు ఉపయోగపడుతున్న చెరువులను పూర్తి స్థాయి నీటి నిల్వలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్తగా బోర్లు తవ్వించకుండా, వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. మున్సిపల్ పట్టణాలలో కొనసాగుతున్న మంచి నీటి ట్యాంకుల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులను వేగంగా చేపట్టాలని సూచించారు. అవసరమైతే కూలీల సంఖ్యను పెంచాలని అన్నారు. యంచ వద్ద గల న్యాల్కల్ పంప్ హౌజ్ ద్వారా నిర్దేశిత గ్రామాలకు రక్షిత మంచి నీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా చుక్క నీరు వృధా కాకూడదని, అదే సమయంలో ఎక్కడైనా దాహార్తి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని స్పష్టం చేశారు.

ఆర్.ఓ.బీ ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

ఇదిలాఉండగా, మాధవనగర్, అర్సపల్లి ప్రాంతాలలో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మాధవనగర్ ఆర్ఓబీ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 13 విడతలలో రూ. 42 కోట్ల నిధులు కేటాయించిందని వివరించారు. అర్సపల్లి ఆర్ఓబీ కి కూడా రూ. 11 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. అయినప్పటికీ కొంత మంది నాయకులు అవగాహన లేకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల సౌకర్యార్థం ఆర్ఓబీ ల నిర్మాణాలను నాలుగైదు నెలల్లో పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులకు గడువు విధించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎక్కడ కూడా నీటి వృధా జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, రక్షిత నీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లైస్ అధికారులు ప్రవీణ్, అరవింద్ రెడ్డి, మిషన్ భగీరథ అధికారులు స్వప్న, రాకేష్, పబ్లిక్ హెల్త్ ఈ.ఈ తిరుపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ నిల్వలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

మంచిర్యాల(ప్రతినిధి) అక్టోబర్ 29 విజన్ ఆంధ్ర : జిల్లాలో బియ్యం అక్రమ నిల్వలు, రవాణాకు పాల్పడటం, అసాధారణంగా ధరలు పెంచడం, కృత్రిమ కొరత సృష్టించడం ద్వారా ప్రజలలో ఆందోళన కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశానికి జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, అధికారులతో కలిసి హాజరై కమిటీ సభ్యులు, బియ్యం వ్యాపారులు, హోల్‌సేల్ వ్యాపారులు, కిరాణా వర్తకులతో బియ్యం నిల్వలు, ధరల నియంత్రణ, మార్కెట్ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బియ్యం నిల్వలు, సరఫరా, ధరల విషయంలో వ్యాపారులు పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు ఎట్టి పరిస్థితులలోనూ పాల్పడరాదని ప్రజలలో అనవసర భయాందోళనలు కలిగించే విధంగా వ్యవహరించవద్దని తెలిపారు. ప్రతి వ్యాపారి రోజువారీగా తమ వద్ద అందుబాటులో ఉన్న బియ్యం నిల్వల వివరాలను స్టాక్ బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని, విక్రయ ధరలను కూడా పారదర్శకంగా అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిత్యావసర వస్తువుల చట్టంతో పాటు వర్తించే ఇతర చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అవసరమైన బియ్యం సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా వ్యాపారులు అధికారులకు సహకరించాలని, మార్కెట్‌లో అనవసర ధరల పెరుగుదల, అక్రమ నిల్వలు చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో డి.హెచ్.ఓ. డిఎంఓ, డి టి సి ఎస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య హాస్టల్‌లో ఏం జరుగుతోంది..?

- హాస్టల్‌లో విద్యార్థిపై దాడి.. ప్రాణాలతో పోరాటం...!
- విద్యార్థుల భద్రత యాజమాన్యం గాలి కొదిలేశారా.....?
- అనుదీప్‌కు న్యాయం చేయాలి....
- కళాశాల యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలి
- విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్

బోడుప్పల్, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): విద్యార్థులకు క్రమశిక్షణ,భద్రత కల్పించాల్సిన విద్యాసంస్థల హాస్టళ్లలోనే ఘర్షణలు చోటుచేసుకుంటే బాధ్యత ఎవరిది? విద్యార్థుల భద్రతను పర్యవేక్షించాల్సిన యాజమాన్యం ఏం చేస్తోంది? బోడుప్పల్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థి కందుల అనుదీప్ (17) తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన ఈ ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, కళాశాల యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అవినాష్,కార్తీక్ డిమాండ్ చేశారు.విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని, బాధిత విద్యార్థికి న్యాయం జరిగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. పోలీసుల విచారణలో

వాస్తవాలు వెలుగులోకి రావడంతోపాటు, హాస్టల్ భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులు సమీక్ష చేపట్టాల్సిన అవసరం ఉందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు.

డబ్బు వివాదమే ఘర్షణకు కారణమా?

ప్రాథమిక సమాచారం ప్రకారం.. బుధవారం రాత్రి శ్రీ చైతన్య కళాశాల హాస్టల్ గదిలో నలుగురు విద్యార్థుల మధ్య డబ్బు విషయమై వివాదం తలెత్తిందని,అది క్రమంగా ఘర్షణకు దారితీయడంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న కందుల అనుదీప్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్పృహ కోల్పోయి కిందపడిపోయిన అతడిని కళాశాల యాజమాన్యం సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. వైద్యులు ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. విద్యార్థి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

పర్యవేక్షణ ఏది.. బాధ్యత ఎవరిది?

పండుగ సెలవుల అనంతరం కళాశాలకు తిరిగి వచ్చిన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకోవడం కలకలం రేపింది. హాస్టల్‌లో విద్యార్థుల మధ్య వివాదం తీవ్ర ఘర్షణగా మారే వరకు పర్యవేక్షణ వ్యవస్థ ఏం చేస్తోంది? రాత్రివేళ విద్యార్థుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఘర్షణలో ఎవరెవరి పాత్ర ఉందనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

పోలీసుల విచారణ.. చర్యల కోసం డిమాండ్

సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు ఆస్పత్రికి, ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని మేడిపల్లి సీఐ డి. జలంధర్ రెడ్డి తెలిపారు. ఘర్షణకు అసలు కారణం ఏమిటి? దాడిలో ఎవరెవరు పాల్గొన్నారు? ఘటన అనంతరం కళాశాల యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించడంలో ఏమైనా జాప్యం జరిగిందా? అనే అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

కుమారుడి పరిస్థితిపై తల్లిదండ్రుల ఆందోళన

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన అనుదీప్ తల్లిదండ్రులు మానస, శ్రీనివాస్ తమ కుమారుడి పరిస్థితిపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థి భద్రత విషయంలో కళాశాల యాజమాన్యం బాధ్యతను కూడా తేల్చాలని వారు కోరుతున్నారు.

కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా

అనుదీప్‌కు న్యాయం చేయాలని, ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భరత్, కౌశిక్, సాయిబాబు, అక్షయ్, అజయ్, ఈశ్వర్, జస్వంత్‌తో పాటు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, టీఆర్ఎస్వీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్నినో ప్రభావం నేపథ్యంలో నీటి పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలి

- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి సూచన...

నిర్మల్ జిల్లా,అక్టోబర్ 29,(విజన్ ఆంధ్ర); ఎల్నినో ప్రభావం నేపథ్యంలో పట్టణంలో తాగునీటి వినియోగం, పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి సూచించారు. నీటి వృథాను అరికడుతూ, భవిష్యత్తులో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులకు పిలుపునిచ్చారు. నిర్మల్ మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. ఎల్నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి వార్డులో కౌన్సిలర్లు ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటింటా నీటిని బాధ్యతాయుతంగా వినియోగించేలా ప్రజలను చైతన్యపరచడంతో పాటు, నీటి వృథాను నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. కౌన్సిలర్లు ప్రస్తావించిన అంశాలపై స్పందించిన వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి.. సంబంధిత మున్సిపల్ అధికారులతో చర్చించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని అధికారులకు తెలిపారు. పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని వైస్ చైర్మన్ పేర్కొన్నారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణను పటిష్ఠం చేయడంతో పాటు, తాగునీటి సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి, వాటికి పరిష్కారం చూపడం ద్వారా పురపాలక సేవలను మరింత మెరుగుపరచాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం. రవిబాబు,మేనేజర్ మారుతీ,శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- అగ్నిమాపక, నిఘా వ్యవస్థలు పటిష్టంగా ఉండాలి
- నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులు, ఔషధ దుకాణాలు, డయాగ్నస్టిక్ కేంద్రాలపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా,అక్టోబర్ 29,(విజన్ ఆంధ్ర); జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచడంతో పాటు అగ్నిమాపక, నిఘా వ్యవస్థలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యారోగ్య శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు సహా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టి, వైద్య పరికరాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరై సమయపాలన పాటించాలని, ఆసుపత్రుల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని ఆసుపత్రులు, ఔషధ దుకాణాలు, రోగ నిర్ధారణ కేంద్రాలు నిబంధనలకు అనుగుణంగా పనిచేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రోగ నిర్ధారణ పరీక్షల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేసే కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించాలని, ప్రజలకు జన ఔషధి మందులపై అవగాహన కల్పించాలని తెలిపారు. టీబీ వ్యాధి నిర్మూలనకు సమన్వయంతో కృషి చేయాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మెరుగైన వైద్య సలహాలు, నిరంతర పర్యవేక్షణ ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, డీసీహెచ్ఎస్ కాశీనాథ్, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా తొర్రూర్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ప్రారంభించారు.

మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 29(విజన్ ఆంధ్ర) : తొర్రూర్ పట్టణం లో మెగా రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను

స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఎస్పి కృష్ణ కిషోర్ సిఐ గణేష్ ఎస్సై మహేందర్ రెడ్డి, ఖాదర్ బాషా తదితరులు ఉన్నారు.

ఇండోశ్రీలంక మైత్రి సేతు సైకిల్ యాత్రకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా,అక్టోబర్ 29,(విజన్ ఆంధ్ర); ఇండోశ్రీలంక మైత్రి సేతు అంతర్జాతీయ సైకిల్ యాత్రలో భాగంగా డిసెంబర్ 22న నిర్మల్ జిల్లాకు చేరుకోనున్న సైక్లింగ్ బృందానికి ఘన స్వాగతం పలికేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాకు చేరుకునే సైక్లింగ్ బృందానికి తగిన వసతి, ఆతిథ్య సౌకర్యాలు కల్పించాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. సైకిల్ యాత్ర ఆదిలాబాద్ జిల్లా వైపు వెళ్లేందుకు అనువైన రూట్ మ్యాప్‌ను రూపొందించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఇండోశ్రీలంక మైత్రి సేతు సైకిల్ యాత్ర వంటి అంతర్జాతీయ కార్యక్రమాలు ఇరు దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. యాత్ర విజయవంతంగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, 32వ బెటాలియన్ ఎన్‌సీసీ ప్రతినిధి సంజీవ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపు నీరే మన జీవనాధారం, కాపాడడం అందరి బాధ్యత - రవీందర్ ముదిరాజ్

హైదరాబాద్ అక్టోబర్ 2026 విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : వర్షపు నీరే మానవాళి మనుగడకు జీవనాధారమని , నీటిని వృధా కాకుండా కాపాడుకొవడం అందరి బాధ్యత అని ప్రముఖ సామాజికవేత్త, సేవాతాత్పరుడు, పర్యావరణ ప్రేమికుడు, కుత్బుల్లాపూర్ జోన్ సి.యం.సి, 'కోల రవీందర్ ముదిరాజ్' అన్నారు. ఇంకుడు గుంతలు ఇంజక్షన్ బోర్ తీద్దాం, వర్షపు నీటిని భూమిలోకి పంపిద్దాం, ఇంకుడు గుంత ఉంటేనే ఇల్లు, ప్లాటు, అపార్ట్మెంట్ రిజిస్ట్రేషన్ చేయాలని ఇంకుడు గుంత ఉంటేనే బోర్ వేయడానికి అనుమతివ్వాలని తద్వారా ప్రస్తుత 'ఎల్నినో' ప్రభావం నుండి బయటపడగలమని 'కోల రవీందర్ ముదిరాజ్' తెలియజేశారు. గురువారంనాడు 'నార్త్ సిటి స్కూల్ విద్యార్థుల సహకారంతో ఆయన నీటిని వృధాచేయరదు అంటూ సూరారం ఎక్స్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. రవీందర్ ముదిరాజ్ నేతృత్వంలో నీటిని కాపాడుకోవాలని, నీరు వృథాగా పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన "నార్త్ సిటీ స్కూల్", కుత్బుల్లాపూర్,జోన్, సిఎంసి కార్పొరేషన్ మేడ్చల్ జిల్లా సూరారంలో విద్యార్థులతో కలిసి 'సేవ్ వాటర్ - సేవ్ లైఫ్' నినాదంతో అందరినీ చైతన్య పరిచారు. వర్షపు నీటిని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా కాపాడుకునే ప్రయత్నం చేయాలని విద్యార్థులతో నినాదాలు పలికించారు. ఇంకుడు గుంతలు తప్పనిసరిగా తీయాలని, ఇంకుడు గుంత ఉంటేనే బోరు వేయడానికి అనుమతి ఇవ్వాలని, బోరు వేసే టప్పుడు వచ్చే నీరు వృధా కాకుండా చూడాలని, నీటిని వృధా చేయరాదు అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులతో కలిసి ఊరేగింపుగా ర్యాలీ రవీందర్ ముదిరాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, బంధువులు వచ్చినప్పుడు చిన్న గ్లాసులో నీళ్లు ఇవ్వాలని, బాత్రూంలో వెస్టన్ కమోడ్ లో నీళ్లు వృధాగా పోకుండా చూడాలని, స్టీల్ ప్లేట్లలో కాకుండా విస్తరాకులలో భోజనం చేయాలని, తక్కువ నీళ్లతో స్నానం చేయాలని, నీటిని పొదుపుగా వాడలని తెలుపుతూ, భారీ ర్యాలీని స్కూల్ విద్యార్థులతో మాట్లాడిస్తూ, ఇంకుడు గుంతలు ఉంటేనే బ్యాంకులు ఇల్లు కట్టుకోవడానికి బ్యాంకులు రుణాలు ఇవ్వాలని, ప్లాట్లు ఇల్లు రిజిస్ట్రేషన్ చేయాలని, డిమాండ్ ఛేశారు. భవిష్యత్తులో నీరు లేకపోతే ఎవ్వరి మనుగడ సాధ్యం కాదని, ప్రతి వర్ష బొట్టును ఒడిసి పట్టుకోవాలని, నీటిని పొదుపుగా వాడాలని, పైపులతో కడుగకుండా బకెట్ నీళ్లతో ఇల్లు ఆవరణలు మాపింగ్ చేసుకోవాలని వీధుల గుండా విద్యార్థులతో కలసి పర్యావరణ ప్రేమికుడు రవీందర్ ముదిరాజ్ పెద్ద ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, సిఎంసి అధికారులు , పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.3.13 కోట్లతో చేపడుతున్న రోడ్డు పనులను పరిశీలించిన బండారి లక్ష్మా రెడ్డి

కాప్రా/అక్టోబర్ -29(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా వాసవి శివనగర్ మరియు వైష్ణవి ఎన్క్లేవ్‌లో రూ.3 కోట్ల 13 లక్షల వ్యయంతో చేపడుతున్న రోడ్డు పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన రహదారులు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్. ఎస్.పార్టీ నాయకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- ఆరేపల్లిలో నీటి సంరక్షణ పనుల పరిశీలన..
- పారిశుద్ధ్య లోపాలపై అసంతృప్తి
- ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల
- దృష్ట్యా పశుగ్రాసం, నీటి వనరులపై ప్రత్యేక దృష్టి

వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణే లక్ష్యంగా గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సూచించారు. గురువారం వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని ఆరేపల్లి గ్రామ పంచాయతీని ఆయన ఆకస్మికంగా సందర్శించి, ఉపాధి హామీ పథకం (వీబీజీ రామ్‌జీ కింద చేపడుతున్న పనులను) పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామస్తులందరూ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకొని వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భూగర్భ జల మట్టం పెంచేందుకు, భవిష్యత్తులో నీటి కొరతను నివారించేందుకు నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. గ్రామంలో పంట కుంటలు, నీటి కుంటలు, బోర్‌వెల్ రీఛార్జ్ గుంతల నిర్మాణంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని నీటి వనరుల పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

పశుగ్రాసం, నీటి సంరక్షణకు ప్రాధాన్యం

ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణతో పాటు పశుగ్రాసం పెంపకం వంటి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెల ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించి, ఈ సదుపాయాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచాలి

అనంతరం గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ తీరును అదనపు కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా లేకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామంలో పరిశుభ్రతను తక్షణమే మెరుగుపరచాలని ఆదేశించారు. పనులను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ అధికారులు, గ్రామ సర్పంచ్, ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు ఉచిత కళ్లద్దాల పంపిణీ..!

- రెటినోవా ఫౌండేషన్ శ్రీకారం..!

కాప్రా/అక్టోబర్ 29(విజన్ ఆంధ్ర ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలను గుర్తించి, అవసరమైన విద్యార్థులకు ఉచిత కళ్లద్దాలు అందించాలనే లక్ష్యంతో రెటినోవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిర కార్యక్రమం కాప్రాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మావతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెటినోవా ఫౌండేషన్ డైరెక్టర్ డి. సునీల్ కుమార్, ప్లానెట్ ఆప్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ డి. అనిల్ కుమార్, వారి బృంద సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ చారి, రామేశ్వర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెటినోవా ఫౌండేషన్ డైరెక్టర్ డి. సునీల్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. చూపు సరిగా లేకపోవడం వల్ల విద్యార్థుల చదువు, ఏకాగ్రత, విద్యా ప్రగతిపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలు ఉన్నవారికి అవసరమైన ఉచిత కళ్లద్దాలను అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని దశలవారీగా వివిధ ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించి, మరింత మంది విద్యార్థులకు కంటి సంరక్షణ సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే, అవసరమైన విద్యార్థులకు తగిన కంటి పరీక్షలు, కళ్లద్దాల సహాయం అందించడం ద్వారా వారి చదువుకు తోడ్పడటమే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అదేవిధంగా, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చూపులో ఏవైనా ఇబ్బందులు కనిపిస్తే వెంటనే కంటి పరీక్షలు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన కంటి సంరక్షణ సేవలను అందించి, ప్రతి విద్యార్థి స్పష్టమైన దృష్టితో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించడమే రెటినోవా ఫౌండేషన్ ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

ఎం.వీ.ఎస్.ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రమాదంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ స్పందన..!

కాప్రా/అక్టోబర్ -29(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : 4 వారాల్లో చర్యల నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశం రంగారెడ్డి జిల్లా నాదర్గుల్ లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన దుర్ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘం (చీ=జ) స్పందించింది. ఈ ఘటనకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకొని, నాలుగు వారాల్లో చర్యల నివేదిక (ూఙ౯ఱశీఅ ఖుఎవఅ =వజూశీ౯ ూు=) సమర్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ (జిల్లా మేజిస్ట్రేట్), పోలీస్ కమిషనర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్‌లను ఆదేశించింది. లికేసు నంబర్‌లి: 1051/36/9/2026. సభావట్ కళ్యాణ్, కరుపోతుల రేవంత్ సమర్పించిన ఫిర్యాదుపై అక్టోబర్ 28, 2026న ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఈ ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 17, 2026న ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 'సంగమం2026' సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవంలో డాండియా వేడుకలు జరుగుతుండగా భారీ లోహపు లైటింగ్ ట్రస్, దానికి ఆధారంగా ఉన్న స్తంభాలు కూలిపోయాయి. ఈ ఘటనలో విద్యార్థినులు సోనీ, మీనా మరణించినట్లు ఫిర్యాదులో పేర్కొనగా, సుమారు 12 నుంచి 14 మంది విద్యార్థులు గాయపడినట్లు ఎన్‌హెచ్‌ఆర్‌సీకి సమర్పించిన ఫిర్యాదులో వివరించారు. ఈ ప్రమాదం విద్యాసంస్థల్లో తాత్కాలిక నిర్మాణాల భద్రత, కార్యక్రమాల నిర్వహణ, జనసమూహ నియంత్రణ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లపై తీవ్ర ఆందోళనలను లేవనెత్తింది. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారులు ఎన్‌హెచ్‌ఆర్‌సీ జోక్యం చేసుకొని, ఘటనపై నిష్పక్షపాతంగా, నిర్ణీత కాలపరిమితిలో విచారణ జరిపించాలని కోరారు. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని, గాయపడిన విద్యార్థులకు అవసరమైన వైద్య సహాయం కల్పించాలని, నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విద్యాసంస్థల్లో నిర్వహించే కార్యక్రమాల కోసం ఏర్పాటు చేసే తాత్కాలిక నిర్మాణాల భద్రతపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని కోరారు. సభావట్ కళ్యాణ్ (ఢిల్లీ విశ్వవిద్యాలయ న్యాయ విద్యార్థి), అడ్వకేట్ కరుపోతుల రేవంత్ విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని కోరారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యత నిర్ధారించి, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

బీజేపీ నాయకులకు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ పిలుపు

కాప్రా/అక్టోబర్ -29(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను విస్మరించి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాలను విస్మరిస్తూ అధికార మదంతో వ్యవహరిస్తున్న ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నవంబర్ 2న హైదరాబాద్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొననున్న పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ హెచ్ఎంటీ నగర్ డివిజన్ బీజేపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు నిరసనగా ట్యాంక్‌బండ్‌పై నిర్వహించనున్న పాదయాత్రకు హెచ్ఎంటీ నగర్ డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి ఎం.పీ ఈటల రాజేందర్ చేపట్టనున్న పాదయాత్ర ముగింపు బహిరంగ సభను కూడా విజయవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రతి కార్యకర్త ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభాకర్ కోరారు. బంధువులు, మిత్రుల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని, రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకునే లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు చంద్రమౌళి, కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ యోగేశ్వర్ రెడ్డి, రాజిరెడ్డి, మోర నర్సింహారెడ్డి, చిల్లా అశోక్, గందమల గోపి, కిరణ్‌కుమార్, రమేష్, వేణుగోపాల్, సురేందర్ స్వామి, శేఖర్ గుప్తా, ఉప్పలయ్య, బాలరాజ్, క్రాంతికుమార్, కిషోర్, సాగర్, మంజులవాణి, పార్వతి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూముల రీసర్వేలో పారదర్శకత ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
- కొత్తకోట మండలంలో భూసర్వే, సామాజిక ఆరోగ్య కేంద్రం నిరీక్షణ పరిశీలన
- నాంచారంపేటలో రీసర్వే పరిశీలించిన కలెక్టర్, అదనపు కలెక్టర్

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : భూముల రీసర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి కొత్తకోట మండల పరిధిలోని నాంచారంపేట గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేయర్లు భూములను సర్వే చేస్తున్న తీరును పరిశీలించి, వారికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రీసర్వే ప్రక్రియలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులను గుర్తించాలని, అనంతరం ప్రభుత్వ భూములను, ఆ తర్వాతే పట్టా భూములను సర్వే చేయాలని అధికారులను స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల సర్వే సందర్భంగా ఎక్కడైనా ఆక్రమణలు గుర్తిస్తే వాటి వివరాలను వెంటనే ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు.

రైతులకు ముందస్తు సమాచారం తప్పనిసరి

పట్టా భూముల సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు కచ్చితంగా ముందస్తు సమాచారం అందించాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం భూముల వివరాలను రైతులకు క్షుణ్ణంగా తెలియజేసి, వారి సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రీసర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను సాఫీగా నిర్వహించాలన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

భూసర్వే పరిశీలనకు ముందు జిల్లా కలెక్టర్ కొత్తకోట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనులను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను విధిగా పాటించాలని, నిర్మాణ పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ సుభాష్‌తో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వనపర్తి నారాయణ పాఠశాలలో ఘనంగా 'స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్'

- విద్యార్థుల ప్రాజెక్టులు, ప్రతిభను తిలకించిన తల్లిదండ్రులు
- ముఖ్య అతిథులుగా హాజరైన ఈకిడ్స్ ఆర్ అండ్ డీ, ఉన్నతాధికారులు

వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : వనపర్తి పట్టణంలోని నారాయణ పాఠశాలలో ఈకిడ్స్ సెగ్మెంట్‌లో 'స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్' కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈకిడ్స్ ఆర్ అండ్ డీ సంగీత, ఏజీఎం వెంకటరెడ్డి, డీజీఎం వెంకటరమణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ భయేందర్ గౌడ్, ఈకిడ్స్ కోఆర్డినేటర్ మాధురి, ఈకిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ రవళి తదితరులు పాల్గొన్నారు. తల్లిదండ్రులకు ప్రాజెక్టుల వివరణ ఈ వేడుకలో విద్యార్థులు తాము తయారుచేసిన విభిన్న ప్రాజెక్టులతో పాటు, పాఠశాలలో నేర్చుకున్న ముఖ్యాంశాలను తమ తల్లిదండ్రులకు స్వయంగా వివరించి చూపించారు. చిన్నారులు ప్రదర్శించిన ప్రతిభ, ఆత్మవిశ్వాసం తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన తల్లిదండ్రులు విద్యార్థుల సృజనాత్మకతను అభినందించారు.

ప్రభుత్వ ప్రవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
- ఆసుపత్రుల్లో వైద్య సేవల ధరల పట్టికల ప్రదర్శన తప్పనిసరి
- క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ కమిటీ సమావేశంలో కలెక్టర్ హెచ్చరిక

వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలకు కచ్చితంగా అనుగుణంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో కొత్తగా ప్రైవేట్ ఆసుపత్రుల ఏర్పాటు, ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్ల రెన్యూవల్ అనుమతులకు సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మొత్తం 10 ప్రతిపాదనలను కమిటీ పరిశీలనకు సమర్పించారు. కమిటీ సభ్యులు ఆయా ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత నిబంధనలు, ప్రమాణాలు పాటించిన దరఖాస్తుదారులకు అనుమతులు మంజూరు చేశారు.

ధరల పట్టికలు ప్రదర్శించాలి

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో వివిధ వైద్య సేవలకు సంబంధించిన ధరల పట్టికలను రోగులకు స్పష్టంగా కనిపించే విధంగా తప్పనిసరిగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. రోగులకు అందించే వైద్య సేవల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, నిబంధనల ప్రకారం అవసరమైన సదుపాయాలను నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రులు నిర్వహించినా, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినా సంబంధిత యాజమాన్యాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సంబంధిత అధికారులు ఆసుపత్రుల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

31న జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం

నిజామాబాద్, అక్టోబర్ 29 :(విజన్ ఆంధ్ర) సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఈ నెల 31న (శనివారం) ఉదయం 10.30 గంటలకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం జరగనుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయన్న తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులచే వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో విచ్చేయాలని కోరారు.

కిట్స్ వరంగల్ లో సమ్ శోధిని'26 ప్రారంభోత్సవం

హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : రేపు కిట్స్ వరంగల్ లో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐ యస్ టి ఈ) కిట్స్ స్టూడెంట్ విద్యార్థి చాప్టర్, కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్, వరంగల్ (కిట్స్ డబ్ల్యు)వారి యొక్క టెక్నికల్ క్లబ్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్)తో పాటుగా 10 విభాగాలు సంయుక్తంగా జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం యొక్క సమ్ శోధిని'26" ప్రారంభోత్సవం అక్టోబర్ 30న (రేపు) సిల్వర్ జూబ్లీ సెమినార్ హాల్లో నిర్వహించబడుతుందని ఫార్మర్ రాజ్యసభ ఎంపీ, కిట్స్ వరంగల్ ఛైర్మన్, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు సగర్వంగా తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీ ఎంపీడీసీఎల్ (హైదరాబాద్) చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ హాజరుకానున్నారు ప్రారంభోత్సవ కార్యక్రమానికి గౌరవ అతిథిగా టీసీఎస్, అకడమిక్ అలయన్సెస్ (హైదరాబాద్) రీజియన్ హెడ్ అయిన రిచర్డ్ కింగ్ చత్రగడ్డ హాజరవుతున్నారు. ఈ కార్యక్రమానికి ఫార్మర్ రాజ్యసభ ఎంపీ, కిట్స్ వరంగల్ ఛైర్మన్, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు అధ్యక్షత వహించనుండగా, కిట్స్ వరంగల్ కోశాధికారి పి. నారాయణ రెడ్డి టెక్ ఫెస్ట్– స శోధిని'26 కు విచ్చేసి కార్యక్రమాన్ని శోభాయమానం చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ, సమ్ శోధిని'26 యొక్క ఇతివృత్తం "సాంప్రదాయ ఆలోచనలకు అతీతంగా" అని నొక్కి చెప్పారు. ఇది వివిధ ఇంజనీరింగ్ రంగాలలో విద్యార్థులు అధునాతన సాంకేతిక నైపుణ్యాలను పంచుకోవడానికి మరియు నేర్చుకోవడానికి ఒక సాంకేతిక వేదిక. సుంశోధిని ఫెస్ట్ సమయంలో, అన్ని బ్రాంచ్‌లకు పేపర్ ప్రజెంటేషన్లు వంటి సాంకేతిక కార్యక్రమాలు ఉమ్మడిగా ఉంటాయి మరియు 50కి పైగా సాంకేతిక ఈవెంట్‌లు నిర్వహించబడతాయి అని హైలైట్ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ ఎఫైర్స్ & ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్.కె. శ్రీధర్, ఐ యస్ టి ఈ కిట్స్ చాప్టర్ ఛైర్మన్ మరియు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, డా. టి. మధుకర్ రెడ్డి, కో–కోఆర్డినేటర్స్, డాక్టర్ ఎస్. సునీల్ ప్రతాప్ రెడ్డి & బి. శశికాంత్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీ మరియు పిఆర్ఓ డా.డి. ప్రభాకరా చారి, డీన్‌లందరూ, వివిధ విభాగాల హెచ్ఓడీలు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు, ఐయస్ టిఈ కిట్స్ విద్యార్థి చాప్టర్ ప్రెసిడెంట్ కె. సాయి సిద్ధార్థ రెడ్డి, టెక్నికల్ క్లబ్ విద్యార్థి అధ్యక్షుడు నిఖిల్ మాదరవేన, 4000 మంది పై చిలుకు విద్యార్థి ప్రతినిధులు హాజరుకానున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి బెజ్జూరులో ఐదుగురి అరెస్టు.. నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

బెజ్జూరు: అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు గ్రామంలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై కె. రమేష్ తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న శివ ప్రసాద్, శంకర్, గంగయ్య, తిరుపతి, ఓదెలును పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ.2,500 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె. రమేష్ తెలిపారు. గ్రామాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాల వల్ల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజలు పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓట్ల నమోదుకు చివరి 7 రోజులు మాత్రమే

- పట్టభద్రులు ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల బిజేపి జిల్లా కన్వీనర్ ఎస్.రామచంద్రారెడ్డి

గట్టు అక్టోబర్ 29(విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల బిజేపి జిల్లా కన్వీనర్ ఎస్.రామచంద్రారెడ్డి గురువారం పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి ఓటు నమోదు కార్యక్రమం చేసి అనంతరం వారు మాట్లాడుతూ మన ప్రక్క రాష్ట్రం కర్ణాటక లో నిన్న కౌంటింగ్ పూర్త కావటం జరిగిందని అక్కడ అధికారం ఉన్న కాంగ్రెస్ పార్టీ 4 స్థానాలలో పోటీ చేస్తే ఒక్క స్థానం కూడా గెలవలేదు మొత్తం 4 లో ముగ్గురు బీజేపీ అభ్యర్థులు ఒకరు మన అలయన్స్ పార్టీ జెడిఎస్ అభ్యర్థి గెలుపొందారని తెలిపారు. దేశవ్యాప్తంగా 4 రాష్ట్రాలలో 28 ఎమ్మెల్సీ స్థానాలలో ఒక్క కాంగ్రెస్ అభ్యర్థి కూడా గెలవలేదు అని అన్నారు. రాబోయే తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ అభ్యర్థులు గెలువరని బి ఆర్ ఎస్ . కు ఓటు వేసే పరిస్థితి లేదని కాబట్టి బీజేపీ అభ్యర్థులు తప్పకుండా గెలుస్తారని వారు అన్నారు మహబూబ్నగర్– హైదరాబాద్– రంగారెడ్డి లో జరగబోయే పట్టభద్రుల ఎన్నికల ఎన్రోల్మెంట్ గురించి వివరించడం జరిగింది డిగ్రీ పూర్తయినటువంటి ప్రతి ఒక్క స్టూడెంట్ కూడా ఎన్రోల్మెంటు ఓటు హక్కు ను వినియోగించుకోవాలని వారు కోరారు. గట్టు మండలంలో గత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థికి అద్భుతమైనటువంటి ఓట్లు అందించారు. అలాగే రేపు జరగబోయేటువంటి ఎన్నికల్లో కూడా భారతీయ జనతా పార్టీ అభ్యర్థిని ఆశీర్వదించాలని చెప్పి వారు కోరారు. ఎన్రోల్మెంట్ చివరి తేదీ నవంబర్ 6వ తారీకు వరకు కొనసాగుతుంది కావున ప్రతి ఒక్కరు కూడా కచ్చితంగా ఎన్రోల్మెంట్ చేసుకోవాల్సిందిగా కోరారు ఈ కార్యక్రమం లో గట్టు మండల ఎమ్మెల్సీ కన్వీనర్లు మోహన్ చంద్ర, వీరశేఖర్ గౌడ్, నాయకులు నర్సింహులు గౌడ్, సంజీవ్ నాయుడు, చాకలి నరసింహులు, శ్రీరాములు గౌడ్, నాగరాజు ,భీమన్న,రాజు,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సన్నహాక సమావేశం

గద్వాల అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జిల్లా బిజెపి పార్టీ కార్యాలయం (డికె బంగ్లా) లో గద్వాల పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, గద్వాల మండల అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సన్నహాక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు హాజరై మాట్లాడుతూ రేపు జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తయిన వారు, లాస్ట్ ఎలక్షన్స్ లో ఓటేసిన వారు కూడా మళ్లీ ఎన్రోల్మెంట్ చేసుకోవాల్సిందిగా వారు సూచించారు. అలాగే రేపు జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి పట్టభద్రులు ఓటు వినియోగించుకోవాలని వారు సూచించారు అలాగే హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్నగర్ జరిగే ఎమ్మెల్సీ ఎన్నిక చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే,శ్యామ్ రావ్,జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు మాలిమ్ ఇసాక్, ఓబీసీ మోర్చ అధ్యక్షుడు దేవా దాస్, కౌన్సిలర్ చంద్రశేఖర్,జిల్లా సీనియర్ నాయకుడు హానిమి రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

అగ్రిస్టాక్ కమిటీ ద్వారా రైతులకు వేగవంతమైన సేవలు

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో అగ్రిస్టాక్ కమిటీ ఏర్పాటు ద్వారా రైతులకు నాణ్యమైన, పారదర్శకమైన, వేగవంతమైన సేవలను అందించేందుకు ఈ నూతన టెక్నాలజీ ఉపయోగపడుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలు లో అగ్రి స్టాక్ టెక్నాలజీ విధానంపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు కోసం వ్యవసాయ, భూములు కొలతలు, పశు సంవర్ధక, ఉద్యాన, సహకార, నాబార్డ్, పౌర సరఫరాలు, తదితర శాఖల అధికారులతో సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చైర్ పర్సన్ గా, కన్వీనర్ గా జిల్లా వ్యవసాయ అధికారి, సభ్యులుగా వివిధ శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటయింది. ఈ సమావేశంలో నూతన టెక్నాలజీ అగ్రిస్టాక్ ద్వారా రైతులకు నాణ్యమైన, వేగవంతమైన ప్రభుత్వ సేవలు, పథకాలను అందించేందుకు నూతన టెక్నాలజీని తీసుకురావడానికి, ప్రస్తుతం ఉన్న టెక్నాలజీలో మార్పులు తెచ్చేందుకు పలు సూచనలు చేశారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, బ్యాంకు సేవలు, మార్కెటింగ్ సదుపాయాలు, పంట కొనుగోలును ఒకేతాటిపైకి తీసుకువచ్చి రైతులకు వేగవంతమైన సేవలను అందించడం అగ్రి స్టాక్ టెక్నాలజీ ప్రధాన ఉద్దేశమని అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి రైతులకు వేగవంతమైన సేవలను అందించేందుకు జిల్లాస్థాయి అగ్రి స్టాక్ కమిటీ పనిచేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, భూములు కొలతలు శాఖ ఏడీ నూర్ సింగ్, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రాధా కిషన్, ఉద్యాన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, జిల్లా సహకార అధికారి మోహన్, అడిషనల్ డీఆర్డీవో వెంకటేశ్వర్లు, సీపీవో సత్యనారాయణ రెడ్డి, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, ఎల్డీఎం విష్ణుప్రియ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర గ్రావెల్ నిర్వహణ అమలు విధానంతో అనుమతుల ప్రక్రియ సులభతరం

- త్వరలో అమల్లోకి కొత్త పోర్టల్
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : గ్రావెల్ (మట్టి) తరలింపునకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు సమగ్ర గ్రావెల్ నిర్వహణ విధానం (ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)ను అమల్లోకి తీసుకురానున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమగ్ర గ్రావెల్ మేనేజ్మెంట్ సిస్టం అమలు చేసేందుకు నూతన పోర్టల్ తీసుకువచ్చే అంశంపై మైనింగ్, రెవెన్యూ, సాంకేతిక అధికారులతో జిల్లా కలెక్టర్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చే పోర్టల్ సంబంధించిన వివిధ అంశాలను గురించి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... నూతన విధానం అమల్లోకి రావడం ద్వారా చిన్న మొత్తాల్లో గ్రావెల్ అవసరమైన సందర్భాల్లోనూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, త్వరితగతిన అనుమతులు పొందే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రహదారుల నిర్మాణం, రైతులు, ప్రజల అవసరాల మేరకు గ్రావెల్ తరలించేందుకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడమే కొత్త విధానం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి సాధ్యమైనంత త్వరగా, సుమారు ఐదు రోజుల నుంచి వారంలోపు అనుమతులు మంజూరు చేసేలా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ పోర్టల్ నిర్వహణకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త పోర్టల్‌పై అవగాహన కల్పించేందుకు సీజీజీ సాంకేతిక బృందం శనివారం జిల్లాకు రానుందని తెలిపారు. రెండు బ్యాచ్‌లుగా శిక్షణ కార్యక్రమం నిర్వహించి, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (గిర్దవర్లు), పంచాయతీ కార్యదర్శులకు విధివిధానాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు. త్వరగా పోర్టల్‌ను ప్రత్యక్షంగా వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు వాహనాల వివరాలను నమోదు చేసి, ప్రవేశ సమయం, నిష్క్రమణ సమయాన్ని పోర్టల్‌లో పొందుపరుస్తారని పేర్కొన్నారు. ఈ వ్యవస్థ అమలుతో అనధికార గ్రావెల్ తవ్వకాలు, తరలింపునకు అడ్డుకట్ట వేయడంతో పాటు, గ్రామస్థాయిలో చిన్నపాటి పనులకు అవసరమైన గ్రావెల్ పొందడం సులభతరం కానుంది. ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ శాఖ ఏడి రామాచారి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్. వెంకన్న, ఈడియం శ్రీధర్, సి సెక్షన్ సూపరింటెండెంట్ చల్లా ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన దిగుబడులు సాధించేందుకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

ఆలంపూర్ డివిజన్‌లో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త & కోఆర్డినేటర్, డా.పి.అర్చన

ఆలంపూర్ అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : పంటల్లో చీడపీడలను ప్రారంభ దశలోనే గుర్తించి, శాస్త్రీయ సస్యరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త & కోఆర్డినేటర్, డా.పి.అర్చన సూచించారు.బుధవారం ఆలంపూర్ డివిజన్ పరిధిలోని భుక్కాపురం, జోగులాంబ,ఆలంపూర్ గ్రామాల్లో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం (టిఆర్ వికె), అర్ఏఅర్ఎస్ పాలెం శాస్త్రవేత్తలు గురువారం పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిరప పంటలో బోరాన్, మెగ్నీషియం లోపాలను గుర్తించిన శాస్త్రవేత్తలు,వాటి నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము బోరాన్, 45 గ్రాముల మెగ్నీషియం కలిపి పిచికారీ చేయాలని సూచించారు.అనంతరం నాలుగు రోజుల వ్యవధిలో అగ్రోమిన్ మ్యాక్స్, మరో నాలుగు రోజుల తర్వాత ఫార్ములా–7 పిచికారీ చేయాలని తెలిపారు. పత్తి పంటలో గులాబీ రంగు కాయతొలుచు పురుగు ఉనికిని గుర్తించి,రెండో ఏర పూర్తయిన తర్వాత పంటను కొనసాగించడం ఆర్థికంగా లాభదాయకం కాని పరిస్థితుల్లో పంటను తొలగించి,పత్తి అవశేషాలను సక్రమంగా తొలగించాలని సూచించారు. సుమారు 50 రోజుల వయస్సున్న మినుము పంటలో పసుపు రంగు మొజాయిక్ వైరస్, మారుకా పురుగు లక్షణాలను గుర్తించారు. వైరస్ వ్యాప్తిని తగ్గించేందుకు రసం పీల్చే పురుగులను నియంత్రించాలని,మారుకా పురుగు నివారణకు ఎకరానికి 80 మి.లీ. యాంప్లిగో వినియోగించాలని సూచించారు. సుమారు 30 రోజుల వయస్సున్న శనగ పంటలో బీట్ ఆర్మీవార్మ్ పురుగు ఉనికిని గుర్తించి,గుడ్ల సమూహాలు, చిన్న లార్వాలను సేకరించి నాశనం చేయాలని, అవసరమైనప్పుడు సిఫారసు చేసిన జీవ నియంత్రణ పద్ధతులు, పురుగుమందులను వినియోగించాలని తెలిపారు. మొక్కజొన్నలో ఫాల్ ఆర్మీవార్మ్ పురుగు తీవ్రంగా ఆశించినందున పంటను తరచుగా పరిశీలిస్తూ, గుడ్ల సమూహాలు, చిన్న లార్వాలను తొలగించి, అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సుమారు రెండు నెలల వయస్సున్న పొగాకు పంట ఆరోగ్యంగా ఉన్నందున ప్రస్తుతం పురుగుమందుల పిచికారీ అవసరం లేదని, పంటను నిరంతరం పరిశీలించాలని తెలిపారు. ఈ క్షేత్ర పరిశీలనలో పాలెం శాస్త్రవేత్తలు ఏ. శ్రీరామ్, కె. మమత,జి.మాధురి,డా. ఎం. శంకర్,ఆలంపూర్ డివిజన్ వ్యవసాయ అధికారి నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ తో సమీక్ష సమావేశం నిర్వహించిన పి.ఎ.సి ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి.అక్టోబర్ 29:(విజన్ ఆంధ్ర) : మాదాపూర్ లోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం లో జవీజ కమిషనర్ సృజన తో సమీక్షా సమావేశం జరిపిన పిఎసి చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నిత్యం ట్రాఫిక్ రద్దీ తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని, ట్రాఫిక్ కష్టాల నుండి గట్టెక్కించే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ రహదారుల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టేలా అధికారులకు సూచనలు ఇవ్వాలని, ట్రాఫిక్ రహిత సమాజం కోసం రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని, లింక్ రోడ్ల ను ఏర్పాటు చేయాలని మసీదు బండ రోడ్డు, తారా నగర్ రోడ్డు, శ్రీదేవి థియేటర్ రోడ్డు, మియాపూర్ చౌరస్తా రోడ్డు, అంజయ్య నగర్ రోడ్డు, కాజగూడ రోడ్డు, ఐఐఐ టీ రోడ్డు విస్తరణ పనులలో వేగం పెంచాలని , అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల ను త్వరితగతిన రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని , రోడ్డు విస్తరణలో స్థలాలు, భవనాలు కోల్పోతున్నవారికి సముచిత న్యాయం చేయాలని,వారి జీవనాధారం కోల్పోవడం జరుగుతుంది కావున అందరికీ సమ న్యాయం చేయాలని, ఎఐ= ప్రక్రియ ను వేగవంతం చేయాలని, అదేవిధంగా అంజయ్య నగర్ రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, తారా నగర్ రోడ్డు విస్తరణ పనులు వేగం పెంచాలని , ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు గట్టెక్కెల చూడాలని,రోడ్డు విస్తరణ పనులలో వేగం పెంచాలని, అధికారులకు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వాలని, టౌన్ ప్లానింగ్, జవీజ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సమన్వయంతో పనిచేసేలా చూడాలని కమిషనర్ ని కోరడం జరిగినది అని గంగారం చెరువు నుండి జాతీయ రహదారి (బీఎ –65) అపర్ణ హిల్ పార్క్ వరకు లింక్ రోడ్డు టెండర్ పూర్తి అయినది అని, సంబంధిత పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కమిషనర్ ని కోరడం జరిగినది. ఈ లింక్ రోడ్డు వలన ప్రజలకు ఎంతో సాంత్వన చేకూరునని, ట్రాఫిక్ సమయం తగ్గి, ఇంధనం ఆదా అవునని అదేవిధంగా ఆల్విన్ కాలనీ లోని పైప్ లైన్ రోడ్డు లో పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, నాలా పై బ్రిడ్జి నిర్మాణం వలన రాకపోకలకు సులభతరం అవుతుంది అని చందానగర్ ప్రధాన రహదారి, హైదర్ నగర్, మియాపూర్ బొల్లారం రోడ్డు లో, వివేకానంద నగర్ బాగ్ అమీర్ కాలనీ జాతీయ రహదారి నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డు అని, ప్రమాదాలు జరుగునని, పాదచారులకు రోడ్డు దాటడం కష్టంగా ఉండునని, ప్రజలు రోడ్డు దాటే సమయంలో చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు అని, ప్రమాదాల బారిన పడుతున్నారు అని, పరిసర ప్రాంత ప్రజలకు ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జి లు ఎంతగానో ఉపయోగపడుతాయి అని, పాదచారులు సురక్షితంగా రోడ్డు దాటడానికి అన్ని హంగులతో సకల సౌకర్యాలతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చేల చర్యలు తీసుకోవాలని . ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వలన వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రజలకు రక్షణ కల్పిస్తుంది అని, వేగంగా వెళ్లే వాహనాల మధ్య రోడ్డు దాటే ప్రమాదాలను తగ్గిస్తుంది అని, జనాల రాకపోకల వల్ల రోడ్లపై ఏర్పడే ట్రాఫిక్ జామ్‌లను తగ్గిస్తుంది. అని , వృద్ధులు, దివ్యాంగుల కోసం మెట్లతో పాటు లిఫ్టులు లేదా రాంప్‌లను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుంది అని అదేవిధంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న రోడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన నాలా విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, చెరువుల సుందరీకరణ పనులు చేపట్టాలని, పార్కులను అభివృధి చేయాలని, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా, సమన్వయం తో పనిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగినది అని తెలిపారు ఈ సందర్భంగా కమిషనర్ సృజన మాట్లాడుతూ పైన పేర్కొన్న అంశాల పై సానుకూలంగా స్పందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ జజూ వెంకన్న, ప్రాజెక్ట్స్ CE శ్రీ లక్ష్మీ, EE గోపాల్,CMC SE శ్రీకాంతిని, ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసర్ అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యనగర్ లో నివాస ప్రాంతాల్లో ఎస్టీపీల నిర్మాణంను నిలిపివేయాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్



శేరిలింగంపల్లి.అక్టోబర్ 29: (విజన్ ఆంధ్ర) : శేరిలింగంపల్లి పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీలో నివాస సముదాయాల మధ్య మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ – ఞూ) నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనను కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సీతారామరాజు ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు కమిషనర్‌ను కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ, కాలనీలో ప్రజలు నివసించే గృహాల మధ్యలో ఎస్టీపీల నిర్మాణం చేపట్టడం వల్ల దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు, కీటకాలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు, వృద్ధుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రత్యామ్నాయ స్థలాల్లో ఈ ఎస్టీపీలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల ప్రాథమిక హక్కులు, ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తక్షణమే ఈ నిర్మాణ పనులను నిలిపివేసి, శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ వినతిపై కమిషనర్ సృజన సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను పరిశీలించి కాలనీవాసులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిత్యనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు వెంకటరెడ్డి, భరత్, సీతారామరాజు, మహేష్ యాదవ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలపై కాంగ్రెస్ ధర్నా..!

- అధికారుల తీరుపై కొత్త అంజిరెడ్డి ఆగ్రహం..!

కాప్రా/అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): డాక్టర్. ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డ, న్యూ శ్రీనివాస్ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డాక్టర్. ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొత్త అంజిరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనలో నాయకులు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాలనీ ప్రజల సౌకర్యార్థం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎవరికీ ఇబ్బంది కలగని స్థలంలో నిర్మించిన నీటి తొట్టెను తొలగించేందుకు అధికారులు ప్రయత్నించడం అన్యాయమని ఆందోళనకారులు పేర్కొన్నారు. అదే సమయంలో ఎమ్మెల్యే అనుచరుడి అండతో రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ఇంటిని తొలగించాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని, వారి మొండి వైఖరితో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని అంజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరు మారకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం కాప్రా సర్కిల్ (డి.సి.) ఉప కమీషనర్ రవీంద్ర సాగర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఏ అల్లురయ్య, న్యూ శ్రీనివాస నగర్ కాలనీ అధ్యక్షులు సుబెదర్ రహంతుల్లా, ఉపాధ్యక్షులు పీ.వీ.వి. సత్య నారాయణ, విజయ లక్ష్మి, అడ్వైసర్ ఆనంద్, శ్రీను, సింగం నరసింహ పటేల్, పుష్ప, భవాని, ప్రధాన కార్యదర్శి బి. ప్రవీణ్ కుమార్ బోయంకర్, ఏన్. శేఖర్, జానీ షేక్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు మోహన్ ను పరామర్శించిన టియుడబ్ల్యూజే జిల్లా నేతలు...!

- కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలిగించిన.. రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ బొమ్మ అమరేందర్
- సీనియర్ నాయకులు దొమ్మాటి కిరణ్ కుమార్ రావు, కుమారస్వామి..!,

కాప్రా/ అక్టోబర్– 29(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : కాప్రా సీనియర్ జర్నలిస్ట్ నమస్తే తెలంగాణ కాప్రా ప్రతినిధి కే.సి. మోహన్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాప్రా లోని ఈసీఐఎల్ లోని సూర్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న (ఞఔజీ)టియు డబ్ల్యూ జే ఎ– 143 ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ బొమ్మ అమరేందర్, టియుడబ్ల్యూ జే సీనియర్ నాయకులు - కాప్రా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు దొమ్మటి కిరణ్ కుమార్ రావు, టీయూడబ్ల్యూజే సీనియర్ నాయకులు సముద్రాల కుమారస్వామి, కీర్తి శ్రీనివాస్, నర్రా శ్రీనివాస్ రెడ్డిలు చికిత్స పొందుతున్న మోహన్ ను పరామర్శించారు వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.. వారు త్వరగా కోలుకోవాలని , వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జొన్న మినీ కిట్ల పంపిణీ

- నారాయణపూర్ రైతు వేదికలో ఎన్ఎఫ్ఎస్ఎన్ఎం
- పోషక తృణధాన్యాల పథకం కింద కార్యక్రమం
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, ఎంఏఓ గోల్కొండ ప్రసన్నలక్ష్మి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : జొన్న పంట సాగు ద్వారా రైతులు పంటల వైవిధ్యాన్ని పెంపొందించుకోవచ్చని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, ఎంఏఓ గోల్కొండ ప్రసన్నలక్ష్మి అన్నారు. గురువారం వికారాబాద్ మండలం నారాయణపూర్ రైతు వేదికలో జాతీయ ఆహార భద్రతా మిషన్, పోషక తృణధాన్యాల పథకం కింద రైతులకు జొన్న మినీ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ మల్లేశం, వ్యవసాయ విస్తరణ అధికారులు అయ్యప్ప, రమాదేవి, రాఘవేందర్ పాల్గొని రైతులకు జొన్న మినీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తక్కువ నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో కూడా అనుకూలమైన పరిస్థితులను బట్టి జొన్న సాగును చేపట్టవచ్చని తెలిపారు. జొన్నలు పోషక విలువలు కలిగిన చిరుధాన్యమని, వీటి సాగు, వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించవచ్చని వివరించారు. వికారాబాద్ మండలానికి ఈ పథకం కింద మొత్తం 9 క్వింటాళ్ల జొన్న విత్తన మినీ కిట్లు కేటాయించబడ్డాయని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు నాణ్యమైన విత్తనాలను ఉపయోగించి, సరైన సాగు పద్ధతులు పాటించి, జొన్న పంటలో మంచి దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. పోషక తృణధాన్యాల సాగును ప్రోత్సహించడం, పంటల వైవిధ్యాన్ని పెంచడం, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడం ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

మాగనూర్ మండలంలో నాలుగు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మాగనూర్ అక్టోబర్ 29(విజన్ ఆంధ్ర) : రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడంతో పాటు, దళారుల బారిన పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. తెలంగాణ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మాగనూర్ మండలంలోని ఉజ్జల్లి, బైరంపల్లి, నేడుగం దొడ్డి, నేడుగం గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఏడు సన్న రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తుందని వివరించారు. బోనస్‌తో కలిపి ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,961, ఇతర రకాల ధాన్యానికి రూ.2,441 చొప్పున చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ ధాన్యాన్ని బయట మార్కెట్‌లో దళారులకు విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు పారదర్శకంగా ధాన్యం విక్రయించే అవకాశం కల్పించినట్లు తెలిపారుఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ, వెలుగు సంఘాల అధికారులు, మాగనూర్ పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు శివరాం రెడ్డి ఆనంద్ గౌడ్, సర్పంచులు, మార్కెట్ డైరెక్టర్లు శంకర్ లింగం, వెలుగు సంఘాల నాయకులు, రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికయ్యేందుకు చాగాపురం గ్రామాన్ని సందర్శించిన కేంద్ర బృందం

ఇటిక్యాల అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలో గురువారం కేంద్ర ప్రభుత్వం ఇద్దరు సభ్యులతో కూడిన బృందం చాగాపురం గ్రామాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగ్ రావు, గ్రామ సర్పంచ్ సావిత్రమ్మ, సంబంధిత అధికారులు కేంద్ర అధికారులు హర్ష కుమార్ ఝా, నవీన్ శివ కు స్వాగతం పలికారు. ఉత్తమ గ్రామ పంచాయతీగా గుడ్ గవర్నెన్స్ విభాగంలో ఎంపిక కావడానికి నిర్దేశించిన అర్హతలు, ప్రమాణాలకు అనుగుణంగా గ్రామంలో సిఎస్సి సెంటర్, ఆన్లైన్ సర్టిఫికెట్ ల జారీ గురించి, చేపట్టిన అభివృద్ధి పనులు, పాఠశాల, అంగన్వాడీ, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, తదితర అంశాలను కేంద్ర బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ ముషాహిదా బేగం, డీపీఓ శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ సావిత్రమ్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆదిమ గిరిజన పోరాట యోధుడు కుమరం సూరుకు ఘన నివాళి..

- వర్ధంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ...

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29: (విజన్ ఆంధ్ర) కోమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రవిచంద్ర కాలనీలో గురువారం ఆదిమ గిరిజన పోరాట యోధుడు కీ.శే. కుమరం సూరు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా కుమరం సూరు విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభకు హాజరైన ఆదివాసీ కోలం ప్రజలు, కోలం ప్రజా నాయకులతో ఆయన మాట్లాడారు. ఆదిమ గిరిజనుల హక్కుల పరిరక్షణ, వారి అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని కోలం ప్రజలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని జాదవ్ అంబాజీ తెలిపారు. కోలం గిరిజనుల సంక్షేమం, విద్యాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఆదిమ గిరిజన పోరాట యోధుల త్యాగాలు, సేవలను స్మరించుకుంటూ వారి ఆశయాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ టెకం గంగారాం,కోలం సంఘం జిల్లా అధ్యక్షులు ఆత్రం తిరుపతి,కుమరం సూరు గారి మనమడు కుమరం పాండు నాయకులు రాజ్ గోండ్ సేవా సమితి, తుడుం దెబ్బ, ప్రధాన్ పురోహిత్ సంఘం నాయకులు ఆత్రం.భీంరావ్, మాడావి శ్రీనివాస్, పెందూర్ సుధాకర్,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలి

- కరువు నివారణలో ప్రభుత్వం విఫలమైంది : సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
- రైతులకు ఎకరానికి రూ.50 వేల వరకు పరిహారం ఇవ్వాలి
- ఉపాధి కూలీలకు 200 రోజుల పని..
- రోజుకు రూ.800 కూలీ చెల్లించాలి

ఆసిఫాబాద్: అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ నివారణ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. ఎల్‌నినో హెచ్చరికలు వస్తున్నా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి కుశాన రాజన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేవలం 25 శాతం వర్షపాతం మాత్రమే నమోదైందని, సుమారు ఆరు లక్షల బోర్లు నీరు లేక ఎండిపోయాయని జాన్ వెస్లీ తెలిపారు. ఇప్పటికే 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం, ఆ నిర్ణయానికి పరిమితం కాకుండా రాష్ట్రం మొత్తాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరువు కారణంగా నష్టపోయిన రైతులకు వాణిజ్య పంటలకు ఎకరానికి రూ.50 వేలు, ఇతర పంటలకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. రైతు భరోసా సాయాన్ని రెట్టింపు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజుల పని కల్పించి రోజుకు రూ.800 కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని సూచించారు. కరువు నివారణ చర్యల కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.50 వేల కోట్లు మంజూరు చేయాలని, నిధుల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని అన్నారు. టైగర్ రిజర్వ్ పేరుతో గిరిజనుల భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను తిప్పికొడతామని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత ప్రజలకు న్యాయం చేయకపోతే ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

గిరిజనులకు న్యాయం చేయాలి: బండారి రవికుమార్

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు బండారి రవికుమార్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సాగులో ఉన్న రైతులందరికీ నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పెంబి నుంచి జన్నారం వరకు గిరిజనులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ఎకరా భూమికి కూడా పట్టా ఇవ్వకపోవడం ఇచ్చిన హామీలను విస్మరించడమేనని విమర్శించారు. గిరిజనుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి: భూపాల్

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ మాట్లాడుతూ, సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులు 130 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ యాజమాన్యం, ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై స్పందించడం లేదని విమర్శించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులను క్రమబద్ధీకరించి, వారి వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, కార్తీక్, రాజేందర్, ఆనంద్, కృష్ణమాచారి, టీకానంద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం, విద్య, భూ రీ సర్వేపై కలెక్టర్ అంకిత్ క్షేత్రస్థాయి పరిశీలన

- వైద్యులు సమయపాలన పాటించాలి..
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి..
- భూ రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

కొత్తగూడెం బ్యూరో, అక్టోబర్ 30(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు భూ రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, లక్ష్మీదేవిపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించడంతో పాటు చంద్రుగొండ మండలం సీతాయిగూడెంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామవరం ఎంసీహెచ్‌లో వైద్య సేవలు, ఓపీ రిజిస్ట్రేషన్, రక్త నమూనాల సేకరణ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్.. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి సకాలంలో విధులకు హాజరుకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఆసుపత్రి పరిసరాల్లో అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సహారా సెక్యూరిటీ సంస్థకు చెందిన సంబంధిత సిబ్బందిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఆసుపత్రి పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల సంఖ్య, రోజువారీ హాజరు, బోధనా విధానం, అభ్యసన స్థాయిలను పరిశీలించారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని తెలిపారు. చాతకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులతో కలిసి ఉదయం ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులతో మమేకమై పాఠశాల వాతావరణాన్ని పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల హాజరుపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం చంద్రుగొండ మండలం సీతాయిగూడెం రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలు, మ్యాప్‌లను తనిఖీ చేసి పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పరిధిలో ఇప్పటివరకు 50.20 ఎకరాల్లో రీ సర్వే పూర్తయిందని అధికారులు వివరించారు. గ్రామ పరిధిలో అటవీ భూముల విస్తీర్ణం 872.02 ఎకరాలు కాగా, రోజుకు సుమారు 25 నుంచి 30 ఎకరాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.భూ రీ సర్వేలో భూముల వివరాలు, సరిహద్దులు, సర్వే మ్యాప్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. భూ రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనల్లో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గంజాయి సాగు, రవాణాను అరికట్టాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29: (నిజం ఆంధ్ర) : జిల్లా మాదక ద్రవ్యాల రవాణా, గంజాయి సాగు, రవాణాను అరికట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎన్ కార్ మాదకద్రవ్యాలను నియంత్రణపై నిర్వహించిన సమావేశానికి జిల్లా ఎస్.పి. నితికాపంత్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణా, గంజాయి సాగు, రవాణా అరికట్టడంలో అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సాగు, రవాణాకు సంబంధించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను వివరించాలని తెలిపారు. హోటళ్ళు, దాబా లలో తనిఖీలు చేపట్టాలని, మందుల షాపులలో నిషేధిత, అధిక మోతాదు మందులను పరిశీలించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా పాఠశాలలు, కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించి తంబాకు రహిత విద్యాసంస్థలుగా మార్చాలని తెలిపారు.దజిల్లా ఎస్.పి. మాట్లాడుతూ ఈ అక్టోబర్ నెలలో గంజాయి సాగు, రవాణాపై తనిఖీలు చేపట్టి 16 కేసులు నమోదు చేయడం జరిగిందని, గంజాయి సాగు చేసే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గంజాయి సాగు, రవాణా, మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డి ఎస్ పి అశోక్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, జిల్లా మాధ్యమిక విద్యాధికారి కళ్యాణి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాయి సంజన రెడ్డికి ప్రతిష్ఠాత్మక నట్వర్ గోపీకృష్ణ అవార్డు

హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, వరంగల్ (కిట్స్‌డబ్ల్యు) కళాశాలకు చెందిన బీ.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విద్యార్థిని, స్వామి వివేకానంద బర్త్‌డే సెలబ్రేషన్స్ (ఎస్వీబీసీ) క్లబ్ అధ్యక్షురాలు ఆర్. సాయి సంజన రెడ్డి ప్రతిష్ఠాత్మక నట్వర్ గోపీకృష్ణ అవార్డు ను గెలుచుకుని సంస్థకు కీర్తి ప్రతిష్ఠలను తీసుకువచ్చారని ఫార్మర్ రాజ్యసభ ఎంపీ మరియు కిట్స్ వరంగల్ చైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు తెలిపారు. ఈ కార్యక్రమం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో నిర్వహించిన ఏఐడీఏ నట్వర్ గోపీకృష్ణ జాతీయ అవార్డులు, అంతర్జాతీయ సంగీత, నృత్య పోటీలు మరియు నృత్యానందలహరి డ్యాన్స్ ఫెస్ట్2026లో ఆమె ఈ అవార్డును సాధించారని హైలైట్ చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి మాట్లాడుతూ, కూచిపూడి నృత్యంపై ఆమెకు ఉన్న అంకితభావం, సాంకేతిక విద్యాభ్యాసంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను సమర్థవంతంగా సమన్వయం చేసుకునే నైపుణ్యం ఈ విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. లిది టెంపుల్ డ్యాన్స్ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లికు చెందిన గురువు హిమాంశి కత్రగడ్డ మార్గదర్శకత్వంలో ఆమె నృత్య శిక్షణ పొందారు.ఈ సందర్భంగా ఫార్మర్ రాజ్యసభ సభ్యులు, కిట్స్ వరంగల్ చైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, కోశాధికారి



పి. నారాయణ రెడ్డి , హుస్నాబాద్ ఫార్మర్ ఎమ్మెల్యే, కిట్స్ అదనపు కార్యదర్శి వొడితెల సతీష్ కుమార్ , ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి , ఆర్. సాయి సంజన రెడ్డిని అభినందించి, ఆమె ప్రతిభను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సి.ఎస్.ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. నిరంజన్, అన్ని విభాగాల డీన్లు, విభాగాధిపతులు, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ కె. శ్రీధర్, ఎం డియఫ్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జీలు డా. పి. ఎస్. ఎస్. మూర్తి (అసిస్టెంట్ ప్రొఫెసర్, మెకానికల్ ఇంజినీరింగ్), కె. శైలజ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఈ సి వీ విభాగమ), ఎస్వీబీసీ క్లబ్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డా. కె. రాజేంద్ర ప్రసాద్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫిజిక్స్), ఎం డియఫ్ జాయింట్ సెక్రటరీ టి.వి.ఎన్. దివ్యాంశ్, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ మరియు పీఆర్వో డా. డి. ప్రభాక రా చారి, ఇతర అధ్యాపకులు, విద్యార్థి బృందం పాల్గొని విజేత ఆర్. సాయి సంజన రెడ్డిని శుభాకాక్షలతో అభినందించారు. ఆమె విద్యా రంగంలోనూ, కళా రంగంలోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన అంకోడాలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం

కాగజ్‌నగర్: అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): రైతులు భూసారాన్ని పరిరక్షించుకుంటూ అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మనోహర్ సూచించారు. గురువారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం అంకోడా గ్రామంలో సర్పంచ్ విలాస్ అధ్యక్షతన ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు భూసార పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు చేయించిన తర్వాత వాటి ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల భూమి నాణ్యత దెబ్బతింటుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వినియోగం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని తెలిపారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా పంటల వైవిధ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. వరి కోత అనంతరం పంట అవశేషాలను కాల్చకుండా ఇతర అవసరాలకు వినియోగించాలని సూచించారు. పంట అవశేషాలను సద్వినియోగం చేసుకోవడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారం మెరుగుపడుతుందని వివరించారు. సాయిల్ హెల్త్ కార్డుల ఆధారంగా ఎరువులు వాడితే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు నేల సారవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ భూసార పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఏఈఓ రహమాన్, ఆత్మ ఏటీఎం శ్రీనివాస్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్ (టి)లో పాఠశాలల ఆకస్మిక తనిఖీ ఎఫ్ఆర్ఎస్ ద్వారానే ఉపాధ్యాయుల హాజరు నమోదు చేయాలి: ఎంఈఓ పర్శ చంద్రశేఖర్

సిర్పూర్ (టి): అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో క్రమశిక్షణ, పరిశుభ్రత పాటించాలని మండల విద్యాశాఖాధికారి పర్శ చంద్రశేఖర్ సూచించారు. గురువారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని స్టేషన్ సిర్పూర్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, వంటగది పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ తరగతులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అడిగి తెలుసుకొని, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) యాప్ ద్వారానే హాజరు నమోదు చేయాలని స్పష్టం చేశారు. డిజిటల్ హాజరు నమోదులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని ఆదేశించారు. పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల హాజరు, బోధనా ప్రమాణాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.

డిప్యూటీ సీఎం ను కలిసిన ఎంపి అరవింద్.

- మాధవ నగర్ ఆర్ఓబికి ఫైనాన్స్ క్లియరెన్స్ చేయాలని వినతి.
- సానుకూలంగా స్పందించిన మంత్రి.

నిజామాబాద్ అక్టోబర్ 29:(విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ శివారులోని మాధవ నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జికి అదనపు నిధులు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఎంపీ అరవింద్ కలిశారు. గురువారం హైదరాబాద్ లో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి నిధుల కోసం విన్నవించారు. 8 కోట్ల 68 లక్షల కు సంబంధించిన ఫైనాన్స్ క్లియరెన్స్ చేసి పనులను పూర్తి చేయాలని ఎంపీ అరవింద్ కోరారు. దీనిపై డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ అరవింద్ తెలిపారు. అనంతరం మంత్రిని శాలువాతో సన్మానించారు.

ఎల్‌నినోతో తగ్గనున్న వర్షాలు.. ఆయిల్‌పామ్ రైతులు అప్రమత్తం కావాలి

-వర్షపు నీటి సంరక్షణతో ఎల్‌నినో ప్రభావానికి చెక్

-డ్రిప్ సేద్యం, మల్చింగ్‌తో నీటి పొదుపు

-ప్రభుత్వ రాయితీలు, యాంత్రీకరణ సదుపాయాలను వినియోగించుకోవాలి

-జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యాంప్రసాద్

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్-29(విజన్ ఆంధ్ర): ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్‌పామ్ రైతులు నీటి పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యాంప్రసాద్ సూచించారు. గురువారం గట్టుసింగారం గ్రామంలో దుగ్గెంపూడి కమలాకర్‌రెడ్డి ఆయిల్‌పామ్ తోటను సందర్శించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఆయిల్‌పామ్ దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే వాణిజ్య పంట అని, అధిక దిగుబడుల కోసం నిరంతర నీటి లభ్యత, సమతుల్య పోషక యాజమాన్యం అవసరమని తెలిపారు. డ్రిప్ సేద్యం, మల్చింగ్ ద్వారా నేలలో తేమను కాపాడుకోవాలని, వర్షపు నీటిని వ్యవసాయ కుంటల్లో నిల్వ చేసుకోవాలని సూచించారు. కొత్తగా సాగు చేపట్టేవారు ముందుగా దీర్ఘకాలిక నీటి వనరులను నిర్ధారించుకోవాలన్నారు. ఆయిల్‌పామ్ సాగులో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ఉద్యాన శాఖ అధికారుల సాంకేతిక సూచనలు పాటించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, డ్రిప్ పరికరాలు, యాంత్రీకరణ సదుపాయాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్, తిరుమల అయిల్ కంపెనీ ముఖ్య కార్యనిర్వహన అధికారి కెషు కళ్యాణ్కర్ ,విస్తరణ అధికారి రాము, ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్, జైన్ డ్రిప్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.22 వేల లంచం తీసుకుంటూ జీపీఓ పట్టివేత

- కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల మెరుపు దాడి

కాగజ్‌నగర్, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. రూ.22 వేల లంచం తీసుకుంటున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శి (జీపీఓ)ను ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. తన భూమికి సంబంధించిన పనిని పూర్తి చేసుకునేందుకు ఓ రైతు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. ఈ క్రమంలో సదరు పనిని పూర్తి చేయాలంటే రూ.22 వేలు లంచంగా ఇవ్వాలని జీపీఓ డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీంతో లంచం ఇవ్వడం ఇష్టంలేని బాధిత రైతు ఏసీబీ అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేశాడు. రైతు ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించారు. ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యంలో అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో దాడి చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత రైతు ద్వారా రసాయనం పూసిన నోట్లను జీపీఓకు ఇప్పించారు. సదరు అధికారి లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. అనంతరం అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది. దాడి అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. లంచం వ్యవహారంలో ఇతర అధికారుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. గతంలోనూ ఇలాంటి లంచాల వ్యవహారాలకు పాల్పడ్డారా అనే అంశంపైనా అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనతో కాగజ్‌నగర్ మండల రెవెన్యూ కార్యాలయంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు సేవలందించాల్సిన అధికారులు లంచాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనే సందేశాన్ని ఈ దాడి ఇచ్చిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అవినీతికి పాల్పడే అధికారులపై ఏసీబీ నిఘా మరింత పెంచాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ఈ ఘటనకు సంబంధించి అధికారిక ప్రకటన, పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

ఈస్గాం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ నితికా పంత్

గంజాయి అక్రమ రవాణా, జూదం, సట్కా మట్కాపై కఠిన చర్యలు తీసుకోవాలి

కాగజ్ నగర్ , అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఈస్గాం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, సిబ్బంది విధుల నిర్వహణ, స్టేషన్ నిర్వహణ తీరును ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదుల కోసం వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరిధిలో సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులు, కేసు డైరీలు, ఎఫ్‌ఐఆర్‌లు, పెండింగ్ కేసులు, వారెంట్లు, బీట్ వ్యవస్థ, రౌడీ షీట్లు, సీసీటీఎన్ఎస్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రతి కేసును నాణ్యతతో విచారిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో పోలీస్‌ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ముఖ్యంగా అక్రమ గంజాయి రవాణా, విక్రయాలు, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా, జూదం, సట్కా మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డు గదులు, సిబ్బంది వసతి ప్రాంతాలను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, అప్రమత్తత, బాధ్యతాయుతమైన ప్రజాసేవా దృక్పథంతో పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశించారు.

బీఆర్ఎస్‌కు షాక్.. కాంగ్రెస్‌లోకి చర్లపల్లి గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29(విజన్ ఆంధ్ర) : నడికూడ మండలం చర్లపల్లి గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్ బీఆర్ఎస్ పార్టీని వీడి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వీరికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. వీరితోపాటు బిఆర్ఎస్ నుండి బండి శివకృష్ణ, శరత్, రామస్వామి, నితిన్, సుమన్, గణేష్, రమాకాంత్ దాదాపు 20 మంది కాంగ్రెస్ పార్టీలోని చేరారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు

- పత్తి రైతులకు న్యాయం జరిగేలా కొనుగోలు ప్రక్రియ

- హరిత, బాలాజీ పత్తి మిల్లులలో సిసిఐ కొనుగోలు కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలో పత్తి రైతులకు మెరుగైన ధరలు లభించేలా, రైతులు తమ పత్తిని ఇతర జిల్లాలకు తరలించాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే విక్రయించుకునే అవకాశాలను ప్రోత్సహించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం గద్వాలలోని సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో హరిత, బాలాజీ పత్తి మిల్లులలో ఏర్పాటుచేసిన సిసిఐ కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు, మిల్లుల యజమానులతో పత్తి కొనుగోళ్ల ప్రక్రియ, మార్కెట్ ధరలు, మిల్లుల పని తీరు, రైతులకు అందుతున్న ధరలు, తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తికి లభిస్తున్న ధరలు, ప్రైవేటు వ్యాపారులు అందిస్తున్న ధరలు, భారత పత్తి సంస్థ (సిసిఐ) కొనుగోలు ధరల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ పత్తిని విక్రయించేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు రవాణా ఖర్చులు పెరిగి ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని, జిల్లాలోనే సరైన ధర లభిస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. పత్తి కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని, రైతులకు న్యాయమైన ధర అందేలా చూడాలని ఆదేశించారు. తూకం, ధర నిర్ణయం, చెల్లింపుల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా పత్తి కొనుగోళ్లను ప్రోత్సహించడం ద్వారా రైతులకు రవాణా భారం తగ్గడంతో పాటు జిల్లాలో వ్యవసాయ ఆధారిత వ్యాపార కార్యకలాపాలకు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. సిసిఐ ద్వారా క్వింటాల్ కు రూ.8667 ధర పత్తికి లభిస్తుందని, ఈ కేంద్రాల్లో అమ్మేందుకు రైతులు కపాస్ కిసాన్ ఆప్ ను తమ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.దఅనంతరం మిల్లులో పత్తి నుంచి విత్తనాలను వేరు చేసే జిన్నింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. వే బ్రిడ్జ్ విభాగంలో కార్యకలాపాలను పర్యవేక్షించారు. జిన్నింగ్, ప్రెస్సింగ్ యంత్రాల పనితీరును గమనించి బేల్స్ ను పరిశీలించారు. పత్తి విత్తనాలను వేరు చేయడం, వాటిని ఆయిల్ మిల్లులకు సరఫరా చేయడం, పత్తి ప్రాసెసింగ్‌లో అనుసరిస్తున్న విధానాలు, మిల్లుల ఉత్పత్తి సామర్థ్యం వంటి అంశాలపై నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం, ఎల్‌నినో ప్రభావంతో పత్తి సాగుపై పడిన ప్రభావం, పత్తి ఉత్పత్తిలో వచ్చిన మార్పుల గురించి కూడా చర్చించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న పత్తి ప్రాసెసింగ్ సదుపాయాలను సమర్థంగా వినియోగించుకోవాలని, రైతులకు స్థానికంగానే మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా సంబంధిత అధికారులు, మిల్లుల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా మార్కెటింగ్ అధికారిని పుష్పమ్మ, గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యదర్శి ఎల్ల స్వామి, సిసిఐ ప్రతినిధి రాహుల్, మిల్లుల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- కొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం కొండపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్ పంపిణీ, విద్యార్థుల యూనిఫాంలు, పదో తరగతి ఫలితాలు, తదితర అంశాలపై సమీక్షించారు. విద్యార్థుల ప్రస్తుత విద్యా ప్రమాణాలు, ఇటీవల నిర్వహించిన పరీక్షల ఫలితాలను కలెక్టర్ పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ తో పాటు మధ్యాహ్న భోజనం, తదితర రికార్డులను తనిఖీ చేశారు. గతంలో పాఠశాలలో 90 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలుసుకున్న కలెక్టర్ ఈసారి వంద శాతం ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతిరోజు సాయంత్రం రెండు గంటల పాటు రెమిడీయల్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా గణితం, భౌతికశాస్త్రం వంటి సబ్జెక్టుల్లో చాలా మంది విద్యార్థులు ఆశించిన స్థాయిలో మార్కులు సాధించకపోవడంతో వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల మార్కులను విశ్లేషించి, ఏ సబ్జెక్టులో, ఏ అధ్యాయంలో వెనుకబడి ఉన్నారో గుర్తించి విద్యార్థులు తమ దినచర్యలో భాగంగా తెల్లవారుజామునే ఆయా పాఠ్యాంశాలను చదివేలా వ్యక్తిగతంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయం తొలగించి, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.సిలబస్‌ను నిర్ణీత గడువులో పూర్తి చేసి, అనంతరం పునశ్చరణకు తగిన సమయం కేటాయించాలన్నారు. విద్యార్థులు కేవలం తమకు ఇష్టమైన సబ్జెక్టులకే పరిమితం కాకుండా, బలహీనంగా ఉన్న సబ్జెక్టులపై కూడా సమానంగా దృష్టి పెట్టేలా దిశ నిర్దేశం చేయాలన్నారు. పాఠశాలకు విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు దసరా సెలవుల అనంతరం వెంటనే పాఠశాలకు తిరిగి రావాలని, కుటుంబ కార్యక్రమాలు లేదా ఇతర కారణాలతో తరచూ గైర్హాజరు కాకూడదని తెలిపారు. పాఠశాలకు రావడం మానేసిన లేదా తరచూ గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, మెరుగైన మార్కులు సాధించేలా కృషి చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును కూడా పరిశీలించారు. విద్యార్థుల యూనిఫాంల పంపిణీ, వాటి కొలతలు, కుట్టింపు, వినియోగంపై కలెక్టర్ ఆరా తీశారు.ప్రతి విద్యార్థి పాఠశాలకు యూనిఫాంలోనే హాజరుకావాలని సూచించారు. యూనిఫాంల కొలతలు సరిగా లేకపోతే అవసరమైన మార్పులు చేయించి, విద్యార్థులకు సరిపోయేలా చూడాలని సంబంధిత సిబ్బందికి తెలిపారు. అదేవిధంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్ పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని పుస్తకాలు లేదా పార్ట్-2 పాఠ్యసామగ్రి ఇంకా అందాల్సి ఉందని ఉపాధ్యాయులు వివరించగా, విద్యార్థుల చదువుకు అంతరాయం కలగకుండా అవసరమైన పుస్తకాలు సకాలంలో అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారులు తరచు తమ సమీపంలోని విద్యాసంస్థలను సందర్శించి పర్యవేక్షించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు, వ్యవసాయానికి నీటి సరఫరా, తదితర పరిస్థితుల గురించి కూడా కలెక్టర్ గ్రామ సర్పంచినీ అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సర్పంచ్ కృష్ణారెడ్డి, డీఈవో విజయలక్ష్మి, గద్వాల మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు నాగేష్, తదితరులున్నారు.

మల్దకల్‌లో 14 మంది బాల కార్మికులకు విముక్తి..

- ముగ్గురు యజమానులకు షోకాజ్ నోటీసులు..

- అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బి. వేణుగోపాల్

మల్దకల్ అక్టోబర్ 29(విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక రెస్క్యూ ఆపరేషన్‌లో 14 మంది బాల కార్మికులను గుర్తించి రక్షించినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బి. వేణుగోపాల్ తెలిపారు. వీరిలో నెతోనిపల్లికి చెందిన 8 మంది, ఆలూరుకు చెందిన ముగ్గురు, పెద్దొడ్డికి చెందిన ఇద్దరు, అరగిద్దకు చెందిన ఒకరు ఉన్నారు. పత్తి విత్తనాల పొలాల్లో పనుల కోసం మూడు వాహనాల్లో బాలలను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి అరగిద్ద ఆంజనేయులు (రాయపురం), కురువ వీరేష్ (పెద్దొడ్డి), జమ్మన్నలపై విచారణ చేపట్టి, ముగ్గురు యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. రక్షించిన బాలలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సి డబ్ల్యూ సి) ముందు హాజరుపరిచి, కౌన్సెలింగ్ అనంతరం చైల్డ్ హోమ్‌కు తరలించారు. బాల కార్మిక నిషేధం, నియంత్రణ చట్టం1986 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన యజమానులకు ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.20,000 నుంచి రూ.50,000 వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు. విచారణ ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను పనులకు పంపకుండా విద్యను అభ్యసించేలా చూడాలని, బాలల హక్కులు, భవిష్యత్తును కాపాడాలని ఆయన కోరారు. ఎక్కడైనా బాలలను పనుల్లో పెట్టినట్లు లేదా పనుల కోసం తరలిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో కార్మిక శాఖ సీనియర్ అసిస్టెంట్ అబ్రహం, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించాలి...

- జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29:(విజన్ ఆంధ్ర) : జిల్లాలో రహదారిరహదారి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశానికి ఎస్.పి. నితికా పంత్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాలు జరగకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను అదేశించారు. జాతీయ రహదారిపై తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని, జాతీయ రహదారులు, ఇతర రహదారులలో ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. సమాధానం రాయబడిన వారికి ప్రధానమంత్రి రహత్ పథకం క్రింద ఉచితంగా చికిత్స అంది అవకాశం ఉందని తెలిపారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ / సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారులు భవనాలు, పంచాయతీ రాజ్ రహదారులపై గుంతలను వెంటనే పూడ్చాలని, మూలమలుపుల వద్ద చెట్ల కొమ్మలు, పిచ్చి చెట్లను తొలగించాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రత నియమావళి పై అవగాహన కల్పించాలని తెలిపారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాలలో రహదారులపై పశువులు సంచరించకుండా పశువుల యజమానులకు నోటీసులు జారీ చేయాలని, రహదారి ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లా ఎస్.పి. మాట్లాడుతూ నెలరోజుల వ్యవధిలో రహదారు ప్రమాదాలలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డి ఎస్ పి అశోక్, రహదారులు భవనాలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై కలెక్టర్ ఫోకస్

- 3,934 ఇళ్ల నిర్మాణాలు పూర్తి.. మిగతా పనులు వేగవంతం చేయాలి

- లబ్ధిదారులకు ప్రభుత్వ సాయంపై అవగాహన కల్పించాలి: గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర బ్యూరో): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు 6,465 ఇళ్లకు ముగ్గు పోయగా, 5,479 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయికి, 4,858 గోడల స్థాయికి, 4,585 స్లాబ్ స్థాయికి చేరుకున్నాయని, 3,934 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని కలెక్టర్ వెల్లడించారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల పనులను వేగవంతం చేసి, లబ్ధిదారులు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ పురోగతిని ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, నిర్మాణ దశల ఫొటోలను హౌసింగ్ ఏఈలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న లబ్ధిదారులు సైతం త్వరగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల అధికారులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. సమావేశంలో ఇన్‌చార్జి హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఖాజా ముజాఫరుద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వరలక్ష్మి రైస్ మిల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

కె.టి. దొడ్డి అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా కె. టి దొడ్డి మండల పరిధిలో నందిన్నె గ్రామంలో శ్రీ వరలక్ష్మి రైస్ మిల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొని రిబ్బన్ కటింగ్ చేసి స్విచ్ ఆన్ చేసి రైస్ మిల్లు ప్రారంభించారు.ఎమ్మెల్యే కి మిల్లు యజమాని శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, నందిన్నె ప్రకాష్ రావు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమంతు, జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షులు రాజశేఖర్, మాజీ ఎంపీపీ విజయ్, నాయకులు ఉరుకుందు మైలగడ్డ చంద్రశేఖర్, యుగేందర్ గౌడ్, వెంకటేష్, రంగారెడ్డి, మహాదేవుడు, నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

17వ రోజుకు చేరుకున్న ఉద్యోగుల రిలే దీక్షలు



నారాయణపేట అక్టోబర్ 29(విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం టీజీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి నారాయణపేట జిల్లాలో 17వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం గౌరవ అధ్యక్షులు బిక్షపతి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తూ ఆరోగ్య శాఖలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమకు ఉద్యోగ భద్రత లేకపోవడం ఆవేదన కలిగిస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రజలకు వైద్య సేవలు అందించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని వివరించారు. సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించి, తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెంకట రమణ, కోశాధికారి రాఘవేందర్, సభ్యులు నరసింహారావు సగరి, మోనేష్ చారి, తిరుపతి, శ్రీలత, అర్చన, ఐశ్వర్య, నవ్య దీప్తి, శ్వేత శ్రీ, రామస్వామి, వినోద్, గాయత్రి, అజారుద్దీన్, ఆశ బి, రామేశ్వరి, అపర్ణ, నాగజ్యోతి, పుష్ప, సుమిత్ర, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లాలో నూతన ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 29(విజన్ఆంధ్ర) : ప్రజలకు జిల్లా కేంద్రంలోనే మెరుగైన ఆధార్ సేవలు అందుబాటులోకి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కామారెడ్డి జిల్లా కేంద్రంలో నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రం హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయానికి అనుబంధంగా పనిచేస్తుందని, ప్రజలకు ఆధార్ నమోదు, ఆధార్ వివరాల సవరణలతో పాటు ఇతర ఆధార్ సంబంధిత సేవలను సులభంగా అందించేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని 14 జిల్లాల్లో ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా కామారెడ్డి జిల్లాలో ఈ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న 14 జిల్లాల్లో కామారెడ్డి 12వ జిల్లాగా నిలిచిందని తెలిపారు. సాధారణ ఆధార్ కేంద్రాలతో పోలిస్తే ఈ కేంద్రంలో మరిన్ని ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ వెల్లడించారు. ఆధార్‌కు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం, నిలిపివేయబడిన ఆధార్ నంబర్లకు సంబంధించిన సమస్యల పరిష్కార ప్రక్రియ వంటి సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని వివరించారు. గతంలో ఆధార్‌కు సంబంధించిన కొన్ని ప్రత్యేక సేవలు పొందేందుకు హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం జిల్లా కేంద్రంలోనే ఈ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు నిరంతరాయంగా ఆధార్ సేవలు అందించేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఖ×ణూ×) తరపున ప్రత్యేక అధికారి కూడా ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆధార్ సంబంధిత సమస్యల పరిష్కారంలో ఈ కేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి, ఎంపీడీవో హెప్సీబా రాణి, ఈడియం ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీమ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఘన నివాళులు

ఇంద్రవెల్లి కేంద్రంలో పూజలు నిర్వహించి పూలమాలలు వేసిన అధికారులు, ఆదివాసీ నాయకులు

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర)ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన వీర యోధుడు కొమురం భీమ్‌కు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఘనంగా నివాళు లర్పించారు. గురువారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కొమురం భీమ్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఐటీడీఏ పీవో మంద మకరందు, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ ఆశయాలు, ఆదివాసీల హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఆదివాసీ సమాజ అభ్యున్నతి, గిరిజనుల హక్కుల పరిరక్షణలో కొమురం భీమ్ పోరాట స్ఫూర్తి ఎప్పటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో మహేందర్, ఎంపీవో సంజీవ్ రావు, కొమురం భీమ్ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మెస్రం నాగ్‌నాథ్, కేస్లాపూర్ రాయిసెంటర్ సార్‌మెడి మెస్రం వెంకటరావు పటేల్, గిన్నేరా రాయిసెంటర్ సార్‌మెడి మెస్రం దుర్గ, ఇంద్రవెల్లి సర్పంచ్ రాథోడ్ మోహన్ సింగ్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, ఆదివాసీ నాయకులు పూర్కా చిత్రు, కనక తుకారామ్, జుగాదిరావు, గేడం భరత్, సుంకట్ రావు, పలువురు ప్రజాప్రతినిధులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

భూ పునఃసర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

- భూ భారతి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలి - కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్–29(విజన్ ఆంధ్ర) : భూ పునఃసర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను, భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ పునఃసర్వే మొదటి విడతలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్వే పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. భూ భారతి కింద అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, గడువు దాటిన దరఖాస్తులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడంతో పాటు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ పర్యటనలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ,సుల్తానాబాద్ తహసీల్దార్ బషిరుద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు కావాలి ఇదే మన లక్ష్యం.

- ఉద్యోగులు, ఉపాధ్యాయులకు టీఎస్ సీపీ ఎస్ఈ య జిల్లా అధ్యక్షులు కృపాకర రెడ్డి పిలుపు

నారాయణపేట, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు కావాలి ఇదే మన లక్ష్మమని ఉద్యోగులు ఉపాధ్యాయులకు టీఎస్ సిపి ఎస్ఇయు నారాయణపేట జిల్లా అధ్యక్షులు కృపాకర రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ ఓటు నమోదు చేసుకోవడంతోపాటు, తమ కుటుంబాల్లోని అర్హులైన పట్టభద్రులకు, సహచరులకు అవగాహన కల్పించి వారిని కూడా ఓటర్లుగా నమోదు చేయించాలని పిలుపునిచ్చారు.ఒక్కొక్కరం ఒక్క అడుగు ముందుకేస్తే, అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు సాధ్యమవుతుందని తెలిపారు. ఇతరులకు ఆదర్శంగా నిలుస్తూ, ఓటరు నమోదు కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాదేవ్, భాస్కర్ రెడ్డి, సత్యపాల్, రాఘవేంద్ర చారి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులపై కొరడా ఝులిపించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్

- జిల్లా వ్యాప్తంగా 13 మండలాలలో 25 బృందాలచే ఆకస్మిక దాడులు.
- జిల్లాలో 18 కేసుల నమోదు.
- అక్రమ వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక.
- లైసెన్సు లేని వడ్డీ వ్యాపారస్తులపై కఠిన చర్యలు.

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 28 (విజన్ ఆంధ్ర)రైతులు, అమాయక ప్రజల నడ్డి విరుస్తూ వారి రక్తాన్ని పిండి పీడిస్తున్న వడ్డీ వ్యాపారులపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కఠినంగా వ్యవహరిస్తూ, జిల్లాలో ఏకకాలంలో 13 మండలాలలో 25 బృందాలచే ఆకస్మిక దాడి నిర్వహించడం జరిగింది. ప్రజల వద్ద వడ్డీ పేరుతో వారి నడ్డి విరుస్తూ ప్రజల రక్తాన్ని పిండి పీలుస్తున్న అక్రమ వ్యాపారస్తుల గుండెల్లో ప్రశాంతత లేకుండా జిల్లా ప్రజలకు న్యాయం చేసే విధంగా జిల్లా పోలీసు యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ వ్యాపారాలు నిర్వహించకుండా కఠినమైన చర్యలు తీసుకుంటూ కేసులు నమోదు చేస్తూ వారి ఆటలను కట్టడి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపడమే జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రథమ లక్ష్యం. ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం ఏకకాలంలో 13 మండలాలలో 25 బృందాలచే దాడులు నిర్వహించగా 18 కేసుల నమోదు అయినట్లు వివరించారు. వడ్డీ వ్యాపారుల వద్ద నుండి ప్రామిసరీ నోట్లు, బ్యాంకు చెక్కులు, రిజిస్టార్లు, స్థలాల ఇళ్ళ డాక్యుమెంట్లు, వంటి వాటిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. అమాయక ప్రజలను మోసం చేస్తూ ప్రజల అవసరాలకు అధిక వడ్డీలను వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో 3 కేసులు నమోదు. ఆదిలాబాద్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో 3 కేసు నమోదు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలో 4 కేసులు నమోదు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లో 1 కేసులు నమోదు. జైనథ్ పోలీస్ స్టేషన్ నందు ఒక కేసు నమోదు. బేల పోలీస్ స్టేషన్ నందు ఒక కేసు నమోదు. బోథ్ పోలీస్ స్టేషన్ నందు ఒక కేసు నమోదు. ఉట్నూర్ పోలీస్ స్టేషన్ నందు 2 కేసులు నమోదు. గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ నందు ఒక కేసు నమోదు. నార్నూర్ పోలీస్ స్టేషన్ నందు 1 కేసు నమోదు. నేరడిగొండ పోలీస్ స్టేషన్ నందు 1 కేసు నమోదు. కేసులు నమోదు అయిన వారిపై ఆయా పోలీస్ స్టేషన్లో పరిధిలో సెక్షన్ 3 (5)(ఎ) తెలంగాణ ఏరియా మనీ లెండర్స్ ఆక్ట్ 1349 కింద కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వారి వివరాలు ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోలి . ఎస్ కే సాజిద్ ఏ సాజిత్ గౌడ్ s/o అక్బర్ . ఎర్రోజు కేశవ్ s/o ఎర్రోజు రమణయ్య, బంగారు షాప్ యజమాని.. ఓరగంటి రఘు, కొలిపుర. ఆదిలాబాద్ టు టౌన్ పరిధిలో . టాపిక్ అహ్మద్ ఏ జన్ను. . షేక్ అక్బర్ s/o షేక్ సద్దాం మావల పోలీస్ స్టేషన్ పరిధిలో . దుర్గా శేఖర్ రెడ్డి . దాసరి నరోత్తం . చిట్టి రాజేశ్వర్ . షేక్ ఆసిఫ్, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు. . అజయ్ కుమార్ గాడ్సే, రాంపూర్. జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మకూరు అమరేందర్ s/o నారాయణ. బేల పోలీస్ స్టేషన్ పరిధిలో . కార్తీక్ బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ రమేష్, సాయి నగర్, బోథ్. ఉట్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సాయి రెడ్డి, దంతనపల్లి. ఇప్ప సంతోష్. నేరడిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో. కలాలి వెంకటరమణ, వడూర్. నార్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో . అరె అశ్విని, గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో . కేంద్రీ రాహుల్, మన్నూరు.

ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాల చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్

- రూ.27,500 విలువైన బంగారు, వెండి ఆభరణాల చోరీ కేసు ఛేదింపు
- గతంలోనూ పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తి
- నిందితుడిపై వివిధ పోలీస్ స్టేషన్లలో 19 కేసులులిమావల ఇన్స్పెక్టర్ బి డి ప్రేమ్ కుమార్

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ హౌసింగ్ బోర్డు, లైన్ నంబర్ 02లో ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేసిన కేసును మావల పోలీసులు ఛేదించి నిందితుడిని గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. న్యూ హౌసింగ్ బోర్డు, లైన్ నంబర్ 02కు చెందిన కల్లెం గణేష్ రెడ్డి ఈ నెల 29న రాత్రి ఇంటికి తాళం వేసి రిమ్స్ ఆసుపత్రిలో విధులకు వెళ్లాడు. మరుసటి రోజు మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చి చూడగా ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. ఇంట్లోని బీరువా తాళం కూడా తెరిచి ఉండటంతో పరిశీలించగా, అందులో ఉంచిన వెండి గిన్నె, వెండి గ్లాసుతో పాటు బంగారు ఉంగరాలు కనిపించలేదు. దీంతో బాధితుడు మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాల మొత్తం విలువ సుమారు రూ. 27,500. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, చోరీకి పాల్పడిన ఆదిలాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన లిసమీర్ ఖాన్ (28)లి ను నిందితుడిగా గుర్తించారు. నిందితుడు సమీర్ ఖాన్‌పై మావల, ఆదిలాబాద్ టూ టౌన్, ఆదిలాబాద్ వన్ టౌన్, తాంసి, గుడిహత్నూర్, జైనథ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంలో పలు కేసులు నమోదయ్యాయి. ఇంటి తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడిన కేసులతో పాటు ఇతర నేరాలకు సంబంధించి వివిధ పోలీస్ స్టేషన్లలో మొత్తం 19 కేసుల్లో అతని ప్రమేయం ఉన్నట్లు పోలీసు రికార్డుల ద్వారా తెలుస్తోంది. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, విలువైన బంగారు, వెండి ఆభరణాలను భద్రంగా ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఆరోగ్య పరిరక్షణే మనందరి ప్రథమ కర్తవ్యం: జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లాలో వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తున్నామని, ప్రజలందరూ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. గురువారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని నాగోబా విద్యార్థి నిలయంలో శంకర నేత్రాలయ హైదరాబాద్, వనవాసీ కళ్యాణ్ పరిషత్ (తెలంగాణ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పొర చికిత్సల ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన ఐటీడీఏ పీవో మంద మకరందు, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్, పిఓ వైద్యులు, రోగులతో మాట్లాడి చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే వ్యవసాయం, చదువులు, వ్యాపారాలు అన్ని రంగాలలో రాణించవచ్చని తెలిపారు. ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కేవలం తీవ్రమైన అనారోగ్య సమయాల్లో లేదా చివరి దశలో మాత్రమే ఆర్ఎంపీల వద్దకు వెళ్లే ధోరణిని మార్చుకోవాలని, ప్రాథమిక దశలోనే అర్హులైన ప్రభుత్వ వైద్యులను లేదా నిపుణులను కలవాలని స్పష్టం చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో అక్టోబర్ 31 వరకు కంటి పరీక్షలు నిర్వహించి, నవంబర్ 1 వరకు కంటి ఆపరేషన్లు కొనసాగుతున్నాయని వెల్లడించారు. కేవలం కంటి పరీక్షలు, ఆపరేషన్లే కాకుండా, అవసరమైన వారికి తదుపరి ఫాలో–అప్ సేవలు సైతం పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత పేదలకు ఇటువంటి సద్వినియోగ శిబిరాలు ఎంతో ప్రయోజనకరమని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ మంద మకరందు మాట్లాడుతూ.. గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇటువంటి మొబైల్ క్యాంపులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రత్యేక కంటి వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్న సామాన్యులకు ఈ శిబిరాలు గొప్ప అవకాశమని, ప్రజలు ఆరోగ్యంపై మరింత చైతన్యం కలిగి ఉండాలని అన్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో ఇప్పటివరకు 568 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 150 మందిని కంటి పొర ఆపరేషన్లకు ఎంపిక చేయగా, నిన్నటివరకు 30 మందికి, ఈరోజు మరో 30 మందికి విజయవంతంగా ఆపరేషన్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో వనవాసీ కళ్యాణ్ పరిషత్ కార్యకర్తలు సిడామ్ భీమ్రావు, హెచ్.కె. నాగు, ప్రకాష్, అజయ్, శంకర నేత్రాలయ కోఆర్డినేటర్ రాజు, వైద్యులు, స్థానిక సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రాలను సమర్పిస్తే కఠిన చర్యలు తప్పవు

- ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తుల ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి...
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి...
- ఓటరు నమోదు ప్రక్రియలో అక్రమాలకు తావు లేకుండా చూడాలి....
- రాజేంద్రనగర్ ఆర్డీఓ, తహసీల్దార్లు, శంషాబాద్ మున్సిపల్ అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశాలు..

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 29, (విజన్ ఆంధ్ర): నకిలీ ధృవపత్రాలను సమర్పిస్తే కఠిన చర్యలు తప్పవు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం, శంషాబాద్ మున్సిపల్ కార్యాలయాలను సందర్శించారు. మహబూబ్‌నగర్,రంగారెడ్డి,హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా దరఖాస్తుదారులు సమర్పించిన ఫారం–18లు, డిగ్రీ సర్టిఫికెట్లు, ఇతర విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం సమర్పించిన ప్రతి ఫారం–18లోని వివరాలను, జత చేసిన ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి ప్రామాణికతను నిర్ధారించాలని సూచించారు. దరఖాస్తుదారుల విద్యార్హతలు, డిగ్రీ సర్టిఫికెట్లు, ఇతర సంబంధిత పత్రాలను నిశితంగా పరిశీలించాలని రాజేంద్రనగర్ ఆర్డీఓ, రాజేంద్రనగర్ మరియు శంషాబాద్ తహసీల్దార్లు, శంషాబాద్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు.ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాలని, సమర్పించిన ధ్రువపత్రాలు నిజమైనవా, సంబంధిత దరఖాస్తుదారులకు చెందినవా అనే విషయాలను నిర్ధారించాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల్లో పొందుపరిచిన వివరాలు, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల మధ్య ఏవైనా వ్యత్యాసాలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి, అవసరమైన ధ్రువీకరణ చేపట్టాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు.ఎవరైనా దరఖాస్తుదారులు నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు, బోగస్ ధ్రువపత్రాలు లేదా ఇతర తప్పుడు పత్రాలను సమర్పించి ఓటరు నమోదుకు ప్రయత్నించినట్లు గుర్తిస్తే, అటువంటి వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా ధ్రువీకరించాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహసీల్దార్ రాములు, శంషాబాద్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, శంషాబాద్ తహసీల్దార్ అమరలింగం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అలంపూర్ శాసనసభ్యులు విజయుడు చేతుల మీదుగా ఉండవెల్లి మండలం, రాజోలి మండలాలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మొత్తం 76 మంది లబ్ధిదారులకు 76 లక్షల 8 వేల 816 రూపాయలు విలువైన చెక్కులను అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచే ఈ పథకాలు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలనే లక్ష్యంతో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం -ఏడీఈ

అయిజ అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఏడీఈ నీలి గోవిందు తెలిపారు. ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా అదనపు పోల్, ఏబీ స్విచ్ లు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

రాహుల్ సభకు సంగారెడ్డి నుంచి ఢిల్లీ బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

- కార్యకర్తల బస్సులను జెండా ఊపి ప్రారంభించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ , 29(విజన్ ఆంధ్ర) : నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరిగే రాహుల్ గాంధీ బహిరంగ సభకు హాజరయ్యేందుకు సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో బయలుదేరారు. సంగారెడ్డి ఐబీ వద్ద అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. సదాశివపేట మండలం నుంచి సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సిద్దన్న, శ్రీనివాస్ యాదవ్‌లతో కలిపి మొత్తం 46 మంది బయలుదేరారు. కొండాపూర్ మండలం నుంచి ఆత్మ చైర్మన్ ప్రభు, నాయకులు నర్సింహారెడ్డి, మల్లారెడ్డిలతో కలిపి 26 మంది ఢిల్లీ పయనమయ్యారు. నిర్మల జగ్గారెడ్డి, భరత్ సాయిరెడ్డిలతో సహా సంగారెడ్డి నియోజకవర్గం నుంచి మొత్తం 150 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ సభకు హాజరుకానున్నారు. బస్సుల ప్రారంభ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, బబ్బు తదితరులు పాల్గొన్నారు.

పీ ఎం కిసాన్ కు దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం ఇవ్వాలని మోదీకి లేఖ

నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : దేశవ్యాప్తంగా రైతులకు పెట్టుబడి సహాయం కింద సంవత్సరానికి 6000 పీ ఎం కిసాన్ పథకం ద్వారా పొందుటకు అవకాశం కల్పించడం కోసం కటాఫ్ తేది పెంచాలని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా భారత ప్రధానమంత్రి మాన్యశ్రీ నరేంద్ర మోదీ కి విజ్ఞప్తి లేఖ -2 వ్రాసి ఎక్స్ ద్వారా పి ఎం ఓ ఇండియా కు మరియు నరేంద్ర మోదీ అకౌంట్ కు ట్యాగ్ చేయడం జరిగింది అని తెలిపారు.ఆగస్టు 1 తేదీన విజ్ఞప్తి లేఖ -1 ప్రారంభించడం జరిగిందని అన్నారు .ఈ లేఖలు కటాఫ్ తేది పెంచి రైతులకు పీ ఎం కిసాన్ పథకం ద్వారా 6000 వచ్చే వరకు వ్రాయడం జరుగుతుందని అన్నారు. రేపు గుజరాత్ లో 24 విడత నిధులు విడుదల చేసే సందర్భంగా ఈ పథకానికి అర్హులు అయిన రైతులు దరఖాస్తు చేసుకోవడం కోసం గతంలో ఉన్న కటాఫ్ తేది 31 జనవరి 2019 సవరించి కటాఫ్ తేది పెంచి అర్హులైన రైతులందరూ ఈ పథకం లో చేరుటకు అవకాశం ఇవ్వడం కోసం ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు.తల్లిదండ్రులు చనిపోయి భూమి మార్చుకున్న వారికి,కొత్తగా భూమి కొన్న వారికి, తెలువక బ్యాంకు ఖాతాలకు ఆధార్ కార్డు ఈ - కే వై సీ చేసుకొని వారికి ఈ పథకం ద్వారా 6000 వేలు రావడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి వారు దేశ వ్యాప్తంగా లక్షలాది మంది రైతులు ఉన్నారు కావున వారందరికీ తగిన న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రవాణా శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఇలంబర్తికి మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు

- సచివాలయంలో మర్యాదపూర్వక సమావేశం

- నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని మంత్రి ఆకాంక్ష

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర,అక్టోబర్ 29, సెక్రటేరియట్: రవాణా శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఇలంబర్తి, సచివాల యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఇలంబర్తిని హృదయపూర్వకంగా అభినందించి, పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, శాఖకు మరింత ప్రతిష్ట తీసుకురావాలని ఆకాంక్షించారు. రవాణా శాఖ ప్రజా జీవనంతో నిత్యం ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన శాఖ అని మంత్రి పేర్కొన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత పటిష్టం చేయడం, రోడ్డు భద్రతను పెంచడం, రవాణా సేవల్లో పారదర్శకత, వేగం, సౌలభ్యం తీసుకురావడం ప్రధాన బాధ్యత అని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు, శాఖలోని అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలని, ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే దిశగా పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. సుదీర్ఘ అనుభవం, పరిపాలనా సామర్థ్యంతో ఇలంబర్తి రవాణా శాఖను మరింత ముందుకు తీసుకెళ్తారన్న నమ్మకం వ్యక్తం చేశారు.

జలాల వృథా.. రైతు వ్యథ!!

- నెర్రెలు వారిన నేల.. నెరవేరని హామీలు
- రేవంత్ రెడ్డీ.. రైతు కన్నీటికి సమాధానమేది?
- రైతు గోసపై కేటీఆర్ గళం.. సర్కారుకు సూటి సవాల్

హైదరాబాద్ (పొలిటికల్ డెస్క్), అక్టోబర్ 29: పచ్చని చేలల్లో నెర్రెలు.. పాలకుల జేబుల్లో కాసుల గలగలలు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ చేసిన కుట్ర. పచ్చటి పైరు గొంతు ఎండి అల్లాడుతోంది.. చెమటోడ్చిన అన్నదాత కళ్లల్లో కన్నీరు ఇంకిపోయి నెర్రలు వారుతోంది. మొన్నటి దాకా కాళేశ్వరం జలాలతో కళకళలాడిన నేల, నేడు పాలకుల చేతకానితనానికి బలవుతోంది. వర్షాలు లేక ప్రకృతి పెట్టిన శాపం కాదు ఇది.. పక్కా ప్రణాళికతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతాంగంపై రుద్దిన మానవ నిర్మిత కరువు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాలకుల తీరుపై నిప్పులు చెరిగారు. గురువారం తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటిఆర్ రేవంత్ సర్కార్ పైన ప్రశ్నల వర్షం కురిపించారు.

కళ్లముందే జలధార.. రైతు చేతిలో నెర్రెవారిన చిప్ప!

నదులు ఉప్పొంగి ప్రవహించినా పొలాలకు మళ్లించే సోయి లేని దుస్థితిలో రాష్ట్ర పాలన కొట్టుమిట్టాడుతోంది. "నాలుగు నెలల ముందే గొంతు చించుకుని మొత్తుకున్నాం.. నీళ్లను ఒడిసిపట్టండి, రైతులను ఆదుకోండి అని హెచ్చరించాం" అంటూ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కళ్లముందే గోదావరి నుంచి 750 టీఎంసీలు, కృష్ణా నుంచి మరో 250 టీఎంసీల అమృత జలాలు సముద్రం పాలవుతుంటే.. చోద్యం చూసిన రేవంత్ సర్కార్ చేతగానితనం కాదా ఇది? ప్రాజెక్టుల గేట్లు ఎత్తడం చేతకాదు, మోటార్లు ఆన్ చేసే చిత్తశుద్ధి లేదు.. వెరసి వెయ్యి టీఎంసీల జీవజలాన్ని వృథాగా దిగువకు వదిలేసి, తెలంగాణ పల్లెలను ఎడారిగా మార్చేశారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఓవైపు అన్నదాత ఆర్తనాదం.. మరోవైపు 'మూసీ' పేరిట దోపిడీ నాటకం!

ఒకవైపు సాగునీరు అందక ఎండిన పైరును చూసి రైతు గుండె పగులుతుంటే.. మరోవైపు పాలకుల కన్ను ప్రజాధనంపై పడింది. మూసీ సుందరీకరణ అనే రంగుల కలల వెనుక దాగి ఉన్నది పచ్చి స్వార్థమేనని కేటీఆర్ బట్టబయలు చేశారు. ఏకంగా లక్షన్నర కోట్ల రూపాయల భారీ లూటీకి తెరతీశారని, పేదల గూళ్లను కూల్చుతూ, బడా బాబుల జేబులు నింపేందుకు ఢిల్లీకి మూటలు సర్దే సరికొత్త దందా మొదలైందని నిప్పులు చెరిగారు.

ఒక్క చుక్క నీటికి రైతులు ట్యాంకర్ల కోసం ఎదురుచూసే దుస్థితి తెచ్చిన ఈ సర్కారుకు పాలించే అర్హత ఉందా అని ప్రజలు నిలదీస్తున్నారు. కన్నీటితో తడుస్తున్న చేల సాక్షిగా.. సాగునీటి ద్రోహానికి, ఈ కపట పాలనకు కాలమే కాదు, తెలంగాణ సమాజమే తగిన గుణపాఠం చెబుతుందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

గద్వాల డిపో నూతన మేనేజర్ శ్రవణ్ కుమార్ ని సన్మానించిన టి డబ్ల్యూ యు. డిపో కమిటీ

గద్వాల అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల ఆర్టీసీ డిపోకు నూతనంగా విచ్చేసిన డిపో మేనేజర్ శ్రవణ్ కుమార్ ని తెలంగాణ వర్కర్స్ యూనియన్ (-టిడబ్ల్యూయు) గద్వాల్ డిపో కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు, అనంతరం కమిటీ సభ్యులు తమను పరిచయం చేసుకొని, డిపో మేనేజర్ తో ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శ్రవణ్ కుమార్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. డిపోలో నెలకొన్న సమస్యలు, కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయకులను అడిగి తెలుసుకున్నారు. తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. మీ సహకారం కావాలని అడిగారు. నూతన డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించడం పట్ల కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు..

గట్టు అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర)దజోగులాంబ గద్వాల జిల్లా డిఎంహెచ్ఓ. డాక్టర్.సంధ్యా కిరణ్మయి ఆదేశాల మేరకు, సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రదీప్ కుమార్, స్థానిక వైద్యాధికారి డా. సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో గట్టు మండలంలోని కేజిబివి.పాఠశాలలో పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పొగాకు వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, పొగాకు ఉత్పత్తులకు దూరంగ ఉండాల్సిన ఆవశ్యకత, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భ పొగాకు వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలను చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా యువత సిగరెట్లు, బీడీలు, గుట్కా తదితర పొగాకు ఉత్పత్తులకు దూరంగ ఉండాలని సూచించారు. పొగాకు వినియోగం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వివరించారు. విద్యార్థి దశ భవిష్యత్తుకు పునాది వేసుకునే కీలకమైన దశ అని, ఈ సమయంలో చెడు అలవాట్లకు లోనుకాకుండ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. స్నేహితుల ఒత్తిడికి లేద ఇతరుల ప్రభావానికి లోనై పొగాకు వ్యసనాలకు బానిసలు కావద్దని తెలిపారు. తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కూడ పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని కోరారు. పొగాకు వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండ కుటుంబ ఆర్థిక పరిస్థితులపై, సమాజ ఆరోగ్యంపై కూడ ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని నివారించడం ద్వార అనేక అనారోగ్య సమస్యలను అరికట్టవచ్చని తెలిపారు. విద్యార్థులు పొగాకు ఉత్పత్తులకు పూర్తిగ దూరంగ ఉంటు, తమ స్నేహితులు, కుటుంబ సభ్యులకు కూడ వాటి వల్ల కలిగే నష్టాలను తెలియజేయాలని సూచించారు. క్రమం తప్పకుండ వ్యాయామం చేయడం, పోషకాహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవడం ద్వార ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ఈ అవగాహన సదస్సు ద్వార విద్యార్థులకు పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వ్యసనాలకు దూరంగ ఉండాల్సిన ఆవశ్యకత, ఆరోగ్య పరిరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి ప్రతి చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థినిలు, జిల్లా ఇన్చార్జి డిఈఎంఓ- హీర్యానాయక్, జిల్లా ఎన్సీడి- కో-ఆర్డినేటర్ వెంకటేష్, హెల్త్ అసిస్టెంట్ వెంకటాద్రి నాయుడు పాల్గొన్నారు.

30 తులాల బంగారం చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- అంతర్రాష్ట్ర ముఠా సభ్యురాలి అరెస్ట్..

- 25 తులాల ఆభరణాలు స్వాధీనం

- ప్రతిభ కనబరిచిన పోలీసు బృందానికి రివార్డులు ప్రకటించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్

మెదక్, అక్టోబర్ 29:(విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి) : బస్సు ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టును నిజాంపేట పోలీసులు రట్టు చేశారని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా బస్సులో చోరీకి గురైన 30 తులాల బంగారు ఆభరణాల కేసును పోలీసులు సవాలుగా తీసుకుని ఛేదించారని, ప్రధాన నిందితురాలిని అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి సుమారు 25 తులాల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు. నల్గొండకు చెందిన సూరం స్నేహ ఆగస్టు 26న రాఖీ పండుగ సందర్భంగా తన 30 తులాల బంగారు ఆభరణాలను బ్యాగ్‌లో పెట్టుకుని నిజాంపేటలోని తన తల్లిగారి ఇంటికి బయలుదేరారు. నిజాంపేట చేరుకున్న తర్వాత బ్యాగ్‌లోని నగలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితురాలిని గుర్తించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ మార్గదర్శకంలో, తూప్రాన్ డీఎస్పీ జె. నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో రామాయంపేట సీఐ బి. సైదా, నిజాంపేట ఎస్ఐ బి. రాజేష్‌లతో కూడిన ప్రత్యేక బృందాలు సమర్థవంతంగా పనిచేసి సరూర్‌నగర్‌కు చెందిన మేకల సంధ్య (30)ను అదుపులోకి తీసుకున్నాయని ఎస్పీ తెలిపారు. విచారణలో నిందితురాలు తన తల్లి సతుపాటి రాధిక, బంధువు అక్షింతల సంధ్య, బండి మోజెస్, బండి దుర్గలతో కలిసి ముఠాగా ఏర్పడి చోరీకి పాల్పడినట్లు వెల్లడైందన్నారు. చోరీ అనంతరం స్విఫ్ట్ కారు (టూ 08 జుఖీ 6174)లో హైదరాబాద్‌కు వెళ్లి, అక్కడి నుంచి ఇన్నోవా క్రిస్టా (ు+ 07 + 1888)లో పరారైనట్లు తెలిపారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ముఠా సభ్యులు ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా పరస్పరం సంభాషించుకునేవారని, హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, రాజమండ్రి, నిజామాబాద్, మెదక్ ప్రాంతాల్లోని బస్టాండ్లలోనూ చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. నిందితురాలి నుంచి 4 బంగారు చైన్లు, 4 లాకెట్లు, 1 పుస్తెల త్రాడు, 13 ఉంగరాలు, 1 ప్లాటినం ఉంగరం, నల్లపూసల దండలు, కంకణాలు, గాజులు, కమ్మలు, చంపస్వరాలు, ముక్కెర, సిక పువ్వు తదితర సుమారు 25 తులాల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న ఇతర నిందితులను అరెస్ట్ చేసేందుకు, మిగిలిన సొత్తును స్వాధీనం చేసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. బస్సులు, బస్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు ప్రజలు తమ విలువైన ఆభరణాలు, నగదు విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, చోరీ జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసును వేగంగా ఛేదించి నిందితురాలిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన రామాయంపేట సీఐ సైదా, ఎస్ఐలు రాజేష్, బాలరాజ్, హెడ్ కానిస్టేబుల్ సునీత, కానిస్టేబుళ్లు రాకేశ్, భాస్కర్, నాగభూషణ్, సాజిద్, లక్ష్మణ్, రాజు, కృష్ణ, శ్రీనివాస్ నాయక్ మరియు ఐటీ కోర్ సిబ్బంది విజయ్, వెంకట్, మహేందర్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

17 వ రోజుకు చేరిన ఎన్ హెచ్ ఎం కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా..

గద్వాల అక్టోబర్ 29(విజన్ ఆంధ్ర బ్యూరో) : రాష్ట్రవ్యాప్తంగా ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ గద్వాలలో నిర్వహిస్తున్న ధర్నా గురువారం 17వ రోజుకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన ధర్నా లో మాట్లాడుతూ కాంట్రాక్ట్ వ్యవస్థలో అనేక లోపాలు ఉన్నాయని, కాంట్రాక్ట్ ఉద్యోగులు వివక్షను ఎదుర్కొంటున్నారని అన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా రోగులకు సేవలు అందించారని, అలాంటి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.సమాన పనికి సమాన వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరితో నిరవధిక దీక్షకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్ఞాని, డాక్టర్ సౌజన్య, డాక్టర్ శరణ్య, డాక్టర్ ఏంజెల్, శివ, హనుమంతు, నరసింహులు ఉద్యోగులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు సెంటర్ల ప్రారంభం

కామారెడ్డి బ్యూరో(దోమకొండ) అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా దోమకొండ మండలంలో గురువారం వరి కొనుగోలు సెంటర్లను ప్రారంభించిన పిఏసిఎస్ చైర్మన్ అనంతరెడ్డి, సర్పంచ్ నర్సయ్య, మండలంలోని దోమకొండ, అంచనూరు., సంగమేశ్వర్ గ్రామాలలో కొనుగోలు సెంటర్ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, సెక్రెటరీ నవీన్ కుమార్, ప్రమోద్ రెడ్డి, మహమ్మద్ గులాం సొసైటీ కార్యవర్గం, నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వంద శాతం కల్పించాలి.

- నిర్లక్ష్యం వహించిన ఏడుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

- ఉపాధి హామీ పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున చాలామంది రైతులు ఇబ్బంది పడ్డారని, ఇలాంటి పరిస్థితుల్లో రైతు కూలీలకు విబిజీ రాంజీలో వంద శాతం ఉపాధి హామీ పనులు కల్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. విబిజి రాంజీ పథకంలో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఉపాధి హామీ పనులపై కలెక్టర్ గురువారం సాయంత్రం ఐడిఓసి సమావేశపు మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని రైతు కూలీలకు పెద్ద ఎత్తున జాబ్ కార్డులను అందజేసి గుర్తించిన పనులను చేయించాలన్నారు. వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు క్షేత్ర సహాయకులు పనులు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నేపథ్యంలో వారిని సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పంట కుంటలు, ఇంకుడు గుంతలు, రూఫ్ టాప్ హార్వెస్టింగ్, తదితర పనులను వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో జూరాల ప్రధాన కుడి కాలువతో పాటు ఆర్డీఎస్ కాలువల పరిధిలో ఉన్న డిస్ట్రిబ్యూటరీ కాలువలు, ఫీడర్ ఛానల్స్ లో పూడిక, పిచ్చి మొక్కల తొలగింపు పనులు కూడా చేపట్టాలని ఆదేశించారు. పొలాలకు రహదారులు లేని గ్రామాలను గుర్తించి పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణం చేపట్టవచ్చన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, తదితర ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం రూ.1.00 కోటి విలువైన పనులను చేసేందుకు అవకాశం ఉందన్నారు. సుమారు 375 రకాల పనులు విబిజి రాంజీలో చేయవచ్చని, సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే కూలీలకు 125 రోజుల పూర్తిస్థాయి పని రోజులు కల్పిస్తే రూ.30 వేలకు పైగా ఆదాయం సమకూరుతుందన్నారు. సొంత గ్రామాల్లోనే ఉపాధి హామీలో లబ్ధి పొందే అవకాశం ఉన్నప్పటికీ ప్రజలకు వలసపోయే పరిస్థితులు కల్పిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ ముషాహిదా బేగం, జెడ్పి డిప్యూటీ సీఈఓ నాగేంద్రం, పలువురు జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మార్చి చివరి నాటికి పుష్కర ఘాట్ పనులు పూర్తి చేసేలా చర్యలు

- రూ.23 కోట్లతో ఘాట్ పునర్నిర్మాణం, విస్తరణ

- రూ.10 కోట్లతో గౌతమేశ్వరాలయ అభివృద్ధి

- ఓదెల, రామగుండంలోనూ చిన్న ఘాట్లు

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్-29(విజన్ ఆంధ్ర) : 2027 గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ తెలిపారు. మంథని పుష్కర ఘాట్ పునర్నిర్మాణం, విస్తరణ పనులను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. గురువారం దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఘాట్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పుష్కర ఘాట్ అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేసిందని, టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. కాంట్రాక్టర్ ఎంపిక కూడా పూర్తయినందున త్వరలో పనులు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. మంథనిలో కాశీ తరహాలో ప్రతిరోజూ సాయంత్రం గోదావరి నదికి సప్త హారతులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. పుష్కరాల నేపథ్యంలో ఓదెల, రామగుండం ప్రాంతాల్లోనూ చిన్న ఘాట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. మంథనిలోని గౌతమేశ్వర స్వామి ఆలయాన్ని రూ.10 కోట్లతో ఆగమశాస్త్ర నిబంధనలకు అనుగుణంగా పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. పుష్కరాల ఏర్పాట్ల కోసం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్‌కమిటీకి మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షత వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన ఆదేశాల మేరకు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు చెప్పారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు, రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రైతులు పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లాలో మూడు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాలలోని హరిత, బాలాజీ పత్తి మిల్లులతోపాటు ఆలంపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న వరసిద్ధి వినాయక మిల్లులో సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులు ముందుగా కపాస్ కిసాన్ ఆప్ ను తమ ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని, మొబైల్ నెంబర్ ఓటిపి ద్వారా లాగిన్ కావాల్సి ఉంటుందన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న అనంతరం నిర్దేశిత తేదీల్లో రైతులు తమ పంటను సమీపంలోని సిసిఐ కొనుగోలు కేంద్రానికి తీసుకు వస్తే అధికారులు తేమ శాతం పరిశీలించి నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తారన్నారు. క్వింటాల్ కు ప్రభుత్వ మద్దతు ధర రూ.8667 ఉంటుందని, ఈ అవకాశాన్ని జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కలెక్టర్ పేర్కొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.